సంపుటి: 64 • సంచిక: 1 • సోమవారం 14 జనవరి 2019 •విజయవాడ
* పేజీలు: 22 • వెల: 5.00

•Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!



(కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి)
సంపద.. సందడి.. క్రాంతి.. శాంతి.. తిరునాళ్ళు.. తియ్యని అనుబంధాలు.. సంక్రాంతి అంటే పల్లెలకు పట్టంగట్టే పండుగ. సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేసే పండుగ. ప్రకృతిలో మనిషికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసే పండుగ. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది పండుగలకే పండుగ.. పెద్దపండుగ. భోగినుంచి ప్రారంభమై సంక్రాంతి, కనుమ, ముక్కనుమ అంటూ వారంరోజులపాటు తనివితీరా చేసుకుంటారు ఈ పండుగ. పల్లెల్లో ఈ సంక్రాంతి సంప్రదాయం తెలుస్తుంది నిలువెల్లా. అందుకనే ఉద్యోగ వ్యాపారాల నిమిత్తం పట్టణాలకు వెళ్ళేవారంతా ఈ పండుగకోసం రెక్కలు కట్టుకుని సొంతూరుకు వాలిపోతుంటారు. కాంక్రీటు కీకారణ్యంలో కొట్టుమిట్టాడే పట్టణవాసులంతా ఈ పెద్దపండుగ పుణ్యమా అంటూ స్వగ్రామాలకు చేరుకుని మట్టివాసనను నెమరువేసుకోవడమేకాక బంధుత్వాలు, స్నేహాల పునాదులు కదిలిపోకుండా కాపాడుకుంటూ ఉంటారు. ఈ పండుగల విశేషాలు తెలుసుకుందాం..

ఉట్టిపడే తెలుగు కాంతి...
ఊరంతా సంక్రాంతి

3 లో





30 నుంచి అసెంబ్లీ
మంత్రి యనమల

తుని, (తూర్పు గోదావరి), ప్రభ న్యూస్ : జనవరి 30 నుంచి ఫిబ్రవరి ఏడో తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ శీతాకాల సమావేశాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాసనసభ వ్యవహారాల మంత్రి యనమల రామకృష్ణుడు వెల్లడించారు. తునిలో మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిని ప్రారంభించిన అనంతరం, యనమల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరు వేలమంది దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు రాష్ట్ర శాసనసభ సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్య ఆరోగ్యానికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుందని, ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నప్పటికీ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ముస్లింల సంక్షేమానికి చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముస్లింలలో ఇప్పటికైనా మార్పు రావాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యనమల కృష్ణుడు, అభివృద్ధి కమిటీ చైర్మన్ పి శేషగిరిరావు, తాండవ షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ ఎస్ లోవ రాజు, మున్సిపల్ చైర్మన్ ఇనుగంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధ్యయనంతోనే పవన్ హామీలు...
ఆచరణ సాధ్యమే!



• ప్రతి అంశంపై లోతైన పరిశీలన • ఆతర్వాతే స్పష్టమైన ప్రకటన • గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం • కిడ్నీ బాధితుల కోసం కదిలిన సర్కార్ • పింఛన్లపై జనసేనాని హామీ • సముచితమేనని భావించి బాబు పెంపు • తాజాగా నగదు బదిలీపైనా దృష్టి • హోదా అంశంపై పవన్‌కు పార్టీలన్నీ వెన్నుదన్నుగా నిలిస్తే సిద్ధించేది • ఇప్పటికైనా పవన్‌కు నాయకత్వ బాధ్యత అప్పగిస్తే ప్రయోజనమని విశ్లేషకుల సూచనలు

అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి : విపక్షనేతలు ఎన్నికలకు ముందిచ్చే హామీలేవీ అమలుకు సాధ్యం కావన్నది సంప్రదాయంగా వినిపించే నినాదం. ఎన్నికల కోసం ముందూవెనుక చూడకుండా రాష్ట్ర ఆదాయ, వ్యయాల్నేమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ప్రజల్ని ఆకర్షించడమే పరిమావధిగా హామీలు గుప్పించేస్తారని భావిస్తారు. అయితే రాజకీయాల్లోకి ప్రవేశించడం నుంచి పార్టీ నిర్మాణం, సరికొత్త ఆశలు, ఆకాంక్షల్తో జాతిని ఆకర్షిస్తున్న పవన్ కళ్యాణ్ ఈ విషయంలో కూడా తన ప్రత్యేకతను నిరూపించుకున్నారు. తానధికారంలోకొస్తే చేస్తానన్న హామీలేవీ ఆచరణ సాధ్యమైనవేనని నిరూపిస్తున్నారు. ఇందుకు ఇటీవల వరుసగా జరుగుతున్న కొన్ని సంఘటనల్ని ఉదాహరణగా పేర్కొనొచ్చు. ఉద్దానం ప్రాంతంలో గత నాలుగు దశాబ్ధాలుగా కిడ్నీ బాధితుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. దాదాపు ప్రతి ఇంట్లో ఓ కిడ్నీవ్యాధి బాధితుడున్నాడు. ఈ వ్యాధి కారణంగా అక్కడి ప్రజల్లో ఉత్పాదకత తగ్గిపోయింది. ఉద్దానంలోని డజన్ల కొద్దీ గ్రామాలు నిర్వీర్యమయ్యాయి. ఇందుక్కారణం అక్కడి వాతావరణంతో పాటు భూగర్భ జలాలేనని గుర్తించినప్పటికీ కనీసం ప్రత్యామ్నాయ చర్యలు, వ్యాధి పీడితులకు సరైన చికిత్స అవకాశాల్ని ఏ ప్రభుత్వం కల్పించలేదు. పవన్ తొలిసారిగా ఉద్దానంలోని లోతట్టు గ్రామాల్ని కూడా సందర్శించారు. కిడ్నీ వ్యాధి పీడితుల్ని స్వయంగా పరామర్శించారు. తనతో పాటు వైద్యబృందాల్ని తీసుకెళ్ళారు. ఆ తర్వాత అమెరికాలోని డల్లాస్ వెళ్ళి సంబంధిత వైద్య నిపుణుల్తో దీనిపై చర్చించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనే ప్రయత్నం మొదలెట్టారు. ఇక్కడి వ్యాధి ప్రబలడానికి దారితీసిన అంశాలపై అధ్యయనానికి శ్రీకారం చుట్టారు. తానధికారంలోకి 3వ పేజీలో...

ఫిబ్రవరిలో రైతు సదస్సు
అధికారంలోకి రాగానే బకింగ్‌హామ్ కెనాల్ పునరుద్ధరణ: పవన్ ప్రకటన

అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి : ఫిబ్రవరి రెండోవారంలో రైతు సదస్సు నిర్వహించనున్నట్లు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వెల్లడించారు. వీటిలో రైతాంగ సమస్యల్ని విపులంగా చర్చిస్తామన్నారు. నివారణకనువైన ప్రణాళికల్ని రూపొందిస్తామన్నారు. తామధికారంలోకి రాగానే బకింగ్‌హామ్ కెనాల్‌ను పునరుద్ధరిస్తామన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా పెదరావూరు వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పవన్‌కళ్యాణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతుల్తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం మహిళలు, కార్యకర్తల్తో విడివిడిగా సమావేశాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన వార్నుద్దేశించి మాట్లాడారు. మార్పు రావడం ఖాయమని చెప్పారు. 2019తమకు తొలి ఎన్నికలే తప్ప ఆఖరివి కాదన్నారు. నేడు ఒక్కడుగు ముందుకేయెచ్చు. రేపు పదడుగు 3వ పేజీలో...

అన్నదాతలకు
9 గంటల ఉచిత విద్యుత్

కరెంటు కోసం రూ. 7,230 కోట్ల సబ్సిడీ

• 9 గంటల కరెంటు కోసం అదనపు ఖర్చు రూ.1200 కోట్లు • మార్చి నాటికి పెండింగ్ వ్యవసాయ కనెక్షన్లు పూర్తి • 'ముందు రైతులు' నినాదానికి అత్యధిక ప్రాధాన్యం • ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో పింఛన్లు పెంచుతూ సంక్రాంతి సంబరాలను ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేవలం 24 గంల వ్యవధిలోన మరో సంచలనాత్మక నిర్ణయం ప్రకటించారు. రాష్ట్రంలోని రైతాంగానికి ఇక నుంచి 9 గంటల పాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇస్తున్న 7 గంటల ఉచిత విద్యుత్తును 9 గంటలకు పెంచాలని, ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందించాలని ఇంధన శాఖ, విద్యుత్తు సంస్థలను ఆదివారం ముఖ్యమంత్రి 2వ పేజీలో...

ఔరా..!



కోడి పందాలకు
గ్రీన్ సిగ్నల్!



• సంప్రదాయ క్రీడల్ని పరిరక్షించుకోవాలి • కత్తులు కట్టడం, జూదం నేరం • స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు • సిద్ధమైన బరులు • లక్షల్లో పందాలు • ఇక సందడే సందడి

కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: ఊహించిందే జరిగింది. పోలీసుల బెదిరింపులు, అధికారుల అదిలింపులు ఉత్తుత్తివేనని తేలిపోయింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబే లైన్‌లోకొచ్చారు. సంప్రదాయ క్రీడల్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతుందంటూ పేర్కొన్నారు. కోళ్ళ మధ్య పోటీలు పెట్టుకోవచ్చన్నారు. అయితే దీన్ని జూదంగా మార్చడం నేరమని స్పష్టం చేశారు. కోళ్ళకు కత్తులు కట్టి హింస ప్రోత్సహించడాన్ని చట్టాలు అంగీకరించవన్నారు. తెలుగు లోగిళ్ళలో సంక్రాంతి మూడ్రోజులు బోగిపళ్ళు, పిండివంటలు, పశువుల అలంకరణ 2వ పేజీలో...

సిక్కుల కల నెరవేర్చాం

• వీసా లేకుండానే కర్తార్‌పూర్‌కు • సిక్కు అల్లర్ల బాధితులకు న్యాయం చేస్తాం • గురుగోవింద్ సింగ్ 350వ జయంతి ఉత్సవ స్మారక నాణెం విడుదల • దేశవ్యాప్తంగా గురునానక్ 550వ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తాం: ప్రధాని నరేంద్ర మోడీ


5 లో



గురుగోవింద్ సింగ్ స్మారక నాణాన్ని న్యూఢిల్లీలో విడుదల చేస్తున్న ప్రధాని మోడీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్

నిబంధనల పేరిట రైతులను ఇబ్బంది పెడుతున్న కేంద్రం

- కేంద్రంతో చర్చించాలని మంత్రులు పుల్లారావు, సోమిరెడ్డికి ఆదేశం
- సంక్షేమానికి చిరునామా తెదేపా
- టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ : ఇటీవల కురిసిన వర్షాల్లో తడిచి రంగు మారిన ధాన్యం కొనుగోళ్లలో నిబంధనల పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేయడంపై సీఎం చంద్రబాబు నాయుడు ఆగ్రహంవ్యక్తం చేశారు. ఆదివారం పార్టీ నేతలతో ఆయన ఉండవల్లి నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, రైతులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన ధాన్యం కొనుగోళ్ళలో కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని మండిపడ్డారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) నిబంధనల పేరిట రైతులను ఇబ్బంది పెడుతుందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు తక్షణమే ఢిల్లీ వెళ్ళి కేంద్ర మంత్రులు, అధికారులతో మాట్లాడాలని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావులను ముఖ్యమంత్రి ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

పేదల భవిష్యత్తు తెదేపాతోనే

పేదల భవిష్యత్‌కు తెలుగుదేశం పార్టీ భరోసాగా ఉంటుందని, వారి అండదండలు, దీవెనలే పార్టీకి శ్రీరామ రక్షని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. నేతలతో జరిగిన టెలికాన్ఫరెన్స్‌లో పించన్ల పెంపుపై ప్రజాప్రతినిధులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పింఛన్లను పది రెట్లు పెంచామని, ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ లోగా పింఛన్లను పంపిణీ చేస్తామన్నారు. 2019 జనవరి నుంచి పింఛన్ల మొత్తాన్ని పెంచామని అయితే ఈ నెలలో ఇవ్వాల్సిన రూ.1000 బకాయిని ఫిబ్రవరి నెల పింఛన్‌తో కలిపి చెల్లిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి మంచి భోజనం పెట్టి పింఛన్ అందించేఏర్పాటు చేయాలని పార్టీ నేతలకు, ప్రజాప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 54 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామని, ప్రతి మూడు కుటుంబాల్లో ఒక కుటుంబానికి పింఛన్ అందుతుందన్నారు. సంక్షేమానికి చిరునామా తెలుగుదేశం పార్టీ అని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం దేశంలో ఏ ఇతర రాష్ట్రంలో లేదని, ఇది ఒక చరిత్రని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులకు ఒక భరోసాను ఇచ్చామని చెప్పారు. అదే విధంగా చేనేత, గీత కార్మికులకు ఒక వరాన్ని ఇచ్చామని తెలిపారు. డప్పు కళాకారులు, చర్మకారులకు, దివ్యాంగులకు బాసటగా నిలిచామన్నారు. ప్రతి పేద కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

9 గంటల ఉచిత విద్యుత్

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. ఆమేరకు అవసరమైన ఏర్పాట్లు సత్వరమే చేపట్టాలని చెప్పారు. మార్చి నెలాఖరుకల్లా వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో పెండింగ్ లేకుండా చూడాలని డిస్కంలకు ఆదేశాలు జారీ చేశారు. 9 గంటల ఉచిత విద్యుత్తు వల్ల దాదాపు 17 లక్షల మంది రైతులు లబ్ధి పొందుతారని, బంగారం లాంటి పంటలు పండించుకోవచ్చని చెప్పారు. ఆదివారం ఆయన ఉండవల్లిలోని తన నివాసంలో విద్యుత్, ఇంధన శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు.

రైతులకు 9 గంటలు ఉచిత సరఫరా చేయడానికి 2, 800 మిలియన్ యూనిట్లు అదనంగా విద్యుత్తు కావాల్సి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు అజయ్ జైన్ ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం వ్యవసాయానికి వినియోగిస్తున్న 10, 831 మిలియన్ యూనిట్లకు ఇది అదనమన్నారు. ఇందుకోసం దాదాపు రూ.1200 కోట్ల అదనపు వ్యయమవుతుందని వివరించారు. ఉచిత విద్యుత్తు, కొత్త కనెక్షన్లకు గాను ప్రస్తుతం వ్యవసాయ రంగానికి రాయితీ కింద రూ. 6, 030.17 కోట్లు ఖర్చవుతుండగా..9 గంటలు ఉచిత విద్యుత్తు ఇవ్వడం వల్ల రూ.7230.17 కోట్లకు చేరుతుందని అజయ్ జైన్ తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం .. తాను సీఎంగా ఉన్న సమయంలో 1994-2004 మధ్య కాలంలో తొమ్మిది గంటల ఉచిత విద్యుత్తును అమలు చేసానని, మళ్లీ ఇప్పుడు జన్మభూమి కార్యక్రమంలో భాగంగా 15 రోజుల క్రితమే 9 గంటల ఉచిత విద్యుత్తును ప్రకటించానని చెప్పారు. రైతుల సంక్షేమం తప్ప తనకింకేదీ ప్రధానం కానే కాదని స్పష్టం చేశారు. తమది రైతు హిత ప్రభుత్వమన్నారు. రైతు శ్రేయస్సు కోరే ప్రభుత్వంగా రైతులే ముందు అన్న నినాదంతో ముందు కెళ్తున్నామన్నారు. అన్నదాత లబ్ధి కోసం ఎంత ఖర్చు పెట్టేందుకైనా వెనకాడనన్నారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్తు కోసం ఇంత భారీ మొత్తంలో రాయితీని దేశంలోని ఏ రాష్ట్రం ఇవ్వడం లేదని చెప్పారు. నాణ్యమైన ఉచిత విద్యుత్తు, అనేక ఇతర సంక్షేమ పథకాల ద్వారా రైతుల సాధికారతకు కృషి చేస్తున్నామన్నారు. వ్యవసాయ కనెక్షన్లన్నింటినీ 2019 మార్చి నాటికి పూర్తి చేయాలని విద్యుత్తు సంస్థలను ఈ సందర్భంగా ఆదేశిస్తున్నా అని చెప్పారు.



వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంతోపాటు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి తాను కట్టుబడి ఉంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. రైతులకు ప్రతి ఎకరానికి నీటిని అందించడం, విద్యుత్ సరఫరా, అర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్ర ముఖచిత్రమే మారిపోతుందన్నారు. రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందన్నారు. నిరంతర విద్యుత్తు సరఫరా వల్ల రాష్ట్రానికి భారీగా లబ్ధి చేకూరుతుందని, దాదాపు 80 శాతం ప్రజలు విద్యుత్తు సరఫరాపై సంతృప్తిగా ఉన్నారని సీఎం చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ 22 మిలియన్ యూనిట్ల లోటుతో తీవ్ర విద్యుత్ సంక్షోభం ఎదుర్కొందన్నారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత చేపట్టిన చర్యలతో మిగులు విద్యుత్ రాష్ట్రంగా నిలిచిందని గర్వగాచెబుతున్నానన్నారు. 2014లో 9వేల మెగావాట్లుగా ఉన్న స్థాపిత విద్యుత్ సామర్థ్యం 18 వేల మెగావాట్లకు చేరిందన్నారు. రాష్ట్రప్రభుత్వ అద్భుత పనితీరుకు ఇదే నిదర్శనం అని చంద్రబాబు తెలిపారు. రైతులకు 16 లక్షల ఇంధన సామర్థ్య, సోలార్ పంపుసెట్లు అందజేయనున్న తొలిరాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఖ్యాతికెక్కిందన్నారు. పాత పంపుసెట్ల స్థానంలో ఒక్కొకటి రూ.40 వేల విలువైన పంపుసెట్లను నేటికీ దాదాపు 42000 ఉచితంగా అందజేసినట్లు చెప్పారు. ఈ పంపుసెట్లు స్మార్ట్ ప్యానెల్, సిమ్ కార్డుతో ఉంటాయని.. దీనివల్ల రైతులు ఇంట్లో ఉండే ఫోన్ల ద్వారా తమకు అనుకూలమైన సమయాల్లో ఆన్, ఆఫ్ చేసుకోవచ్చని వివరించారు. ఇంధన సామర్థ్య పంపు సెట్ల ద్వారా 30 శాతం విద్యుత్తు ఆదా అవడమే గాక 15 శాతం నీటి పంపింగ్ సాధ్యమవుతుందన్నారు. ఇంధన సామర్థ్యంతో ఆదా చేసిన సొమ్మును రైతుల సంక్షేమానికే వినియోగిస్తామని వెల్లడించారు. ఈ పంపు సెట్ల వల్ల రైతులకు ఐదేళ్ల పాటు నిర్వహణా ఖర్చుల భారం కూడా తప్పుతుందని సీఎం వివరించారు.

రైతులకు కొత్తగా మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా ప్రస్తుతం ఒక్కో వ్యవసాయ పంపుసెట్లపై ఉన్న రూ.35 వేల రాయితీ రూ.లక్షకు పెరుగుతుందని ఇంధన శాఖ మంత్రి కళావెంకట్రావు తెలిపారు. ఏపి డిస్కంలు ఇప్పటికే రాష్ట్రంలో కొత్తగా 42 వేల ఇంధన సామర్థ్య పంపుసెట్లను అమర్చినట్లు ఇంధన శాఖ, ఐ అండ్ ఐ, సీఆర్డీఏ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ ఏడాది రూ.2,625 కోట్ల వ్యయంతో ఒక్కోటి రూ.3.5 లక్షల విలువైన 75 వేల సౌర పంపుసెట్లు అమర్చనున్నట్లు తెలిపారు. 3 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన సౌర పంపుసెట్లకు రైతులు రూ.55 వేలు మాత్రం చెల్లిస్తే సరిపోతుందన్నారు. తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ సరఫరాకు సంబంధించి సమగ్ర నివేదికను త్వరలో ముఖ్యమంత్రికి అందజేయనున్నట్లు ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి, ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ, సీఎం ప్రత్యేక కార్యదర్శి సతీశ్‌చంద్ర, సీఎం ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్, విద్యుత్ శాఖ సలహాదారు కె.రంగనాథం, ట్రాన్స్‌కో జేఎండీలు దినేశ్ పరుచూరి, ఉమాపతి, డిస్కంల సీఎండీలు ఎం.ఎం.నాయక్, హెచ్.వై.దొర, నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర బాబు, ఏపీఎస్పీడీసీఎల్ ఎండీ ఆదిశేషు ఈ టెలికాన్ఫరెన్సులో పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతీక సంక్రాంతి

- విశాఖలో జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు
- ముఖ్య అతిథిగా హాజరైన సినీనటుడు అలీ



విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో : భారతదేశంలోనే సంస్కృతి, సాంప్రదాయాలకు సంక్రాంతి పర్వదినం ప్రతీకగా నిలుస్తుందని ప్రముఖ సినీ హాస్యనటుడు అలీ అన్నారు. ఆదివారం ఇక్కడ తాటిచెట్లపాలెం జంక్షన్‌లో జనసేన పార్టీ ఉత్తర నియోజకవర్గం మహిళా నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు అలీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ ప్రతీ ఏటా సంక్రాంతి పర్వదినాన్ని ప్రజలంతా ఆనందంగా జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని దృష్టిలో ఉంచుకొని ముగ్గులు పోటీలు నిర్వహించిన పసుపులేటి ఉషాకిరణ్‌ను అలీ అభినందించారు. ఈ సందర్భంగా ప్రథమ బహుమతి కింద నవీన అనే యువతికి కేజీ వెండి, ద్వితీయ బహుమతికి బంగారు చైను, మూడో బహుమతికి 32 ఇంచ్‌ల కలర్ టీవీని అలీ అందజేశారు. గౌరవ అతిథిగా హాజరైన జనసేనపార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్ గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం అంటేనే సంబరాలకు మారుపేరన్నారు. ప్రజలంతా సంతోషమయంగా ఈ పండుగను జరుపుకోవాలని శ్రీనుబాబు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గాజువాక మాజీ శాసనసభ్యుడు చింతలపూడి వెంకటరామయ్య, పార్టీ నేతలు రమణారెడ్డి, వేగి దివాకర్, గుంటూరు భారతి, బొడ్డేపల్లి రఘుతో పాటు ముగ్గుల పోటీల న్యాయ నిర్ణేతలుగా వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, మాజీ ఎమ్మెల్సీ రేవు రత్నకుమారి, సంఘ సేవకురాలు పాలూరి శేషుమాంబలు వ్యవహరించారు. అలీరాకతో సందడిగా మారింది.

గ్రీన్ సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

ఎలాగో కోడిపందాలు కూడా అలాంటివేనన్నారు. సంప్రదాయాల్ని కాపాడాల్సిన బాధ్యత ఉందంటూ తాను పోలీసులక్కూడా చెప్పానన్నారు. అయితే హింస, కత్తులు, జూదాల్ని మాత్రం అరికడతామన్నారు. తెలుగుదేశం శ్రేణులు మాత్రం ఈ కోడిపందాలకు దూరంగా ఉండండటూ ఆయన సూచించారు. దీంతో పందాలపై స్పష్టతొచ్చేసింది. సోమవారం తెలతెలవారుతుండగానే కోడిపందాలకు నిర్వాహకులు సిద్ధమైపోతున్నారు. గత మూడ్రోజులుగా భయం భయంగా మారుమూల ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పందెం బరుల్ని ఇప్పుడు గ్రామాల పొలిమేరల్లోకి మార్చేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు బహిరంగంగానే కోడిపుంజుల్తో ఫోటోలకు ఫోజులిచ్చేస్తున్నారు. భీమవరంలో ఆదివారమే కోడిపందాలు మొదలయ్యాయి. నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌చార్జి కనుమూరి రఘురామకృష్ణంరాజు పెదఅమిరం గ్రామంలోని తన గెస్ట్‌హౌస్‌లో కోడిపందాలకు శ్రీకారం చుట్టేశారు. ఈ సంప్రదాయ క్రీడను రక్షించుకోవాల్సిన బాధ్యత తెలుగువారందరిపై ఉందంటూ ఆయన పిలుపుకూడా ఇచ్చారు. భవిష్యత్ తరాలకు వీటిని వారసత్వ సంపదగా అందించాలన్నారు. పందాల ముసుగులో జూదాలు జరిగితే చట్ట పరిధిలో చర్యలు తీసుకోవచ్చన్నారు. అంతేతప్ప పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి కోడిపందాలపై దాడులు చేస్తే సహించేదిలేదన్నారు. మనదేశంలో గుర్రాల బెట్టింగ్ లక్షల కోట్లలో జరుగుతోంది. ఇందుకోసం గుర్రాల్ని అతిదారుణంగా హింసిస్తారు. కానీ చట్టపరిధిలో గుర్రప్పందాలకు మాత్రం శిక్షల్లేవు. వాటిపై ఎలాంటి దాడులు జరగవు. కోడిపందాల కారణంగా ఉన్నతజాతికి చెందిన కోడిపుంజుల పెంపకం ఓ పెద్ద వ్యాపారంగా మారింది. ఇవే లేనిపక్షంలో కాకులు, పిచ్చుకల్లా ఈ జాతులు కూడా అంతరించిపోయే ప్రమాదం ఉంటుందంటూ ఆయన చెప్పారు. కాగా నర్సాపురం, అత్తిలి, తాడేపల్లిగూడెంలలో భారీ ఎత్తున పందెం రింగ్‌లు ఏర్పాటయ్యాయి. ఏలూరు, భీమవరం, పాలకొల్లు, నర్సాపురంలలోని లాడ్జీలన్నీ నిండిపోయాయి. పరిసర ప్రాంతాల్లోని గెస్ట్‌హౌస్‌లన్నీ ముంబయ్, హైదరాబాద్‌ల నుంచొచ్చిన ప్రముఖుల్తో కిటకిటలాడుతున్నాయి. ఈ మూడ్రోజులు వీరంతా ఇక్కడే బసచేస్తారు. కోడిపందాల్తో సేదదీరతారు. ఇందులో లక్షలు, కోట్లు కూడా చేతులు మారే అవకాశాలున్నాయి. రాజమండ్రి, కాకినాడ, రామచంద్రపురం, అమలాపురం పట్టణాల్లోని లాడ్జీలన్నీ కిటకిటలాడుతున్నాయి. ఎక్కడెక్కడ్నుంచో కోడిపందాల్లో పాల్గొనేందుకు పలువురు ఈ ప్రాంతాలకొచ్చేశారు. ఈ జిల్లాలకు చెందిన వారి స్నేహితులు, సహోద్యోగులు కూడా కోడిపందాలు చూసేందుకు ఆతృత కనబరుస్తున్నారు. యదావిధిగా ఈ ఏడాది కూడా కోట్లలో చేతులు మారతాయి. అధికార, ప్రతిపక్షనాయకులు కోళ్ళ బరులకు రక్షణగా నిలువనున్నారు.



సీఎం స్వగ్రామంలో ముందుగానే సంక్రాంతి సందడి

- నారావారిపల్లిలో పలు కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్న సీఎం సతీమణి నారా భువనేశ్వరి
- ప్రత్యేక ఆకర్షణగా దేవాంశ్
- కుటుంబ సమేతంగా ఎన్టీఆర్ బయోపిక్ చిత్రం తిలకించిన లోకేష్

తిరుపతి, ప్రభన్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వగ్రామమైన నారావారిపల్లిలో సంక్రాంతి సందడి పలువురిని ఆకర్షించింది. నేటి నుంచి ప్రారంభం కావాల్సిన సంక్రాంతి ఉత్సవాలు ఆ గ్రామానికి ఒకరోజు ముందుగానే వచ్చాయి. సీఎం సతీమణి నారా భువనేశ్వరి, నారా లోకేష్ సతీమణి బ్రాహ్మణి,



వారి కుమారుడు దేవాంశ్ నారావారిపల్లెలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరిరాకతో ఆ గ్రామంలో పండగ వాతావరణం నిండింది. పలు కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అదేవిధంగా రాష్ట్ర ఐటి శాఖమంత్రి నారా లోకేష్ ఆదివారం తిరుపతిలోని పిజిఆర్ థియేటర్‌లో నటుడు నందమూరి బాలకృష్ణనటించిన ఎన్టీఆర్ బయోపిక్ (కథానాయకుడు) చిత్రాన్ని కుటుంబ సమేతంగా బంధుమిత్రు లతో కలిసి ప్రేక్షకుల మధ్య తిలకించారు. అటుతర్వాత లోకేష్ మీడియాతో మాట్లాడు తూ ఈ చిత్రంలో బాలకృష్ణఎన్టీఆర్‌గా అద్భుతంగా నటించారని, ఎన్టీఆర్ లాంటి నటులను మళ్లీ చూడలేమనుకున్నామని, కానీ బాలకృష్ణలో నేడు ఎన్టీఆర్ నట ప్రతి భను చూశామని లోకేష్ కొనియాడారు. అటుతర్వాత నేరుగా నారావారిపల్లికి వెళ్లా రు. ఇదిలావుండగా నేడు సీఎం చంద్రబాబు, హీరో బాలకృష్ణ, నందమూరి వారసు లు నారా వారిపల్లెలో జరిగే సంక్రాంతి వేడుకలకు హాజరు కానున్నారు.

ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేసి, సంపద సృష్టించి మన దేశ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. సంక్రాంతి సంబరాలకు స్వగ్రామం శనివారం చేరుకున్న భువనేశ్వరి ఆదివారం ఉదయం నారా వారిపల్లి గ్రామంలో పలు కార్యక్రమాల్లో కుటుంబ సభ్యులతో, స్థానికులతో కలిసి పాలుపంచుకున్నారు. స్విమ్స్ నిర్వహించిన వైద్య శిబిరాన్ని నారా భువనేశ్వరి ప్రారంభించి మహిళలకు ప్రత్యేకంగా చికిత్స కోసం ఏర్పాటు చేసిన పింక్ బస్‌లో ఉన్న వైద్య



సౌకర్యాలను స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్ వివరించారు. స్థానిక కళ్యాణ మండపంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను, అంగన్‌వాడీలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని స్టాల్ పరిశీలించారు. టిటిడి కళ్యాణ మండపంలో వినాయక విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని గ్రామీణ సంప్రదాయ క్రీడలను వీక్షించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో నారా భువనేశ్వరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి సంపద సృష్టించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. గత 9 ఏళ్లుగా స్వగ్రామం నారావారిపల్లిలో సంక్రాంతి జరుపుకుంటున్నామన్నారు. మా కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు సంక్రాంతి సంబరాల్లో పాల్గొనడం సంతోషమని, రాష్ట్రప్రజలు తమ స్వంత ఊరులోకెళ్లి పెద్దలతో గ్రామస్తులతో సంక్రాంతి జరుపుకోవాలని అందరికీ శుభాకాంక్షలు, మంచి జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. సాంప్రదాయ క్రీడలు నిర్వహణ మేడం సమక్షంలో నిర్వహించిన స్థానికనిర్వాహకులు, రంగవల్లులలో పద్మజ, వసుమతి, గాయత్రి తనుశ్రీ, మౌనిక, ఝాన్సీలు, మైనర్ గేమ్స్‌లో నవీన్ లహీదర్, తెజీప్, బెలూన్ బ్లాస్టింగ్ గేమ్‌లో ధరణి, జోసన, రమ్య, శీను, కిరణ్, కార్తీక్, మ్యూజికల్ ఛైర్ గేమ్‌లో జ్యోత్స్న, సాయిశ్రీ, మౌనిక, ఫ్లగ్ ద టైల్ గేమ్‌లో శ్రావణ్‌కుమార్, కార్తీక్, రాజేష్, జదాహ్నవి, హారిక, భాగ్యశ్రీ మేడం నుండి ప్రతిభ కనబరచిన వారు బహుమతులందుకున్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి రామకృష్ణ, నారా లోకేశ్వరి, నారా ఇందిర, నారా బ్రాహ్మిణి, తేజస్విని, భరత్, స్థానికులు, పరిసర గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మంత్రి పత్తిపాటితో బ్రెజిల్ వ్యవసాయ మంత్రి భేటీ



చిలకలూరిపేట, ప్రభ న్యూస్: బ్రెజిల్ దేశంలో మాదిరిగా రాష్ట్రంలో కూడా ఒంగోలు జాతి సంతతను పెంపొందించుకోవడంపై బ్రెజిల్ వ్యవసాయశాఖ మంత్రి టర్కీషియో క్రజ్ మెస్కిటాతో మంత్రి పత్తిపాటి చర్చించారు. చిలకలూరిపేట దేశ వ్యవసాయశాఖ మంత్రి టర్కీషియో క్రజ్ మెస్కిటా తన ప్రతినిధులతో కలిసి ఆదివారం మంత్రిప్రత్తిపాటిని కలిశారు. ఈసందర్భంగా బ్రెజిల్‌లో ముర్రాజాతి ఆవులు, గేదెల అభివృద్ధి గురించి మంత్రిప్రత్తిపాటిపుల్లారావుకు టర్కీషియో క్రజ్ మెస్కిటా వివరించారు. బ్రెజిల్ సాంకేతికపరిజ్ఞానం అందిపుచ్చుకోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించి అవగాహన ఒప్పంద కుదుర్చుకుంటామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం బ్రెజిల్‌లో 16 కోట్ల ఒంగోలు జాతి బ్రీడ్ ఉన్నదన్నారు. బ్రెజిల్‌లో ఒంగోలు జాతి ఆవులు, గేదెలు రోజుకు 45 లీటర్ల వరకు పాలు ఇస్తున్నాయని వివరించారు. ఒంగోలు జాతి ద్వారా బ్రెజిల్ దేశం ఏటా కోట్లాది రూపాయల ఆదాయాన్ని పొందుతుందన్నారు. బ్రెజిల్ సాంకేతికతను ఉపయోగించి రాష్ట్రంలో పాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని మంత్రి పత్తిపాటి తెలియజేశారు. బ్రెజిల్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఆంధ్రప్రదేశ్ అధిక పాలఉత్పత్తిని సాధించవచ్చునని వివరించారు.

యూఎస్‌లో మంచు తుపానుకు ఐదుగురి మృతి

చికాగో: యూఎస్‌లో మిడ్వెస్ట్‌లో మంచు తుపాను కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని స్థానిక మీడియా తెలిపింది. మిస్సోరీలో మంచుప్రభావం ఎక్కువగా ఉందని వాతావరణశాఖ నివేదిక వెల్లడించిందని ఆ ప్రాంతంలో రహదారులన్నీ మంచుతో నిండిపోయాయని మీడియా తమ కథనంలో తెలిపింది. రహదారులను అడుగులోతు మంచుకప్పేసిందని జిన్హువా సంస్థ ఆదివారం నివేదించింది. మంచు తుపాను కారణంగా సెయింట్‌లూయిస్‌లోని లాంబర్ట్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని చాలా విమానాలు రద్దు అయ్యాయని తెలిపారు.

ముహూర్తం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ అష్టమి రా.7.24 వరకు, అనంతరం నవమి; నక్షత్రం: రేవతి ఉ.8.42 వరకు, అనంతరం అశ్విని; అమృతకాలం: రా.2.15 నుండి 3.55 వరకు; వర్జ్యం: రా.తె.5.23 నుండి...; దుర్ముహూర్తం: మ.12.24 నుండి 1.12 వరకు, తదుపరి; మ.2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు. మకర సంక్రమణం, భోగి పండుగ, ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం

రికార్డు స్థాయిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

- 2018-20 గాను ఇప్పటికే 65 లక్షల 29 వేలు దాటిన సభ్యత్వాలు
- 2016-18లో 64 లక్షల 42 వేల సభ్యత్వాలు
- అగ్రస్థానంలో గుంటూరు జిల్లా... నియోజకవర్గాల్లో పాలకొల్లు
- కార్యకర్తలకు, నాయకులకు అభినందనలు తెలిపిన మంత్రి లోకేష్

అమరావతి, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం గత రికార్డులను తిరగరాసింది. రెండేళ్లకోసారి జరిగే సభ్యత్వ నమోదు కార్యక్రమం అత్యంత క్రమశిక్షణగా, సాంకేతికత సహాయంతో ప్రణాళికాబద్ధంగా జరుగుతుంది. 2018-20సంవత్సరాలకు సంబంధించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం నవంబర్1నుంచి ప్రారంభం కాగా అక్టోబర్ 31న సాయంత్రం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ సభ్యత్వాన్ని రెన్యూవల్ చేయించుకొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కార్యకర్తల సమస్యలు, సలహాలు, సభ్యత్వం ఉపయోగాలు తెలియజేసేందుకు ప్రత్యేకంగా కాల్ సెంటర్‌ను కూడా నిర్వహిస్తూ కార్యకర్తల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2016-18 సంవత్సరానికి గానూ 64,42,267మంది టీడీపీ సభ్యత్వాన్ని నమోదుచేసుకున్నారు. సభ్యత్వ నమోదుకు క్షేత్రస్థాయిలో 3వేలమంది పనిచేయగా గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు స్వచ్ఛంధంగా పనిచేసే సుశిక్షితులైన వాలంటీర్లు, నాయకులు కూడా సభ్యత్వ నమోదులో పాలుపంచుకున్నారు. మెంబర్‌షిప్ తీసుకున్న వెంటనే రశీదు ఇచ్చిన దగ్గర నుంచి కార్యకర్తకు గుర్తింపు కార్డు చేరేవరకు పని చేసేందుకు ప్రణాళికాబద్ధమైన ఒక వ్యవస్థ పనిచేస్తోంది. ఈమొత్తం ప్రక్రియను పర్యవేక్షించడానికి అందరినీ సమన్వయపర్చడానికి కమాండ్ కంట్రోల్ సెంటర్ 24గంటలూ పనిచేస్తుంది. సభ్యత్వ నమోదు ఎంత పగడ్బందీగా సాగుతుందో అదే స్థాయిలో కార్యకర్తలను సైనికులుగా తీర్చిదిద్దే శిక్షణా కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాస పాఠాల తరగతులూ జరుగుతున్నాయి.

2018-2020గాను ఇప్పటికే ఏపీలో 65లక్షల29వేల సభ్యత్వాలు దాటిపోయాయి .సభ్యత్వ నమోదులో గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, చిత్తూరు, తూర్పుగోదావరి జిల్లాలు మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. అదేవిధంగా పాలకొల్లు, కుప్పం, ఉదయగిరి, ఆత్మకూరు, మైలవరం నియోజకవర్గాలు మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. సభ్యత్వ నమోదు కార్యక్రమం గత రెండు నెలల నుండి క్షేత్ర స్థాయిలో పనిచేసి రికార్డ్ బ్రేక్ చేసిన కార్యకర్తలు, నాయకులని టిడిపి జాతీయ కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అభినందించారు. నాలుగేళ్ల క్రితం కార్యకర్తల సంక్షేమ విభాగం కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మంత్రి లోకేష్ కార్యకర్తల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. కార్యకర్తల విద్య, వైద్యం, ఆర్థిక, వివాహ అవసరాలకు సాయం అందించే సంక్షేమ కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్నారు. కార్యకర్త ఏదైనా ప్రమాదంలో మరణిస్తే ఆకుటుంబం రోడ్డున పడకుండా మంత్రి లోకేష్ ప్రమాదబీమాను సభ్యత్వం ద్వారా లింక్ చేసి కార్యకర్తలకు వర్తింపజేశారు. సభ్యత్వం రూపంలో కట్టే రూ.100కి మరికొంత సొమ్ము పార్టీ సంక్షేమ నిధి నుంచి జమచేసి కార్యకర్తలందరికీ ప్రమాదబీమా సౌకర్యం కల్పించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ సమస్యలతో సాయం కోసం వచ్చిన 4178మంది కార్యకర్తలకు ఇప్పటి వరకూ కార్యకర్తల సంక్షేమ విభాగం రూ.14కోట్లకు పైగానే ఆర్థిక సాయం అందించింది. అదేవిధంగా తెలుగు రాష్ట్రాల్లో వేర్వేరు చోట్ల ప్రమాదాల్లో మరణించిన 3031మంది కార్యకర్తల కుటుంబాలకు ప్రమాదబీమా కింద రూ.60.62కోట్ల సాయం అందజేశారు. ప్రమాదాల్లో గాయపడిని 89మంది కార్యకర్తల వైద్య అవసరాలకు రూ.52.80లక్షల సాయం చేశారు. 815మంది విద్యార్థులకు రూ.2.28 కోట్లకుపైగానే విద్యావసరాల కోసం మంజూరు చేశారు. కార్యకర్తల పిల్లల వివాహాల సందర్భంగా పెళ్లి కానుకలనూ సంక్షేమ విభాగం నుంచి అందజేస్తూ ఇప్పటివరకూ 365మంది నూతన జంటలకు పట్టువస్త్రాలు, కానుకలు ఇచ్చింది.

అదేవిధంగా ఎన్టీఆర్ ట్రస్ట్ నుంచి ఎన్టీఆర్ మోడల్ స్కూళ్ల ద్వారా ఉచిత విద్య, ఉపకారవేతనాలు, ప్రైవేట్ స్కూళ్లలోనూ ఫీజుల్లో రాయితీలు, చదువు పూర్తయిన వారికి ఉపాధి, ఉద్యోగవకాశాలు సాధించేలా నైపుణ్యశిక్షణ ఇస్తున్నారు. కేవలం ఎన్టీఆర్ ట్రస్టు విద్యాసంస్థల్లోనే కాకుండా ఇతర ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుకుంటూ ఫీజులు కూడా కట్టుకోలేని నిరుపేద కార్యకర్తల పిల్లలకు సంక్షేమ నిధి నుంచి ఫీజులు చెల్లిస్తు న్నారు. మరికొందరికి ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలతో మాట్లాడి రాయితీ ఇప్పిస్తున్నారు. ఏపీలో ఇప్పటివరకు 445 విద్యార్థుల (కార్యకర్తల పిల్లలు)కు సంక్షేమ విభాగం నుంచి రూ.1,19,47700 తెలంగాణాలో 370 విద్యార్థులకు రూ.1,09,03,675 ఆర్థిక సాయం అందింది. విద్యపూర్తి చేసుకున్న టిడిపి కార్యకర్తల పిల్లలు త్వరగా ఉద్యోగాలు సాధించేలా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభించి నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు.

ఇలా శిక్షణ పొందిన 860మందికి వివిధ కంపెనీలలో ఉద్యోగాలు వచ్చాయని, కార్య కర్తల సంక్షేమ విభాగం చొరవ తీసుకొని జాబ్ మేళాలు ఏర్పాటు చేసి కార్యకర్తల పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషి చేస్తోంది. దశాబ్ధాలుగా పార్టీ జెండా మోసి వృద్ధాప్యం వల్ల ఏపనీ చేసుకోలేని స్థితిలో ఉన్న కార్యకర్తలకు పింఛన్ కూడా ఇస్తున్నారు.

ఒక్కొక్కరికీ రూ.1500 చొప్పున ఏపీలో నలుగురు, తెలంగాణాలో 17మంది సీనియర్ కార్యకర్తలకు పింఛన్ అందిస్తున్నారు. వీటితోపాటు నాలుగేళ్లలో తెలంగాణాలో 2002మందికి రూ.6,38,43,700, ఏపీలో 2176మందికి రూ.7,92,08,300 ఆర్థిక సాయంగా కార్యకర్తల సంక్షేమ విభాగం నుంచి మంజూరు చేశారు.





ఉట్టిపడే తెలుగు కాంతి...

ఊరంతా సంక్రాంతి

మన సంస్కృతి సంప్రదాయాల్లో విశిష్టమైనవి పండుగలు. కాలానుగుణంగా మనం మారాల్సిన అవసరాన్ని చెప్పేవే ఈ పండుగలు. అనుబంధాలను పటిష్టంచేస్తాయి. అలాంటి వాటిల్లో తెలుగువారికి ముఖ్యమైనది సంక్రాంతి. అందరూ తమదగ్గరే ఉన్నారని విర్రవీగే పట్టణం ఈ పండుగకు చిన్నబోవాల్సిందే. రెక్కలొచ్చి ఎగిరిన పిల్లలు తిరిగొచ్చినట్లు పల్లె భుజాలెగరేయాల్సిందే. బాధరాయణ సంబంధంలోనైనా మరొకరితో కలిసిపోగల తెలుగువారికి పండుగ వస్తే.. బంధాలు అరిసెలపాకంలా మరింత గట్టిపడతాయి. క్షీరసాగరమథనంలోంచి ఒక్కో అద్భుతమూ పైకివచ్చినట్లు వంటింట్లోంచి ఘుమఘుమలు పుట్టుకొస్తాయి. అంతా బాగుంది గానీ.. మరేపండుగకు లేని ప్రత్యేకత ఈ పెద్దపండుగకు ఏముంది?

(కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి): భోగికి ముందు, తర్వాత చలి మంటలుగా పిలిచేవాటిని ఈరోజు మాత్రం భోగిమంటలు అంటారు. దక్షణాయణంలోని వర్షాలకు, చలికి దేహంలో పెరిగిన వాతలక్షణాలు, అనారోగ్యాలు నువ్వులనూనెతో, మూలికాగుణాలు గలకట్టెలు, కంపలతో కాగిన నీళ్లతో అభ్యంగన స్నానంతో తొలగుతాయి. ఆరోగ్యం, నూతనోత్సాహం ఉత్తరాయణం వైపు నడిపిస్తుంది. భోగి మంటల్లో ఇంత అంతరార్థం ఉంది. దీన్నిబట్టీ ఈ పండుగ ప్రాధాన్యత గ్రహించాలి. ఏడాది పొడవునా ఎన్నో పండుగలు జరుపుకుంటాం. ప్రతి పండుగకు ఏదో ఒక నేపథ్యం ఉంటుంది. కానీ భోగి అరుదైన స్వతంత్రం ఉన్న పండుగ. భోగి అనే పేరులోనే ఎంతో అంతరార్థం ఉంది. ఇది ఏ దేవుడిని, దేవతను సూచించదు. మరి భోగి అనే పేరు ఎందుకొచ్చింది? ఎలా వచ్చిందో తెలుసుకుందాం..

రాజభోగాలు

భోగములంటే సుఖములను అనుభవించేవాడు భోగి. తెలుగు నేల వ్యవసాయ ప్రధానమైనది. ఏడాది పొడవునా కష్టపడిన రైతు పండిన పంటతో ఆనందంగా ఇంటికొచ్చి భార్యాపిల్లలు, బంధుమిత్రులతో రాజభోగాలను అనుభవించే పండుగ కనుక దీన్ని భోగి అంటారు. దక్షిణాయానాంలో చివరిరోజు ఇది. ఆనాడు ఐహికమైన, భౌతికమైన సుఖాలను, భోగాలను అందరితో పంచుకోవాలి. పండిన పంటలను పనివారికి, హరిదాసులకు, యాచకులకు, పశుపక్ష్యాదులకు వితరణ చేయడం రాజభోగం. "సంపదను పదిమందికీ త్యాగంచేయడం భోగం, తానొక్కడే తినడం రోగం" అనే సత్యాన్ని తెలిపేదే భోగిపండుగ. మరునాటి ఉత్తరాయానాంలో ఆధ్యాత్మిక పారమార్థిక చింతనలో ప్రధానమైన త్యాగగుణాన్ని భోగి అందిస్తుంది.

తుళ్ళిపడుతున్న పల్లెలు

పట్టణాల్లో యాంత్రికజీవనం గడిపేవారిని సేదతీర్చేవి పల్లెలే. కాలుష్యంతో పొగచూరిన జీవనశైలికి స్వచ్ఛమైన పల్లెగాలి తగిలితే కొత్తఉత్సాహం వస్తుంది. నా అనే నలుగురు దొరికేది పల్లెల్లోనే. మట్టివాసన ముక్కుకు తాకగానే తెలుస్తుంది.. స్వచ్ఛమైన గాలి కమ్మదనం. ఎలాగున్నావురా అబ్బాయి.. అని బాబాయ్‌లు, మావయ్యలు పలకరించినప్పుడు తెలుస్తుంది ఆప్యాయతలో మధురానుభూతి. అల్లరి చూసి తియ్యగా కసిరే తాతయ్యలను చూస్తే పెద్దరికం కనిపిస్తుంది. ఉల్లిగారెలు, పులిహోరా, బొబ్బట్లు.. అమ్మమ్మ, నానమ్మలు కొసిరికొసిరి వడ్డించినప్పుడు అర్థమవుతుంది ప్రేమంటే ఏంటో. అందుకే ఉపాధికోసం ఎక్కడికెక్కడికో తరలిన వలసపక్షులు వీలుచేసుకుని మరీ సొంతగూటికి రెక్కలు కట్టుకుని వాలిపోతారు. ఇప్పుడు కాంక్రీటు కీకార ణ్యం నుంచి బయటకొచ్చిన వలసపక్షులు సొంతూళ్ళలో చేసే సందడి అంతాఇంతా కాదు. పాతస్నేహితులను ఎక్కడున్నా వెతికి మరీ కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ మురిసిపోతున్నారు. ముఖ్యంగా కోనసీమ ప్రాంతంలో పంటపొలాల మధ్య సాగే ప్రభలతీర్థానికి ప్రతిఒక్కరూ హాజరవుతారు. ఇది అనాదిగా వస్తున్న సంప్రదాయం.

అన్నిలోహాలను బంగారంగా మార్చే పరుషవేదిని తయారు చేయడానికి వేమన తన స్నేహితులతో చాలా ప్రయోగాలు చేసి వైఫల్యాలు ఎదుర్కొన్నాడు. చివరికి విజయం లభించి మేలిమి బంగారం తయారయ్యేసరికి వైరాగ్యంవచ్చి యోగి అయ్యాడు. అదే భోగిపండుగ రహస్యం.

పురుషులకు పండుగ భోగం

పాతబట్టలను పేదలకు పంచాలి. పాడైపోయిన పాతవస్తువులను తగులబెట్టి అందరూ అందులో చలికాసుకుంటూ ఆనందించాలి. వేడినీళ్ళు పెట్టుకుని తలంటుపోసుకోవాలి. బంధాలే దుఃఖాలకు కారణమని తెలుసుకోవాలి. ఎండిపోయిన చెట్టుకొమ్మలను విరిస్తే రాబోయే వసంతానికి కొత్తకొమ్మలు వస్తాయి. గత వర్షాకాలంలో మొలిచిన కలుపుమొక్కలను తగలబెడితే నేల శుభ్రమవుతుంది. చలికి పెరిగిన దోమలు భోగిమంట పొగతో, మంటలతో తగ్గిపోతాయి. ఇలా ఇది పురుషుల భోగి.



పిల్లలకు ఆరోగ్యభోగం

భోగిపళ్ళు, బొమ్మల కొలువులు కూడా ఈ పండుగకు ప్రధానమైనవి. రేగిపండ్లు చిన్నపిల్లల తలపై పోసి పేరాంటం జరుపుతారు. రేగిపండును అర్కఫలం అంటారు. సూర్యునికి ప్రతినిధిగా సౌరశక్తిని, జ్ఞానాన్ని, ఆరోగ్యాన్ని ఇచ్చే శక్తి రేగిపండ్లకు ఉంది. ఉత్తరాయానాంలో రాబోతున్న మొదటి చాంద్రమానమాసం మాఘమాసం. అది సూర్యారాధనకాలం. చిన్నపిల్లలకు రేగిపండ్లు తలపై పోయడంవలన వాటి స్పర్శ వారికి ఆరోగ్యాన్నిస్తుంది. సూర్యుని ఆశీస్సులను అందించినట్లవుతుంది. భోగినాడు బొమ్మలకొలువులకు హారతి ఇస్తారు. పిల్లల్లో సృజనాత్మకతను, పరిసరాల విజ్ఞానాన్ని, పరిజ్ఞానాన్ని, నిర్మాణ శాస్త్ర దృష్టిని పెంపొందించే బొమ్మలకొలువులను ఆ రోజు ఏర్పాటుచేస్తారు. అందుకే ఇది పిల్లల భోగిపండుగ.

దంపతులకు ఇంద్రభోగం

ఇంద్రభోగాలు అన్నిటికంటే గొప్పవి. దేవతలరాజుగా స్వర్గంలోనే కాక యజ్ఞయాగాదికర్మలలోనూ పెద్దభాగాన్ని పొందుతారు. భోగి అనే పదానికి ఇంద్రుడే సరిపోతాడు. తూర్పుదిక్కుకు, మేఘాలకు అధిపతిగా భూమికి వర్షాన్నిచ్చేవాడు ఇంద్రుడే. భోగిపండుగ ఇంద్రపూజ కోసం ఏర్పడింది. ఉత్తరాయణం దేవయాణంకాలం కనుక ముందురోజు దేవతల అధిపతి అయిన ఇంద్రుడ్ని పూజించి ప్రసన్నం చేసుకోవాలి. భోగిమంటలు మంత్రరహితమైన హోమాలుగా ఇంద్రుడ్ని ఆరాధించి సంతోషపర్చాలి. ఆ మంటలతో నీరు, గాలిలో తేమ ఆవిరిగా మారి పొగతో నింగికి చేరి మేఘాలు ఏర్పడి అనుకూల పరిస్థితుల్లో వర్షాలు కురుస్తాయి. గోదాదేవీ రంగనాథుడి కోసం ధనుర్మాసం అంతా చేసిన తపస్సుకు రంగనాధుడు ప్రత్యక్షమై పెళ్ళి చేసుకున్నాడు. ఒకరికొకరు ఇష్టపడిన స్త్రీపురుషులు దంపతులైతే అప్పుడే భోగి అవుతారని ఈ పండుగ తెలియజేస్తుంది.

గొబ్బెమ్మలను సాగనంపే భోగం

ఆవుపేడ మనకెంతో పూజనీయంగా, ఆరోగ్య కరంగా ఉపయోగపడుతుంది. దాంతో ధనుర్మాసం నెలరోజులు గొబ్బెమ్మలు పెట్టి పూలతో అలంకరించి పూజిస్తారు. పిడకలపై ఆవుపాలతో, కొత్తబియ్యంతో పొంగలి వండుతారు. భోగి పండుగనాడు సాయంకాలం సంధిగొబ్బెమ్మలను పెట్టి పూజిస్తారు. పాటలు పాడి కోరికలు కోరుకుంటారు. పెద్దముత్తైదువులకు వాయినాలు, గొబ్బెమ్మలను గోపికలుగా భావిస్తారు. తల్లికి ప్రత్యామ్నాయంగా గోమాత చెప్పబడింది. తల్లిపాలు లేని పిల్లకు ఆవుపాలే దిక్కు. భోగినాడు గోదా శ్రీరంగనాథుల కళ్యాణం జరిగింది. ధనుర్మాసం నెలరోజులు ఆమె గోపికాభక్తితో పాటలు పాడింది. ఇల్లు పాడిపంటలతో వర్ధిల్లడానికి గోపికలవలే ప్రార్థించి గొబ్బెమ్మలను సాగనంపడమే భోగిపండుగల స్త్రీల పాత్ర.

పశువులను పూజిస్తారు

సంక్రాంతి మరునాడు కనుమ. పశువులతో మనుషులకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసే రోజు ఇది. ఆ రోజున రైతన్న వాటికి పనిచెప్పడు. సొంతబిడ్డలా ఆదరిస్తాడు. అందంగా అలంకరిస్తాడు. తన పాలిట దైవం అనుకుని పూజిస్తాడు. అలాగే రైతులంతా ఈ పశువులను పోటాపోటీగా అందంగా ముస్తాబుచేసి అభిమానాన్ని చాటుకుంటారు. ఇటీవలకాలంలో ఈ పశువులకు అందాలపోటీలు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకోసం పశువులకు వీరతిలకాలు దిద్ది, రిబ్బన్‌లతోనూ, పూలమాలలతోనూ ముస్తాబుచేసిన తీరు ఔరా అనిపిస్తోంది.



ఉత్తరాయణ పుణ్యకాలం

శ్రీరామనవమి, వినాయకచవితి.. ఇలా మన పండుగలన్నీ దాదా పుగా చంద్రమాన ప్రకారమే ఉంటాయి. కానీ సంక్రాంతిని సౌరమాన ప్రకారం జరుపుకుంటారు. సూర్యుడు ప్రతి మాసంలోనూ ఒక్కో రాశి లోకి వెళ్ళడాన్ని సంక్రమణం లేదా సంక్రాంతి అంటారు. అలా 12 రాశుల్లోకి వెళ్ళినప్పుడు 12 సంక్రమణలు వస్తాయి. వాటిల్లో మకర సంక్రాంతి ముఖ్యమైనది. అప్పటివరకు భూమధ్య రేఖకు దక్షిణ దిక్కు లో ఉండే సూర్యుడు ఉత్తరానికి మారతాడు. అందుకే ఈ ఆరునెలల కాలాన్ని ఉత్తరాయణం అంటారు. అది దేవతలు మేల్కొనే సమయం గా చెబుతుంటారు. అందుకే దేవతారాధనకు ఇది శ్రేష్ఠమైన కాలం.

ఆచరణ సాధ్యమే!



(మొదటిపేజీ తరువాయి)

రాగానే ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ప్రత్యామ్నాయ నీటివనరుల్ని కల్పిస్తామన్నారు. అంతవరకు స్తబ్దతగా ఉన్న ప్రభుత్వం ఒక్కసారిగా కళ్ళు తెరిచింది. ఉద్దానానికి వైద్యుల్ని పంపించింది. రోగుల్ని నమూనాల్ని సేకరించింది. వ్యాధి కారకాల్ని గుర్తించింది. ప్రతి గ్రామంలో ఉచిత డయాలసిస్ కేంద్రాల్ని తాత్కాలికంగానైనా ఏర్పాటు చేసింది. కిడ్నీ పీడితులకు పింఛన్లు మంజూరు చేసింది. ఉద్దానంలోని గ్రామాలకు ప్లాస్టిక్ డబ్బాల్లో నీటి సరఫరా మొదలెట్టింది. అంతకుముందు ఎన్నో ప్రభుత్వాలు మారాయి. కానీ ఎవరూ ఈ దిశగా కన్నెత్తి కూడా చూడలేదు. శ్రీకాకుళం నుంచి మహామహులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలకపాత్ర పోషించారు. వారెవరూ కూడా ఉద్దానం సమస్య పరిష్కారంపై దృష్టిపెట్టలేదు. ఒక్కసారి పవన్ అటువైపు దృష్టిమరల్చగానే శాశ్వతంగా కాకపోయినా తాత్కాలికంగానైనా పరిష్కార మార్గం చూపేందుకు ప్రభుత్వం కదలొచ్చింది.

అలాగే రాజధాని అమరావతి నగర నిర్మాణానికి భూములిచ్చి ఇబ్బం దులు పడుతున్న రైతుల తరపున పవన్ పోరాటానికి సిద్ధం కావడంతో అప్పటి కప్పు డు వారి సమస్యల్ని చంద్రబాబు పరిష్కరించడం మొదలెట్టారు. తానధికారంలో కొస్తే వృద్ధుల పింఛన్‌ను వెయ్యి నుంచి 2వేలకు, వికలాంగులకు 1500నుంచి 5వేలకు పెంచుతామంటూ పవన్ ప్రకటించారు. ఇదే ప్రకటన వేరెవరో చేస్తే ఇది ఆచరణ సాధ్యం కాదంటూ పాలకపక్షాలు కొట్టిపారేస్తాయి. అయితే పవన్ ప్రస్తుత ప్రభుత్వ ఆదాయ, వ్యయాల్తో పాటు సంపద పంపిణీలోని లోపాల్ని అధ్యయనం చేసిన తర్వాతే ఇలాంటి నిర్ణయాన్ని ప్రకటించారు. దీనిపై తరచిచూసిన రాష్ట్రం కూడా దీన్ని సముచిత పథకంగానే నిర్ణయించింది. అధికారంలో ఉండగానే చంద్రబాబు ఈ పెంపును అమల్లోకి తెచ్చారు. ఇలా పవన్ ఏ ప్రకటన చేసినా దానివెనుక సుదీర్ఘ అధ్యయనం జరుగుతోందన్న విషయం ఇప్పుడు ప్రభుత్వానిక్కూడా తేటతెల్లమైంది. ఏదో ఆషామాషీగా నోటికొచ్చిన హామీల్ని పవన్ గుప్పించడం లేదని తెలిసొచ్చింది.

ఇటీవలె పవన్ విడుదల చేసిన మేనిఫెస్టో విజన్ డాక్యుమెంట్ జాతీయ ఉపాధి క్రింద ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నాణ్యతలేని బియ్యం, పప్పులు, ఉప్పుల స్థానంలో నేరుగా కుటుంబ ఖాతాకు 3500వరకు బ్యాం కులో జమ చేస్తామన్న హామీపై ప్రభుత్వమిప్పుడు దృష్టిపెట్టింది. దీన్నికూడా ఇప్పటికిప్పుడు అమల్లోకి తెస్తే ఎలా ఉంటుం దోనన్న ఆలోచన చంద్రబాబు ప్రభుత్వంలో ఏర్పడింది. వేల కోట్లు వ్యయం చేసినప్పటికీ ప్రభుత్వ ప్రయోజనం నేరుగా లబ్ధిదార్లకు చేరడంలేదు. మధ్యవర్తులు దళారులు దీన్ని దోచుకుపోతున్నారు. ఈ దశలో పవన్ ప్రతిపాదించిన విధంగా నేరుగా లబ్దిదార్ల ఖాతాలకు మళ్ళించడం వల్ల ఆశించిన ప్రయోజనం నెరవేరుతుందన్న ఆలోచన ప్రభుత్వంలో స్పష్టమౌతోంది.

దీనిపై కూడా కొన్ని రోజుల్లోనే ప్రకటన చేసే అవకాశముంది. తన ఆలోచనల్తో నాయకత్వ పటిమతో పవన్ ఇప్పటికే బలమైన నాయకుడిగా రూపుదిద్దుకున్నారు. ప్రత్యేక వ్యక్తిత్వాన్ని చాటుకున్నారు. అసెంబ్లీలో తనకంటూ ఒక్క సభ్యుడు లేకపోయినా ప్రజా సమస్యలపై ప్రభుత్వం తలొంచి దిగొచ్చేలా చేయగలుగుతు న్నారు. ఇలాంటి నాయకత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఉద్య మంలో తమకుండుంటే ఈ పాటికి రాష్ట్రానికి ఖచ్చితంగా హోదా లభించుండేదన్న భావన అన్నివర్గాల్లో వ్యక్తమౌతోంది. పవన్‌ను ముందెట్టి అన్ని రాజకీయ పార్టీలు వెన్నుదన్నుగా నిల్చుంటే పవన్ రాష్ట్ర ప్రయోజనాల్ని పరిరక్షించ గలిగేవారు. తెలంగాణా సాధన తరహాలో ప్రజలందర్నీ ఏకతాటిపైకి తెచ్చి కేంద్రంపై పోరాడి విజయం సాధించేవారు. హోదా సాధన కోసం ఏర్పడ్డ కమిటీకి స్వయం ప్రకటిత మేథావులు నాయకత్వం వహించడం వల్ల ఎవరూ కలసిరావడంలేదు. అలాగని వారు సాధించగలుగు తున్నదేం లేదు. ఇలాంటి ఉద్యమాన్ని పవన్‌కు అప్పగిస్తే రాష్ట్ర దీర్ఘకాల ప్రయో జనాలు నెరవేరుతాయని సూచిస్తున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

లేస్తామన్నారు. కానీ ఆశించింది మాత్రం సాధిస్తామన్నారు. పోరాటంలో తెలంగాణాను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రత్యేక రాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసుకునేందుకు అక్కడి యువత, ప్రజలు ఏకతాటిపైకొచ్చి పోరాటం చేశారన్నారు. రాష్ట్ర భవిష్యత్ విషయంలో కూడా ఇలాంటి స్ఫూర్తి ఆంధ్రప్రదేశ్‌లో కనిపించాలన్నారు. కులం, మతంల పేరిట వివాదాలొస్తే అందరూ ఓ చోటకు చేరుతున్నారు. కానీ వ్యవస్థలో లోపాల్ని సవరించే విషయంలో కూడా అంతకుమించిన స్ఫూర్తితో ముందుకు రావాలన్నారు. యువతలో చైతన్యం తెచ్చేందుకు తాను జాగోరే జాగోరే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చలికాలంలో యువతను ఓ చోటకు చేర్చి మార్పు కోసం చర్చలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరి భవితవ్యాన్ని వారే నిర్ణయించుకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. అణగారిన వర్గాలకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన ఆవశ్యకతుందన్నారు. డెల్టా ప్రాంత రైతుల్ని అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన బాధ్యత జనసేనపై ఉందన్నారు. జనసేన పార్టీ వెన్నుపోట్ల నుంచి పుట్టలేదు. ఇది ప్రజల్లోంచి పుట్టిన పార్టీ

ఫిబ్రవరిలో రైతు సదస్సు

అంటూ పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశారు. గతెన్నికల్లో తాము రాష్ట్రప్రయోజనాల్ని ఆశించే తెలుగుదేశానికి మద్దతిచ్చామన్నారు. అంతేతప్ప బలం, పౌరుషం లేకకాదన్నారు. కానీ తెలుగుదేశం పూర్తిగా అవినీతిలో మునిగిపోయిందన్నారు. తానెప్పుడు ఎవర్నీ వ్యక్తిగతంగా విమర్శించనని పవన్ చెప్పారు. అయినా కొన్నిసార్లు మాట్లాడక తప్పడంలేదన్నారు. మళ్ళీనేనే రావాలి.. నా కుమారుడు సిఎమ్ కావాలని చంద్రబాబు చెప్పడాన్ని తప్పుబట్టారు. మూడు దశాబ్దాల పాటు తానే ముఖ్యమంత్రిగా ఉంటానంటూ జగన్ పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ప్రకటనలిస్తుంటే మాట్లాడకుండా ఎలా ఉండగలనంటూ ప్రశ్నించారు. ఎంతసేపు తమకు, తమ కార్యకర్తలకు మాత్రమే అభివృద్ధి అన్న విధానం తొలగిపోవాలన్నారు. కులమతాలకతీతంగా రాష్ట్రమంతా సమాంతరంగా అభివృద్ధి జరగాలన్నారు. ఎప్పుడో 50వ దశకంలో అప్పటి పాలకులు చేసిన నిర్ణయాలకు ఇప్పటి తరం తీవ్రంగా నష్టపోతోందన్నారు. ప్రస్తుత తరం నాయకులు సక్రమ నిర్ణయాలు తీసుకుంటే భవిష్యత్ తరం బాగుపడుతుందన్నారు. తన చిన్నతనంలో బకింగ్‌హామ్ కెనాల్ గురించి తెలుసుకున్నానని పవన్ చెప్పారు. ఈ కాలువ ద్వారా జలరవాణ అత్యంత చౌకైనదని పేర్కొన్నారు. పైగా ఇది ప ర్యావరణ హితమైందన్నారు. అలాంటి కెనాల్ ఇప్పుడు మురుగునీటితో పూడుకుపోయిందన్నారు. దీన్ని పునరిద్ధరించాల్సి ఆవశ్యకతుందన్నారు. తామధికారంలోకి రాగానే దీనిపై దృష్టిపెడతామన్నారు.

జనసేనానికి జనం బ్రహ్మరథం

- వేల బైక్‌లతో భారీ ర్యాలీ • ప్రచార రథంపై ఊరేగింపు
- అభివాదం చేస్తూ ముందుకు సాగిన పవన్
- వ్యవసాయ క్షేత్రంలో భోగి మంట వేసిన జనసేనాని

అమరావతి, ఆంధ్రప్రభ: తెనాలి పర్యటనలో జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌కు ప్రజలు, జనసైనికులు బ్రహ్మరథం పట్టారు.పార్టీ శ్రేణులు భారీ జనసమూహం మధ్య జనసేనానికి ఘనస్వాగతం పలికారు. ప్రతి అడుగు మరపురాని జ్ఞాపకంలా మిగిలిపోయేలా గుంటూరు జిల్లా ప్రజలు జనసేనానికి కనీ వినీఎరుగనిరీతిలో స్వాగతించారు. కృష్ణా నది వారధి దాటి గుంటూరు జిల్లాలో అడుగుపెట్టిన ఆయనకు మంగళగిరి వద్ద భారీ జనసమూహం పూలవర్షంతో ఆహ్వా నం పలికింది. అక్కడి నుంచి వందలాది బైక్‌లు,కార్లతో ఆయన్ని అనుసరిం చారు. పెదవడ్లపూడి, దుగ్గిరాల,నందివెలుగు..ఇలా ప్రతి ఊరిలో ప్రజలు రోడ్ల మీదకు వచ్చి జనసేన నినాదాలతో మారుమోగించారు.సీఎం.సీఎం అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించి, తమ అభిమానం చాటుకున్నారు. ప్రతి గ్రామం వద్ద వాహ నంపైకి వచ్చి అందరికీ అభివాదం చేస్తూ పవన్‌కల్యాణ్ ముందుకు సాగారు. ప్రతిగ్రా మం నుంచి వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు,కార్లు వాహన శ్రేణిలో ర్యాలీగా బయలు దేరాయి. తెనాలి శివారులోని ఆటోనగర్ ప్రాంతానికి వచ్చే సమయానికి ర్యాలీగా తరలివచ్చిన వాహనాల సంఖ్య వందల నుంచి వేల సంఖ్యకు చేరుకుంది. యువతతో పాటు మహిళలు,వృద్ధులతో రహదారి కిక్కిరిసింది. అక్కడి నుంచి పవన్‌కల్యాణ్, ప్రచారరథంపైకి ఎక్కా రు. అందరికీ అభివాదం చేస్తూ పెదరావూరు వైపు కదిలారు. ఆటోనగర్ నుంచి పెదరావూరు వరకు సుమారు ఐదు కిలో మీటర్ల ర్యాలీ మూడున్నర గంటల పాటు సాగింది. ర్యాలీ సాగినంత సేపు రహదారికి ఇరువైపుల ఉన్న జనసైనికులు,అభిమానులు ఎర్రకండువాలు,దండలు ఆయనకి వేసేందుకు పోటీ పడ్డారు. వారి అభిమానానికి దాసోహమైన పవన్‌కల్యాణ్ వాహనంపై నుంచి కిందికి వంగి మరీ పూల దండలు,బొకేలు స్వయంగా స్వీకరించారు. ప్రతి దండనీ మెడలో వేసుకుని దండ అందించిన వారితో పాటు అభిమానుల్ని ఉత్సాహపరుస్తూ ముందుకు సాగారు. పవన్‌కల్యాణ్ గాజు గ్లాసును తన చేతిలోకి తీసుకుని ఇదే మన ఎన్నికల గుర్తు అంటూ జనసేన కార్యకర్తలకు చూపించారు. మధ్యలో ముస్లిం సోదరులు తమ సంప్రదాయం ప్రకారం టోపీ పెట్టి ఆశీర్వచనాలు అందిస్తామని ముందుకు రాగా, ప్రచారరథంపై నుంచి కిందికి దిగి మరీ వారి ఆత్మీయతను స్వీకరించారు. రహదారికి ఇరువైపులా గృహిణిలు సైతం బారులుతీరి జనసేన జెండాలతో అభివాదం చేశారు. గుంటూరు జిల్లాలో అడుగు పెట్టింది మొదలుకుని పెదరావూరు వరకు రహదారి మొత్తం పవన్‌కల్యాణ్ కటౌట్ల తో నిండిపోగా, ఆయన్ని చూసేందుకు రహదారులు పట్టక హోర్డింగులు,చెట్ల మీదకు సైతం జనం ఎక్కేశారు. యువతులు సైతం చెట్ల మీదకు ఎక్కి జనసేనానికి అభివాదం చేయడం కోసం పోటీ పడడం గమనార్హం. అనంతరం పెదరావూరు వద్ద వ్యవసాయ క్షేత్రంలోకి అడుగుపెట్టిన పవన్‌కల్యాణ్‌కు అచ్చ తెలుగు పల్లె సంక్రాంతి వాతావరణం స్వాగతం పలికింది.

భోగి మంటల్లో

వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొన్న అనంతరం పవన్ కల్యాణ్ భోగి మంటల కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంగా భోగి మంటని వెలిగించిన ఆయన అనంతరం విద్యార్థి విభాగం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం బాణాసంచా కాల్చి ఒక రోజు ముందే సంక్రాంతి వేడుకల్ని ప్రారంభించారు.




వ్యవసాయ క్షేత్రంలో ఉట్టిపడిన తెలుగుదనం

సంక్రాంతి సంబరాల కోసం జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ రాక సందర్భంగా పెదరావూరులోని వ్యవసాయ క్షేత్రాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ప్రతి అడుగు అచ్చ తెలుగు పల్లె వాతావరణం ఉట్టేపడేలా తీర్చిదిద్దారు. ముత్యాల ముగ్గులు,గొబ్బెమ్మలు, గంగిరెద్దుల ఆట పాటలు, చెక్క భజనలు,కోలాటాలతో ప్రాంగణం మొత్తం సంబరాలు అంబరాన్ని తాకాయి. జానపద ,శాస్త్రీయ నృత్యాలు ఆహుతుల్ని అలరించాయి.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీ గవాక్షం

ఓ సంక్రాంతి కుమారా..!



ఓ సంక్రాంతి కుమారా
సడిచేసే క్రాంతి కుమారా
రండి రండి స్వాగతం!
విభ్రాంతిని వీడే రోజుకి
ఇదే ఘన స్వాగతం!
భ్రాంతి నింపిన కాలానికి
ఇదే ఘన వీడ్కోలు!
సంక్రాంతి ఆనవాళ్లను
నెమరువేసుకుందాం రండి!
మంచుతెరల్లో చలినెగళ్లకు
విచ్చేసేదే సంకురాత్రి!
ఎడ్లబళ్ల మువ్వల చప్పుళ్లకు
మురిసి విరిసేదే సంకురాత్రి!

ఇంటి ముంగిటి వడ్లపురులకు
నిండు సంతకమే సంకురాత్రి!
ఇంటి నిండా ధాన్యపు గాదెలు
ఇచ్చే వెచ్చదనమే సంకురాత్రి!
గొబ్బెమ్మల పూల సువాసనలు
విరజిమ్మే వేకువే సంకురాత్రి!
హరిదాసుల తంబురనాదపు
సంకీర్తనల సవ్వడులే సంకురాత్రి!
గంగిరెద్దుల అలంకారాల్లో
కాలిగిట్టల ఆటపాటల్లో
పెదవి కలిపి పాదం వేసేదే
అసలు సిసలు సంకురాత్రి!
పంటలొచ్చిన కాలంలో
పల్లెలు మురిస్తేనే సంకురాత్రి!

ఇవన్నీ చిన్నప్పటి తీపిగుర్తులు
వీటికోసమే వేకువన లేచేవాళ్లం
చూసిన వాళ్లకు చూసినంత
ఈ కళ్లనిండా ఆ ఆనవాళ్లే
ఈ మనసంతా ఆ సందళ్లే
అందుకే పల్లెకు పరుగులు
ఎంత వెదకినా కానరాదేమి?
తుపాన్లతో రోజూ చలికాలమే
సంకురాత్రి చలిని గుర్తించడమెలా?
వరద ముంపులో మునిగిపోతుంటే
వడ్లబస్తాలు మోసుకెళ్లే టైరుబళ్లెక్కడ?
ఇంట్లో పిల్లలే లేరు..గొబ్బెమ్మలెక్కడ?
పొట్టకూటి కోసం పట్నం పోయి
వేషం మారి..పేర్లే మారితే

హరిదాసులు ఇంకెక్కడ?
ఎండిన డొక్కల ఎడ్లు యాచకానికి
వస్తుంటే గంగిరెద్దుల రూపమెక్కడ?
నేనిప్పుడు వేకువనే లేవడం లేదు
వేటికోసం ఎదురుచూపుల్లేవు!
పాతరోజుల్ని పంచిచ్చేదెవ్వరు?
ఓ సంక్రాంతి కుమారా..
ఈ తరాన్ని ఆ తరానికి దరిచేర్చు
ఆ తరాన్ని ఈ తరంతో సంధానించు
అప్పుడే కొత్త క్రాంతి చిగురించేది!
అప్పుడే నీవు సంక్రాంతి కుమారుడివి
నేటి ప్రపంచానికి క్రాంతి కుమారుడివి!!

- వయ్యాస్సారెస్
9000013367

తెలంగాణ ప్రగతిని చూపిన జ్వాలా వ్యాసాలు

ఖమ్మం జిల్లా సాగునీటి అవసరాలకు సంబంధించిన ప్రాజెక్టుల రూపకల్పన గురించి, అలాగే ఖమ్మం జిల్లా చరిత్ర గురించి సవివరంగా వివరించారు "అధునాతన పట్టణం ఖమ్మం" అనే వ్యాసంలో నరసింహారావు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ భూములకు సంబంధించిన పూర్వ చరిత్రను ఈ గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు.

వనం జ్వాలా నరసింహారావు ఈ పేరు సుపరిచితమైనది. ఆయన రచయితగా ఇంగ్లీషు, తెలుగు భాషల్లో అనేక గ్రంథాలను అందించారు. ఆయన రచనలు అందరికీ ఎంతో ఉపయోగకరమైనవి. నిత్య అధ్యయన శీలి ఆయన. జ్వాలా నరసింహారావు ఏది రాసినా ఒక పరిశోధనతో, సునిశిత పరిశీలనతో రాస్తారు. హైదరాబాద్, చెన్నై, గోవా, ఎసింక్రోనస్ హిస్టరీ, స్క్రాప్ బుక్, యాన్ ఎజెండా ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఏపి, గవర్నెన్స్ విత్ డిఫరెన్స్ వంటి ఇంగ్లీషు గ్రంథాలను, తిలక్ జ్ఞాపకాలు, అనుభవాలే అధ్యాయాలుగా, సుందరకాండ మందార మకరందం, బాలకాండ మందార మకరందం, అయోధ్యకాండ మందార మకరందం, ధర్మధ్వజం వంటి తెలుగు గ్రంథాలను అందించి ప్రతిభ చాటుకున్నారాయన. జ్వాలా నరసింహారావు ప్రతిభను గుర్తించి నాటి ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తన వద్ద పౌరసంబంధాల అధికారిగా నియమించుకున్నారు. మళ్లీ 25 సంవత్సరాల తర్వాత నేటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సీ.పీ.ఆర్వోగా జ్వాలా నరసింహారావును తీసుకున్నారు. ఇద్దరు ముఖ్యమంత్రుల పరిపాలనా తీరును, వారు ప్రవేశపెట్టిన పథకాలను, వాటి అమలుకు వారు చూపిన శ్రద్ధను అతి దగ్గరగా గమనించే అవకాశం ఆయనకు కలిగింది. ముఖ్యంగా కే.సి.ఆర్. పరిపాలనకు సంబంధించి, ఆయన సాధించిన విజయాలను గురించి ఒక రచయితగా ఆయన అత్యంత శ్రద్ధతో ఇదీ సుపరిపాలన (51 నెలల కేసిఆర్ ప్రభుత్వం) పేరుతో ఒక గ్రంథాన్ని వెలువరించారు.

కేసిఆర్ పరిపాలన ప్రారంభించిన నాటి నుండి 2018 సెప్టెంబర్ వరకు జ్వాలా నరసింహారావు వివిధ పత్రికల్లో రాసిన వందకు పై చిలుకు వ్యాసాలు ఈ గ్రంథంలో ఉన్నాయి. ప్రతి వ్యాసంలోనూ కే.సి.ఆర్ చేపట్టిన ఒక్కో అంశాన్ని విపులంగా చర్చించారు. అయితే ఆయన ఈ వ్యాసాల్లో భజన చేసినట్లుగాక ఒక శాస్త్రీయ అవగాహనతో విపులంగా చర్చిస్తూ కే.సి.ఆర్ పాలనను సమర్థించారు. సుపరిపాలన ఎలా ఉండాలో తెలియజేశారు. ఈ గ్రంథం ద్వారా మనకు తెలియని అనేకాంశాలు తెలుసుకోవచ్చు. ఒక పరిణతి చెందిన రచయితగా ఆయన అందించిన ప్రతి వ్యాసమూ మనల్ని ఆలోచింపజేస్తుంది. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి వ్యాసాలు రాయాలంటే ఒకవిధంగా కత్తిమీద సాములాంటిదే. ఏమాత్రం అజాగ్రత్తగా రాసినా అది ఎటు పోతుందో తెలియదు. అతి జాగ్రత్తగా, పూర్తి అవగాహనతో పాలనలో కే.సి.ఆర్ మార్క్‌ను బలంగా ఈ వ్యాసాలలో నరసింహారావు చూపించటంలో వందకు వందశాతం సఫలీకృతమయ్యారని ఘంటాపథంగా చెప్పవచ్చు.

దీని ద్వారా హైదరాబాద్ పూర్వ చరిత్ర, ఉద్యమ నేపథ్యాలు, వర్తమాన చరిత్ర, హైదరాబాద్ విశ్వనగరంగా రూపుదిద్దుకుంటున్న దశను కూడా మనం తెలుసుకోగలుగుతాము. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధి దిశగా ఎలా శరవేగంగా పరుగులు పెడుతుందో ఈ వ్యాసాల ద్వారా సంపూర్ణంగా అవగాహన చేసుకోవచ్చు. కే.సి.ఆర్ దార్శనికత ఎలాంటిదో కూడా ఈగ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు. కే.సి.ఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేసే దిశగా సాగించిన ప్రయాణం గురించి రెండు వ్యాసాలు ఈ గ్రంథం మొదట్లో కనిపిస్తాయి. దూరదృష్టి అనేది తెలంగాణ సి.ఎం.కున్న అత్యంత ముఖ్య లక్షణాల్లో ఒకటి. ఇచ్చిన మాటకు ఆయన కట్టుబడతారు. చెప్పింది తప్పకుండా చేస్తారు. ఆయన ప్రారంభించిన ప్రతీ పథకంలోనూ, చేసిన ప్రతి వాగ్దానంలోనూ దీన్ని మనం చూడవచ్చునంటారు జ్వాలావారు "నవ్య తెలంగాణ పథనిర్దేశకుడు కే.సి.ఆర్ అన్న వ్యాసంలో. ఓటుకు నోటు కుంభకోణంలో తమ పార్టీ శాసనసభ్యుడు ఒకరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని, అరెస్టు చేసి, ఇంటరాగేషన్ చేసిన నేపథ్యంలో, తాను అరెస్టు అవుతాననే భయంతో చంద్రబాబు నాయుడు ఏపి పోలీసులతో రక్షణ ఏర్పాటు చేసుకున్న విషయాన్ని "సెక్షన్ 8 అవినీతికి రక్షణా?" అన్న వ్యాసంలో కూలకుషంగా చర్చించారాయన. ఏడాది పాలనలో బంగారు తెలంగాణకు బలమైన పునాది వేసిన నేపథ్యాన్ని ఒక వ్యాసంలో చర్చించారాయన. కే.సి.ఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందరెందరో దేశవిదేశాలకు చెందిన వారు ఆయన్ను కలుసుకుని అభినందించారు. తమ వంతు కృషిని అందిస్తామని కే.సి.ఆర్ తెలియజేశారు. ఇలాంటి విషయాలు ఈ గ్రంథంలో దొరుకుతాయి. గోదావరి పుష్కరాల సందర్భంలో కే.సి.ఆర్ చేసిన ఏర్పాట్ల గురించి, పుష్కరాల ప్రాచీనత గురించి, దాని ప్రాముఖ్యత గురించి జ్వాలావారు ఒక వ్యాసంలో చర్చించారు. తెలంగాణ హరితహారం గురించి ఒక వ్యాసంలో చూడ వచ్చు. ఇది కే.సి.ఆర్ చేపట్టిన మరో ప్రజాయజ్ఞంగా ఆయన వర్ణించారొక వ్యాసంలో.



"రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు గవర్నరుకు, రాష్ట్రపతికి పాదాభివందనం చేయడాన్ని వక్రీకరించి భాష్యం చెప్పిన సామాజిక శాస్త్రవేత్త కంచ ఐలయ్య ఇలా రాయడం (ఆంధ్రజ్యోతి-ఎడిట్ పేజి 5-7-2015) మాట్లాడటం కొత్తేమీ కాదు. తన వ్యాసాలలో, పుస్తకాలలో అనునిత్యం బ్రాహ్మణ్యాన్ని, బ్రాహ్మణులను 'బాపనోడు' అనే పదాలతో కించపరిచే వ్యాఖ్యలు చేయడం, అది తప్పని చెప్పినవారితో వాగ్వాదానికి దిగడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. హిందూ మతాన్ని అర్థంపర్థం లేని వ్యాఖ్యలతో విమర్శించడం కూడా ఆయనకు నిత్యకృత్యం అంటూ భారతీయ సంస్కృతిలో పెద్దలకు, జ్ఞానవంతులకు, దైవత్వాలకు ఇచ్చే గౌరవం పాదవందనం అంటూ వివరిస్తారు "ఒక సామాజిక వేత్త అర్థరాహిత్యం" అనే వ్యాసంలో జ్వాలా నరసింహారావు. "విశ్వ నగరంగా భాగ్యనగరం అన్న" వ్యాసంలో హైదరాబాద్ గత చరిత్రను తెలియజేస్తా రాయన.

"అనర్హత విషయంలో నిర్ణయాధికారం పూర్తిగా సభాపతిదే. పదవ షెడ్యూల్ కింద పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి సంబంధించి, సభాపతి ఎటువంటి నిర్ణయమైనా, న్యాయస్థానాల తీర్పు పరిధిలోకి రావు. పదవ షెడ్యూల్ నిబంధనలను అమలు పరిచే విషయంలో తదనుగుణమైన విధి, విధానాలను రూపొందించుకునే అధికారం సభాపతికి ఉంది అంటూ వివరిస్తారు జ్వాలా నరసింహారావు ఒక వ్యాసంలో. ప్రజల భాగస్వామ్యంతో గ్రామజ్యోతి, నాటిరోజుల్లో గ్రామీణ జన జీవనం, వ్యయంలేని వ్యవసాయం కావాలి, అందరికీ విద్య దిశగా అడుగులు వంటి వ్యాసాలు ఆలోచింపదగినవిగా ఈ గ్రంథంలో ఉన్నాయి. ముఖ్యమంత్రి చైనా పర్యటనకు సంబంధించిన విశేషాలతో కూడిన వ్యాసమొకటి ఈ గ్రంథంలో లభిస్తుంది. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు తలపెట్టిన "ఆయుత చండీయాగం" పై కొందరు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శిస్తారు జ్వాలా ఒక వ్యాసం లో. క్రీమీలేయర్, భావన, చరిత్ర అన్న వ్యాసంలో బీ.సీ.రిజర్వేషన్ల అమలు ప్రక్రియకు సంబంధించిన అంశాలను లోతుగా చర్చించారాయన. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించిన విషయాలను సంపూర్ణంగా రెండు వ్యాసాల్లో జ్వాలా చర్చించారు. ఖమ్మం జిల్లా సాగునీటి అవసరాలకు సంబంధించిన ప్రాజెక్టుల రూపకల్పన గురించి, అలాగే ఖమ్మం జిల్లా చరిత్ర గురించి సవివరంగా వివరించారు "అధునాతన పట్టణం ఖమ్మం" అనే వ్యాసంలో నరసింహారావు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ భూములకు సంబంధించిన పూర్వ చరిత్రను ఈ గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు. కే.సీఆర్ ప్రభుత్వం బ్రాహ్మణులకు అందిస్తున్న ఆసరా గురించి ఒక వ్యాసంలో ఆయన వివరించారు. సంక్షేమానికి వారూ-వీరూ అనే తార తమ్యం చూపించకుండా, పేదవారెవరైనా సరే, ఆదుకోవాల్సిందే అన్న దృక్పథంతో సరికొత్త సామ్యవాద భావనతో, బ్రాహ్మణుల సంక్షేమానికి నిధిని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుగారు అభినందనీయులు" అంటారాయన ఒక వ్యాసంలో. తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించ డానికి కేసిఆర్ చేస్తున్న కృషిని సంపూర్ణంగా వివరించారాయన ఒక వ్యాసంలో. అలాగే కే.సి.ఆర్ 31-3-2016న శాసనసభలో సాగునీటి ప్రాజెక్టుల గురించి చేసిన ప్రసంగపాఠం ఈ గ్రంథంలో లభిస్తుంది. గవర్నరు ప్రసంగంపై గొడవ అనుచితం అనే వ్యాసాన్ని కొత్త జిల్లాల ఏర్పాటు గురించిన వ్యాసాన్ని ఇందులో చూడవచ్చు. అలాగే జిల్లాల గత చరిత్ర కూడా ఇందులో లభిస్తుంది. "సంక్షేమ రాష్ట్రం అంటే ఇది!" అన్న వ్యాసంలో కే.సి.ఆర్ ప్రవేశపెట్టిన అనేక పథకాల గురించి వివరిస్తారు జ్వాలా. భూపరిపాలనలో సంస్కరణలు, పర్యావరణం కన్నా అభివృద్ధే మిన్న, నిర్వాసితులపై రాద్ధాంతం వద్దు!: బహుళ ప్రయోజనకారి...మల్లన్న సాగర్ రిజర్వాయర్. అంతరాష్ట్ర జల ఒప్పందాలలో నూతన ఒరవడి, అన్యాయానికి సజీవ సాక్ష్యం నాగార్జున సాగర్, బ్రాహ్మణ సంక్షేమం..ఈశ్వరుడికి సంతోషం, నాటి నగదు రహిత లావాదేవీలు, మొక్కులు ప్రభుత్వ పక్షానే...తప్పేంటీ?, అభివృద్ధి కోసమే అప్పులు, తెలుగు మహాసభలు! అప్పుడు, ఇప్పుడూ వంటి వ్యాసాలు ఈ గ్రంథంలో లభిస్తాయి. ఈ వ్యాసాలలోనూ ఆయా అంశాలపై ఆలోచనాత్మకంగా జ్వాలా చర్చించారు. రుణమాఫీ నుంచి పెట్టుబడిదాకా, సంక్షేమానికి ప్రాధాన్యం, దేశానికి ఆదర్శం. రాహుల్‌జీ, ఇవీ నిజాలు వంటి వ్యాసాలు ఈ గ్రంథంలో లభిస్తాయి. క్రైస్తవ సోదరులు విశ్వసించే ఏసు ప్రభువును "గుడ్‌షెపర్డ్"గా ఆరాధిస్తుంటారు. అదేవిధంగా రానున్న రోజుల్లో ఇన్ని వెసులుబాట్ల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కే.సి.ఆర్‌ను యాదవులు, కురుములు సమిష్టిగా తమ పాలిట "గుడ్‌షెపర్డ్"గా కీర్తిస్తారు అనటంలో అతిశయోక్తి లేదంటారు జ్వాలా, యాదవులకు, కురుమలకు గొర్రెల పంపిణీ గురించి వివరించిన వ్యాసంలో. కొత్త భూసంస్కరణలకు నాంది, సమస్యలు లేని వ్యవస్థ కే.సి.ఆర్ ఆకాంక్ష, పీవి పుణ్యమే చిన్న కమతాలు, పాదనమస్కారం భారతీయ సంస్కారం, ఆర్థికంలో అగ్రగామి, ప్రపంచ తెలుగు మహాసభలకు చెందిన మూడు వ్యాసాలు ఈ గ్రంథంలో లభిస్తాయి. సుస్థిరత కోసమే చెరికలు, ప్రాంతీయ పార్టీలదే హవా, నిరంతర విద్యుత్ గురించి ఇందులో పూర్తి వివరాలు లభిస్తాయి. నా కుటుంబం అంటేనే తెలంగాణ, ప్రతి తెలంగాణ వ్యక్తి నా కుటుంబంలోని వ్యక్తే" అంటారు ఇండియా టుడేకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కే.సి.ఆర్. ఆ ఇంటర్వ్యూ పూర్తిగా ఈ గ్రంథంలో లభిస్తుంది. తెలంగాణ రాష్ట్రశాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానం ద్వారా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు శాసన సభ్యుల సభ్యత్వం రద్దు చేసిన అంశంపై ఒక వ్యాసంలో జ్వాలా చర్చించారు. "నాలుగేళ్ల నవ నవ్యపాలన" అనే పేరుతో ఆరుభాగాలుగా ఉన్న సుదీర్ఘ వ్యాసంలో ఆయన అనేక విషయాలను చర్చించారు. శాసనసభలో జరిగినట్లుగా, న్యాయస్థానంలో ఎవరైనా న్యాయమూర్తి మీదకు ఏదైనా వస్తువును విసిరేస్తే తత్పరిణామం ఏవిధంగా ఉండేది? అని ప్రశ్నిస్తూనే జ్వాలా గవర్నర్ పైకి మైకులు విసిరేసిన కాంగ్రెస్ శాసనసభ్యుల బహిష్కరణ కన్నా మరీ ఎక్కువ శిక్షపడేది. అందువల్ల నియంత్రణలు, సమతుల్యతలపై జాతీయస్థాయి చర్చ అవసరమంటారు ఒక వ్యాసంలో. అభివృద్ధిలో తెలంగాణ నమూనా, దేశానికి ఉత్తేజపూరిత నూతన మార్గదర్శకత్వం కావాలి, కొంగరకలాన్ నుంచి కేసిఆర్ విస్పష్ట సందేశం,ఆపద్ధర్మం కాదు..ధర్మబద్ధమే, మానిఫెస్టోలతో తస్మాత్ జాగ్రత్త, అతిగా మాట్లాడిన అమిత్‌షా, ఎన్నికల వేళ రాజకీయ విచిత్రాలు..వ్యూహమే విజయ సోపానం, ఓటు నమోదు బాధ్యత ఓటరుదే, పథకాల అమలు విశ్వసనీయతే తెరాసకు శ్రీరామరక్ష వంటి వ్యాసాలలో అనేక విషయాలను జ్వాలా నరసింహారావు వివరించారు. చివరన ప్రభుత్వ ప్రగతి నివేదిక ఇచ్చారు. కే.సి.ఆర్ అధికారం చేపట్టిన నాటి నుండి ప్రభుత్వ రద్దు చేసేంతవరకు సాధించిన ప్రగతి నాసాంతం ఇచ్చారాయన. ఏది ఏమైనా ఒక సంపూర్ణ అవగాహనతో కే.సి.ఆర్ ప్రభుత్వం చేసిన ప్రతి పనిని, నిర్ణయాలను, సాధించిన విజయాలను సంపూర్ణంగా ఈ గ్రంథంలోని వ్యాసాలలో జ్వాలానరసింహారావు వివరించారు.

పేజీలు-385, వెల. రూ.500/-లు, ప్రతులకు జ్యోతి వలబోజు, సెల్.నెం. 8096310140.

- నియోగి
9553097319

హరిదాసు ప్రభ



సీ॥ రమ్యకాంతులు చిల్కు రాగి అక్షయపాత్ర
తలమీద కుదురుగా నిలిచియుండ
తీర్పుగా దిద్దిన తిరుమణి తిరుచూర్ణ
మలికభాగంబుపై కళలు గులుక
తీగమీటగ శ్రుతుల్ రాగాలనొలికించు
తంబురా భుజముపైడంబుచూప
'హరిలో హరీ రంగహరి' యంచు నోటను
పాటలమంజరుల్ పరిమళింప
మెడను వైజయంతీమాల మెరయుచుండ
రంగుధోవతి తనువున హంగుమీఱ
చేతచిరుతలు, కాళ్లగజ్జెలు ధ్వనింప
విమలమైన ధనుర్మాస వేళలందు
వచ్చు హరిదాసు దివ్యరూపమును కనుము!॥

- డా॥ రామడుగు వేంకటేశ్వరశర్మ
9866944287

సంక్రాంతి శోభ

మహిలోన వెలసిన మంచుబిందువులన్ని
ఆణిముత్యంబులై అలరుచుండ
ఇంతుల కొప్పులు బంతి పువ్వులు దాల్చి
బంగారు తళుకుల భ్రాంతి గొలుప
రంగు రంగుల నవ్య రంగ వల్లులతోడ
ముంగిళ్లు మెండుగా ముదము కూర్చ
మిరప తోట లెదిగి ఎర్రుపైన రంగుతో
ధరియిత్రికిన్ తగు మెరుపు లిడగ.
స్వర మధురిమను సన్నాయి గురుతుజేయ
శంఖునాదంబు విని మది సంతసిల్ల
చిరుతలను గని బుడతలు చిందులేయ
వింత గూర్చుచున్ సంక్రాంతి వేగవచ్చె

- పూట్ల భద్రయ్య
9550256840

కాలం మారిన గుర్తులు

ఉదయించే సూర్యుణ్ణడిగా
నాటి సంక్రాంతి కావాలని
వేకువనే భోగిమంటల చలికాగాలని
వర్షించే మేఘాన్నడిగా
భూమమ్మ కు పురుడుపోసి
మాకింత బువ్వ ఇవ్వవా అని
ఆరుగాలం పంట పండించిన రైతన్నలనడిగా
మీ కళ్లలో ఆనాటి మెరుపులేవని
ఇంటి ముంగిట రంగవల్లులనడిగా
ఆనాటి గొబ్బెమ్మలేవని
మెరిసే మెరుపుల నడిగా
ఆనాటి సంక్రాంతి కాంతులేవని
ఊరుమధ్య రామాలయంలో ఖాళీగా



వేలాడుతున్న ఇనుపకొక్కాన్నడిగా
వడ్లగింజలు తింటున్న పిచ్చుకలేవని
చెరువుగట్టుపై రావిచెట్టు కొమ్మనడిగా
ఊరంతా ఊగే ఆనాటి ఉయ్యాలలేవని
బోసిపోయిన వీధి అరుగులనడిగా
నవ్వులతో కూర్చునే వృద్ధాప్యపు హృదయాలు ఏవని
ఆవు పేడతో అలికిన ఆనాటి ఇళ్లేవని
ఆకాశాన్ని ముద్దాడే భవనాలనడిగా
తెల్లారి వాకిలిలో ఇల్లాలి ముగ్గులతో
పుడమి తల్లి చిరునవ్వులు ఏవని
సిమెంటు రహదారుల నడిగా
కొత్తల్లుళ్ల రాకలేవి అత్తమ్మల పిండివంటలేవని
బోసిపోయిన ఇంటిముంగిట వాకిళ్లనడిగా
వడపప్పు బూరెగారెలతో నీకు పెట్టే నైవేద్యాలేవని
మావూరి చివర కొలువున్న మైసమ్మ నడిగా..

- పొత్తూరి సీతారామరాజు
9948849607

గుమ్మడిపూల గొబ్బెమ్మ

పిండి ముగ్గుల్లోన ముత్యమై మెరిసింది
పున్నమి వెలుగుల వలె పూసింది
పసిడికాంతుల వర్షం చినుకుగా తోచింది,
పండంటి ముత్తైదువు మోములా ఉంది
కన్నెపిల్లల కాలిపారాణి రాణి అది
వెలకట్టలేని వన్నెల వాసంత కాంతి అది
చామంతి రంగులో చలువ చందమామ అది
పాటల నడుమ పరవశించు
పల్లెల సంస్కృతి సౌరభమది
పసుపు, కుంకుమలు అద్దిన
అందాల భరిణ అది.
పెద్ద పండుగవేళ పెద్ద దిక్కువగా ఉండే
సంక్రాంతి శోభను ముంగిళ్ళ నింపి



గొబ్బిళ్ల గోపురపు గొప్పతనం
పల్లె వాకిళ్ల వసంత శోభాతోరణం
గుమ్మడి గొబ్బిళ్ల అందం
వాకిళ్లకు తెచ్చే నిజమైన నిండుదనం.

- సింగంపల్లి శేషసాయి కుమార్
8639635907



భూమాతకు పట్టే హారతి

అనంత కాల చక్రభ్రమణంలో
ఉత్తమగతులొసగే ఉత్తరాయణానికి
అంకురార్పణం మకర సంక్రమణం

పుడమి తల్లి ప్రసవవేదనలో
పురుడు పోసుకున్న ధాన్యలక్ష్మి
పౌష్యలక్ష్మిలా తెలుగింట ప్రవేశించి
అష్టైశ్వర్యాలు అందించే ఆనందక్షణం

మొగలిపువ్వంటి మగనికోసం
ముంగిట ముగ్గుల్లో సిగ్గుల మొగ్గైన గొబ్బెమ్మలు
బొమ్మల కొలువుల్లో భోగిపళ్ల వేడుకలు,
బంతిపూల ఇంతులకు రేగుపళ్ల వాయినాలు!

హరిదాసుల సంకీర్తనలతో
హరిహరులకు అర్చనలు
హరుని వాహనం నర్తనలతో
హలధారులకు వందనాలు

భోగభాగ్యాలు తులతూగే వేళ
భోగిమంటలు అఖండజ్యోతులై
భూమాతకు పట్టే హారతి సంక్రాంతి

- బలభద్రపాత్రుని ఉదయ శంకర్
9494536524

సంక్రాంతి జిలుగులు

పుడమి తల్లి నవ్వుతోంది
పాడిపంటలతో వెలుగుతోంది!
తెలుగిళ్లు మెరుస్తున్నాయ్
వెలుగుల్ని రువ్వుతున్నాయ్!!
భోగికనుమలు తోడుగ రాగ
ముక్కనుమ కూడా వేదిక కాగా...
పిల్లా పెద్దా గొడ్డు గోదా
అన్ని అంతే అందరూ
మురిసిపోతున్నారు!!!
అందాలు, ఆనందాలు సంతసాలు, సంరంభాలు
ఉత్సాహాలు, ఉల్లాసాలు, దశదిశలు నలుదెసలు
వెలుగులవుతున్నాయ్!
జిలుగులవుతున్నాయ్!
గొబ్బెమ్మలు డుడుబసవన్నలు
'రయ్'మని ఎగిసికెళ్లే కోడిపుంజులు
హరిదాసు తత్వాలు బుడబుక్కల బూచోళ్లు



అల్లుళ్ల అలకలు మరదళ్ల సొగసులు
అన్నీ ఒకటవుతున్నాయ్
అంతా ఒకటవుతున్నాయ్
భూమాత గోమాత పూడింపబడుతున్నాయ్
ముంగిట్ల రంగవల్లులు తారాడుతున్నాయ్
పిల్లలు పెద్దలు నచ్చే పండగ
పెద్దల్ని కొలిచే పండగ
వెలుగుల పండగ జిలుగుల పండగ!
తెలుగు జిలుగుల వెలుగుల పండగ!!

- రమాప్రసాద్ ఆదిభట్ల
9348006669

సాహిత్య వార్తలు

వేంపల్లి షరీఫ్‌కు చాసో సాహితీ పురస్కారం

చాసో 104వ జయంతి సందర్భంగా చాసో సాహితీ పురస్కారాన్ని (10,000/-రూ.లు) వేంపల్లి షరీఫ్ 17వ తేదీన అందుకోనున్నారు. 17వ తేదీ సాయంకాలం 6గం.లకు గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం, విజయనగరం నందు జరిగే సభలో డా॥భైరవభట్ల విజయాదిత్య, ఆర్ బాలకృష్ణ, డా॥కందిమళ్ల సాంబశివరావు, రెహనా, గౌరికృపానందన్, వి.దివాకర్, జి.ఎస్.చలం, చీకటి దివాకర్‌లు పాల్గొంటారు.

చేను చెక్కిన శిల్పాలు ఆవిష్కరణ

సోమేపల్లి వెంకటసుబ్బయ్య చేను చెక్కిన శిల్పాలు, ఎస్.ఎం. సుభాని సామాజిక నానీలు ఆవిష్కరణ సభ జిల్లా పరిషత్ హాలు, గుంటూరు నందు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో 20వ తేది ఉదయం 10.30గం.లకు డా॥సి. భవానిదేవి అధ్యక్షతన జరుగుతుంది. ముఖ్య అతిథిగా, ఆవిష్కర్తగా ఆచార్య ఎన్.గోపి, గ్రంథసమీక్షకులుగా కె.జె.రమేష్, పి.లక్ష్మణరావు పాల్గొంటారు.

-ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

సామ్రాజ్యం కోసం వాళ్లు... సాధికారత కోసం మేము

● వారిది అవకాశవాద కూటమి ● మాది ఓటు బ్యాంకు రాజకీయం కాదు ● యువత, రైతుల ఆశయ సాధన దిశగా ముందడుగు వేస్తున్నాం ● తమిళనాడు బీజేపీ కార్యకర్తలతో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దూకుడు పెంచారు. దేశ వ్యాప్తంగా బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపేలా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంభాషిస్తున్నారు. తమిళనాడు బీజేపీ బూత్ లెవల్ కార్యకర్తలతో సంభాషించిన మోడీ.. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ముందడుగు వేయాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. బీజేపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలు ఏర్పాటు చేసిన మహా కూటమిపై మోడీ తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్షాలు సామ్రాజ్యవాదం కోసం ప్రయత్నిస్తుంటే.. తాము సాధికారత కోసం కృషి చేస్తున్నామని అన్నారు. ప్రతిపక్షాల కూటమిని అవకాశవాద కూటమిగా అభివర్ణించిన మోడీ..రాజరికమే వారి ప్రధాన లక్ష్యమని చురకలంటించారు. ఇతర పార్టీల మాదిరిగా ఓటు బ్యాంకు కోసం బీజేపీ విభజన రాజకీయాలు చేయబోదన్న మోడీ.. ప్రజలకు ఏరకంగా సేవ చేయొచ్చన్నదే తమ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దేశంలో రెండు రకాల రాజకీయాలు నడుస్తు న్నాయన్న మోడీ.. తాము అభివృద్ధి ఎజెండాతో ఎన్నికలకు వెళ్తుంటే.. ప్రతిపక్షాలు అవకాశవాద ధోరణితో కూటమిగా ఏర్పడి.. వారసత్వ రాజకీయాలను పెంచిపోషిస్తున్నాయని మండిపడ్డారు. ప్రజల కళ్లముందు కనిపిస్తున్న అభివృద్ధి ఎజెండాతోనే తాము ఎన్నికలకు వెళ్లడం మంచి అవకాశంగా భావిస్తున్నామన్నారు.

సబ్ కా సాత్ ..సబ్ కా వికాస్ నినాదంతో ముందడుగు వేస్తున్నామని మోడీ చెప్పుకొచ్చారు. ఉత్తర్ ప్రదేశ్‌లో వైరివర్గాలుగా ఉండే సమాజ్ వాదీ, బహుజన సమాజ్‌వాదీ పార్టీ జతకట్టి బీజేపీకి వ్యతిరేకంగా ఎన్నికలకు వెళ్తున్నామని ప్రకటించిన నేపథ్యంలో మోడీ ఎదురుదాడి చేశారు. ప్రతీ బీజేపీ కార్యకర్త స్వలాభం కోసం కాకుండా దేశ ప్రయోజనాల కోసం పనిచేస్తారని చెప్పుకొచ్చారు.

ప్రజలు బీజేపీని వ్యతిరేకిస్తే... కూటమి ఎందుకు..?

కేవలం బీజేపీలోనే వెనకబడిన వర్గాల వారికి ప్రాధాన్యత ఉంటుందన్న మోడీ.. ధన, పేద బేధభావాలు లేకుండా వ్యక్తిత్వానికే ప్రాధాన్యతనిస్తారని చెప్పారు. ప్రతికూల రాజకీయాలను పెంచిపోషిస్తున్న వారి పట్ల ప్రజలు ఆగ్రహంగా ఉన్నారన్నారు. మోడీ చెడ్డవాడని.. ప్రభుత్వం పనిచేయడం లేదని ప్రజల్లో నిరూపించలేకే కూటమి బాట పట్టారు. .ప్రజలు బీజేపీని అభిమానించకుంటే మీరెందుకు మహా కూటమిని ఏర్పాటు చేశారు. మీపై మీకే నమ్మకం లేదు. మా ప్రభుత్వం పేదల కోసం పనిచేస్తోంది. నవ భారత నిర్మాణం దిశగా యువతను ప్రోత్సహిస్తోంది. భారత్‌కు బీజేపీతో బలీయమైన అనుబంధం ఉంది. అని మోడీ చెప్పుకొచ్చారు.ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

వాళ్లు ప్రచారానికి.. మేం పేదరిక నిర్మూలకు

గత ప్రభుత్వాలు ప్రచారం కోసం ఇళ్లు నిర్మిస్తే.. తమ ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు ఇళ్లను నిర్మించి ఇస్తోందని చెప్పారు. గతంలో అమలు చేశామని చెప్పిన సంక్షేమ పథకాలన్నీ కాగితాలకే పరిమితం. అందుకే ఎంతమంది లబ్ధి పొందారో చెప్పలేకపోయారని విమర్శలు గుప్పించారు. సులభ వాణిజ్య విధానం(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పెద్దపెద్ద కంపెనీలకే సహాయపడేందుకే అనే ఆలోచన తప్పు అని మోడీ చెప్పుకొచ్చారు. సూక్ష్మ,చిన్న,మధ్య తరహా కంపెనీలకు(ఎంఎస్ఎంఈ)లకు తోడ్పాటునందించేందుకు ఈజ్ ఆఫ్ బిజినెస్ చేపట్టామని తెలిపారు. ప్రజలపై పన్ను భారాన్ని తగ్గించేందుకు జీఎస్టీని అమలు చేస్తున్నామన్న మోడీ.. విడతల వారీగా మార్పులు చేస్తూ.. జీఎస్టీని మరింత సరళతరం చేస్తున్నామని చెప్పారు. వ్యాపార రిజిస్ట్రేషన్ కోసం చేసుకునే జీఎస్టీ పరమితిని రూ.20 నుంచి 40 లక్షలకు పెంచడం ద్వారా చిన్న చిన్న వ్యాపారులకు ఊరటనిచ్చామన్నారు. మన దేశ భవిష్యత్ కోసం బీజేపీకే ఓటేసేలా ప్రజలను చైతన్య పరచారని మోడీ పిలుపునిచ్చారు.

కామన్ వెల్త్ పదవికి సిక్రీ నో



● కేంద్రం ప్రతిపాదనను తిరస్కరించిన సుప్రీం జడ్జి ● అలోక్ వర్మపై వేటు నేపథ్యంలోనే అంటున్న విశ్లేషకులు ● ఉన్నతస్థాయి కమిటీలో మోడీ నిర్ణయానికి ఓటేసిన సిక్రీ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏకే సిక్రీ సంచలన నిర్ణయం తీసుకున్నారు. కామన్ వెల్త్ సెక్రటేరియేట్ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్(సీఎస్ఏటీ) అధ్యక్షుడు/ మెంబర్‌గా సిక్రీని నామినేట్ చేస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సున్నితంగా తిరస్కరించారు. ఈ ఏడాది మార్చిలో పదవీ విరమణ పొందుతున్న సిక్రీ పేరును సీఎస్ఏటీ పదవికి ప్రభుత్వం గతేడాదే ప్రతిపాదించింది. అయితే సీబీఐ చీఫ్ అలోక్ వర్మ తొలగింపు నిర్ణయం తీసుకున్న ఉన్నతస్థాయి కమిటీలో మెంబర్‌గా ఉన్న సిక్రీ.. ప్రతిపక్షాల నుంచి విమర్శలను ఎదుర్కోకూడదనే వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. సీఎస్ఏటీకి తనను నామినేట్ చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూసిక్రీ కేంద్ర న్యాయ శాఖకు లేఖ రాశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తర్వాత సీనియారిటీలో రెండో వ్యక్తిగా ఉన్న సిక్రీ.. ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కామన్ వెల్త్ సెక్రటేరియేట్ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్‌కు సిక్రిని నామినేట్ చేస్తూ నిర్ణయం తీసుకున్న నాటికి (డిసెంబర్ 2018 మొదటివారం) అలోక్ వర్మ వ్యవహారంలో సిక్రికి సంబంధం లేదు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గగోయ్ ఉన్నత స్థాయి కమిటీ తప్పుకున్న తర్వాతే సిక్రీ ఆ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సమావేశంలో సీవీసీ నివేదిక ఆధారంగా అలోక్ వర్మను సీబీఐ చీఫ్ పదవి నుంచి తొలగించారు.దీంతో సిక్రీ వ్యవహార శైలిని ప్రతిపక్షాలు సైతం తప్పుబట్టాయి. ఇలాంటి సందర్భంగా అంతర్జాతీయ పదవిని స్వీకరిస్తే.. తన ఇమేజ్‌ను డ్యామేజ్ చేసేలా ప్రతిపక్షాలు అంతర్జాతీయంగా రాద్ధాంతం చేయవచ్చని ఊహించిన సిక్రీ ..కామన్ వెల్త్ సెక్రటేరియేట్ ఆర్బిట్రల్ ట్రిబ్యునల్ కు పెళ్లేబోనని తేల్చిచెప్పారు.

ప్రధానికి స్కామ్‌ల భయం

జస్టిస్ సిక్రీకి అంతర్జాతీయ పదవిని కట్టబెడుతున్నారన్న వార్త దావనంలా విస్తరించడంతో ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందిస్తూ ..ప్రధాని మోడీకి స్కామ్‌ల భయం పట్టుకుందని ఆరోపించారు. రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందంలో భారీ అవినీతి జరిగిందన్న విషయాన్ని కప్పిపుచ్చుకోలేకే మోడీ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగిందని అన్నారు. రాఫెల్ స్కాంను కప్పిపుచ్చేందుకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులను సైతం భయపెడుతున్నారు. ఈ ప్రధాని దేన్నీ ఆపలేరు. ప్రతీది నాశనం చేస్తున్నారన్నారు.


హీరోలు గీత దాటారు చలానా బేఖాతరు

● ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘనలో టాలీవుడ్ నటులు ● మహేష్, పవన్, బాలకృష్ణ, నితిన్, సునీల్ వాహనాలపై చలాన్లు ● వేలల్లో చలాన్ల బకాయి... ఇంకా కొనసాగితే చార్జ్‌షీట్ ఖాయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వెండితెరపై హీరోలుగా వెలిగి.. ప్రజలకు స్ఫూర్తినిచ్చే సెలబ్రిటీలుగా ముద్రపడిన ప్రముఖనటులు ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం విశేషం. పైగా నిబంధనల ఉల్లంఘించినందుకు విధించిన చలాన్ల చెల్లింపుపైనా వారు అశ్రద్ధచూపడం మరీ దారుణం. తెలుగు సినీ పరిశ్రమలో హీరోలుగా వెలుగుతున్న ప్రముఖ నటులు ఇలా చేయడంపట్ల విమర్శలు వస్తున్నాయి. హైదరాబాద్‌లో లక్షలాది వాహనాలు ఉపయోగంలో ఉన్నాయి. ప్రతి రోజు వేలల్లో ట్రాఫిక్ ఉల్లంఘనలు జరుగుతూంటాయి. అలా ఉల్లంఘించినవారి వాహనా లను గుర్తించి చలాన్లు విధించి జరిమానా వసూలు చేయడం మామూలే. హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఉల్లంఘించిన వారిలో ప్రముఖ సెలబ్రిటీస్ ఎక్కువంది ఉన్నారన్నది ఇప్పుడు వార్త. టాలీవుడ్‌కి చెందిన పలువురు ట్రాఫిక్‌ను ఉల్లంఘించడంతో పాటు అందుకు సంబంధించిన చలానాలు చెల్లించకుండా మిన్నకుంటున్నారు. యువ హీరో మహేష్‌బాబుకు చెందిన కారు మూడు సంవత్సరాల కాలంలో 7 సార్లు ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించిందట. అందుకుగానూ మహేష్ కారుపై మొత్తం 8,745 రూపాయల జరిమానా ఉంది. ఆ ఫైన్‌ను ఇప్పటికీ మహేష్ బాబు చెల్లించలేదు. మరో మూడుసార్లు మహేష్ కారు రూల్స్‌ను బ్రేక్ చేస్తే కోర్టులో చార్జిషీట్ దాఖలు కావడం ఖాయమని అంటున్నారు. ఇక పవన్ కల్యాణ్ కారు కూడా మూడు సార్లు నిబంధనలు అతిక్రమించిందని, పవన్ కారుపై మొత్తం రూ.505 చలానా చెల్లించాల్సి ఉందంటున్నారు. బాలకృష్ణ కారుపై కూడా చలానా ఉందని, ఆయన రెండు సార్లు నిబంధనలు అతిక్రమించినట్లుగా పోలీసు రికార్డుల్లో ఉంది. రూ.1035 జరిమానాను బాలయ్య చెల్లించాల్సి ఉందని చెబుతున్నారు. సునీల్ ఔటర్ రింగ్‌రోడ్డుపై అతివేగంగా వెళ్లడం వల్ల జరిమానా కట్టాల్సిన పరిస్థితేర్పడిందని, సునీల్ రూ.4,540 చలానా బాకీ ఉన్నాడని అంటున్నారు. నితిన్ కూడా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించాడని, ఇందుకు గానూ రూ.1035 రూపాయల జరిమానా కట్టాల్సి ఉందని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి జరిమానా పడ్డ ఎంతోమంది సినీ స్టార్స్ జరిమానాలు కట్టారని, ఇంకా కొందరు ఫైన్ కట్టాల్సి ఉందంటున్నారు.

ఆలయ ప్రవేశం వారి విజ్ఞతకే వదిలేస్తున్నా

● పంథా మార్చిన రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ దుబాయ్ పర్యటనలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల మహిళలు ప్రవేశించాలా వద్దా అనే విషయాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. గతంలో యువతుల ప్రవేశాన్ని సమర్థించిన రాహుల్, సంప్రదాయ నిషేధాన్ని కొనసాగించేలా ప్రజల వద్ద ఆమోదించదగ్గ కారణాలే ఉన్నాయని తాజాగా అన్నారు. ఈ విషయాన్ని తాను ప్రజలకే వదిలేస్తున్నానని తెలిపారు.

అయితే, సుప్రీంకోర్టు తీర్పుననుసరించి అన్ని వయసుల మహిళలను ఆలయంలోకి అనుమతించాలని తొలుత రాహుల్ కేరళ ప్రభుత్వానికి మద్దతిచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న బీజేపీ సహా, ఇతర హిందుత్వ సంస్థల వాదనలను ఖండించారు. కాగా, శబరిమల అంశంలో రాహుల్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఎన్నికల వ్యూహంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

శివసేనను ఓడించే వాడు ఇంకా పుట్టలేదు


● అమిత్‌షా వ్యాఖ్యలకు ఉద్ధవ్ కౌంటర్ ● పార్టీ చాలా వేవ్‌లు చూసిందని వెల్లడి



ముంబై: శివసేనను ఓడించేవాడు ఇంకా పుట్టలేదని శివసేన చీఫ్ ఉద్ధవ్ థాక్రే తెలిపారు.లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో తమతో పొత్తులు పెట్టుకోని భాగస్వాములను ఓడిస్తాం అంటూ ఇటీవల శివసేనను ఉద్దేశించి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా ఉద్ధవ్ ఆదివారం ఈ వ్యాఖ్యలు చేశారు. 2014 నాటి మోడీ వేవ్‌ని ఉద్దేశించి మాట్లాడుతూ.. శివసేన తన ప్రయాణంలో లెక్కలేనన్ని వేవ్‌లను చూసిందని అన్నారు. ముంబైలోని వొర్లీ ప్రాంతంలో ఓ బహిరంగ ర్యాలీలో పాల్గొన్న ఉద్ధవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీలా కాకుండా రామమందిర నిర్మాణ విషయం గురించి ఎన్నికల ముందే శివసేన లేవనెత్తిందని అన్నారు. బీజేపీ నేతలు రామమందిర నిర్మాణ విషయాన్ని ఎన్నికల అంశంగా వాడుకుంటారని ఉద్ధవ్ ఆరోపించారు. జేడీయూ, ఎల్జేపీలు రామమందిర నిర్మాణాన్ని వ్యతిరేకిస్తుంటే బీజేపీ ఏ విధంగా రామమందిరాన్ని నిర్మిస్తుందో చెప్పాలని ఆయన అన్నారు. మహారాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వంలో శివసేన భాగస్వామిగా ఉన్న విషయం తెలిసిందే. అయితే కొంతకాలంగా శివసేన, బీజేపీ నేతల మధ్య మాట యుద్ధం కొనసాగుతోంది. అమిత్ షా ఇటీవల పొత్తులపై చేసిన వ్యాఖ్యలపై శివసేన నేతలు ఘాటుగానే జవాబిస్తున్నారు. బీజేపీని బొందబెడతాం అంటూ నాలుగురోజుల క్రితం మహారాష్ట్ర మంత్రిగా ఉన్న శివసేన నేత పేర్కొన్న విషయం తెలిసిందే.

హిరాణీ 6 నెలలు లైంగికంగా వేధించారు

● మహిళా దర్శకురాలి సంచలన వ్యాఖ్యలు



ముంబయి: ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణీపై సహాయ దర్శకురాలు లైంగిక వేధింపుల ఆరోపణలు చేశారు. 'సంజు' సినిమాకు పనిచేసిన ఓ మహిళా దర్శకురాలు సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుగుతున్న సమయంలో హిరాణీ తనను లైంగికంగా వేధించారని ఆరోపిస్తున్నారు. దాదాపు ఇది ఆరు నెలలు కొనసాగిందన్నారు. ఈ విషయాన్ని సదరు మహిళ 'సంజు' సినిమా నిర్మాత విధు వినోద్ చోప్రాకు, అతని సోదరి, భార్యకు మెయిల్ పంపినట్లు హఫ్ పోస్ట్ ఇండియా పత్రిక పేర్కొంది.

ఆ మహిళ రాసిన మెయిల్‌లో హిరాణీ సర్ నా పట్ల వ్యవహరించిన తీరు బాగాలేదు. ఆయన పేరున్న దర్శకుడు. తాను కేవలం ఆయన వద్ద పనిచేస్తున్న అసిస్టెంట్‌ను, నాపై జరిగిన ఈ దారుణాన్ని చెప్పుకోలేను. ఆ రోజు నా మనసు, శరీరం పాడైపోయాయి. అలా ఆరు నెలల పాటు హిరాణీ సర్ నన్ను లైంగికంగా వేధించారు. కానీ, తనకు వేరే అవకాశం లేదు. ఉద్యోగాన్ని పోగొట్టుకోలేక మౌనంగా ఉండాల్సి వచ్చింది. మరో ఉద్యోగం దొరకదేమోనన్న భయం, ఆయన తన పనితనం గురించి బయట తప్పుగా మాట్లాడతారేమోనన్న భయం తనను మౌనం వహించేలా చేసిందని పేర్కొంది. అయితే, తనపై వస్తున్న ఆరోపణలను హిరాణీ ఖండించారు. హిరాణీ తరపు న్యాయవాది ఆనంద్ దేశాయ్ తన క్లయింట్ హిరాణీపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, ఆయన పేరు చెడగొట్టడానికి ఎవరో ఇలా చెప్పి చేయిస్తున్నారనిపిస్తోందని పేర్కొన్నారు. 'మీటూ' ఘటనలు కొంతమేరకు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో పేరున్న దర్శకుడు హిరాణీపై ఓ మహిళా దర్శకురాలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో మళ్లీ 'మీటూ' ఘటనలు వెలుగులోకి రావచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు.

కేజ్రీవాల్‌కు బెదిరింపు ఈమెయిల్

● సీఎం కార్యాలయానికి పంపిన అజ్ఞాతవ్యక్తి ● కుమార్తెను కిడ్నాప్ చేస్తామంటూ హెచ్చరిక



ఢిల్లీ: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి బెదిరింపులు రావడం కలకలం సృష్టించింది. సీఎం కేజ్రీవాల్ కుమార్తెను కిడ్నాప్ చేస్తామని, చేతనైతే రక్షించుకోండి అంటూ సీఎం కార్యాలయానికి బెదిరింపు ఈ మెయిల్ వచ్చింది. జనవరి 9న ఈ మెయిల్ వచ్చిందని, సీఎం కార్యాలయం ఈ మెయిల్‌ను ఢిల్లీ పోలీసు కమిషనర్ అమూల్య పట్నాయక్‌కు ఫార్వాడ్ చేసినట్లు సీఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ మెయిల్‌ని అందుకొన్నట్లు ఢిల్లీ పోలీస్ అధికారి కన్ఫర్మ్ చేశారు. ఈ మెయిల్‌ను సైబర్ సెల్ ప్రత్యేక విభాగానికి అందించామని, ఏ ఐపీ అడ్రస్ నుంచి మెయిల్ వచ్చింది? అని ప్రత్యేక సెల్ విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.కేజ్రీవాల్ కూతురు హర్షిత గుర్గావ్‌లోని ఓ మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. హర్షితకు ఓ కానిస్టేబుల్‌ను తాత్కాలిక సెక్యూరిటీగా ఢిల్లీ పోలీసులు నియమించారు. ఎప్పుడు బయటకి వెళ్లినా ఆమె వెన్నంటే పోలీసుల నిఘా ఉంటుందని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు వెల్లడించారు. జనవరి 9న మూడు బెదిరింపు ఈ మెయిల్స్ ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు పంపించామని అయితే ఇంతవరకు పోలీసులు తమకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని ఓ ప్రభుత్వ అధికారి వెల్లడించారు.గతంలో కూడా కేజ్రీవాల్‌కు ఈ విధమైన బెదిరింపు ఈ మెయిల్స్ వచ్చాయి.

చైనా కారిడార్‌లో సౌదీ పెట్టుబడులు

● వచ్చే నెల పాక్‌లో సౌదీ యువరాజు పర్యటన ● ఫలించిన ఇమ్రాన్ ఖాన్ మంత్రాంగం




గ్వాదర్: చైనా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఎకనామిక్ కారిడార్‌లో సౌదీ అరేబియా కూడా చేరబోతోంది. పాకిస్తాన్ మీదుగా చైనా నిర్మిస్తున్న ఎకనామిక్ కారిడార్‌లో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఆయిర్ రిఫైనరీని ప్రారంభించనున్నట్లు సౌదీ అరేబియా పెట్రోలియం శాఖ మంత్రి గులాం సర్వర్ ఖాన్ ప్రకటించారు. పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ పోర్టు సిటీ గ్వాడర్‌లో ఆయిర్ రిఫైనరీని ప్రారంభించనున్నట్లు గులాం తెలియజేశారు. తాజా నిర్ణయంతో చైనా- పాకిస్తాన్ ఆర్థిక కారిడార్‌లో సౌదీ అరేబియా కీలక భాగస్వామిగా మారనుంది. పాకిస్తాన్‌లో ఆర్థిక సంక్షోభాన్ని నిలువరించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్న ఆ దేశ ప్రధాని ఇమ్రాన్ ఖాన్... విదేశాల మద్దతు కోరుతున్నారు. పెరిగిపోతున్న ఆయిల్ ధరలు శరాఘాతంగా పరిణమించిన నేపథ్యంలో తమకు సమీపంలోనే ఆయిల్ రిఫైనరీ నిర్మాణం జరిగితే ధరలు అదుపులోకి వస్తారని పాకిస్తాన్ ప్రధాని భావిస్తున్నారు. ఇటీవలే సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్‌ను జెడ్డాలో కలిసిన ఇమ్రాన్ ఖాన్ ఈ అంశంపై చర్చించారు. పాకిస్తాన్‌ను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు ఇప్పటికే 6 బిలియన్ డాలర్ల సాయాన్ని ప్రకటించిన సౌదీ అరేబియా.. చైనా ఆర్థిక కారిడార్‌లో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఆయిల్ రిఫైనరీ ప్రారంభించేందుకు సముఖత వ్యక్తం చేసింది. వచ్చేనెలలో యువరాజు పాకిస్తాన్‌ను సందర్శించి అగ్రిమెంట్‌పై సంతకాలు చేస్తారని సౌదీ మంత్రి పేర్కొన్నారు. చైనా- పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ నిర్మాణంలో భాగంగా చేపట్టిన హైవేల నిర్మాణం, పవర్ స్టేషన్లు,రైల్వే, హై కెపాసిటీ పోర్టుల నిర్మాణానికి చైనా 60 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోంది.



జమ్మూకి 115 కి.మీ. దూరంలోని పాట్నిటాప్ వద్ద జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారి దగ్గర పార్క్ చేసిన వాహనాలు మంచుతో కప్పబడిన దృశ్యం

సిక్కుల కల నెరవేర్చాం

● సిక్కు అల్లర్ల బాధితులకు న్యాయం చేస్తాం ● కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ విమర్శలు ● గురుగోవింద్ సింగ్ 350వ జయంతోత్సవ స్మారక నాణెం విడుదల



న్యూఢిల్లీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఎదుటే కాంగ్రెస్ పార్టీని విమర్శలతో ఎత్తిపొడిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థత వల్లే సిక్కులు పవిత్రంగా భావించే కర్తార్‌పూర్ సాహిబ్ గురుద్వారాను పాకిస్తాన్ నుంచి వెనక్కితీసుకు రాలేకపోయిందని ప్రధాని మండిపడ్డారు. సిక్కు మత ప్రబోధకుడు, 10వ సిక్కు గురువు గురుగోవింగ్ సింగ్ 350 వ జయంతి సందర్భంగా ఆయన స్మారకచిహ్నాన్ని ప్రధాని మోడీ తన అధికారిక నివాసంలో విడుదల చేశారు.ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ 1984 లో దివంగత ప్రధానమంత్రి హత్య తర్వాతే సిక్కు అల్లర్లు చెలరేగాయని చెప్పారు. పాకిస్తాన్‌లోని నరోవాల్ జిల్లాలో ఉన్న కర్తార్‌పూర్ గురుద్వారాను ఇకమీదట బైనాక్యులర్‌తో చూడాల్సిన అవసరం లేకుండా కేంద్ర ప్రభుత్వం కర్తార్‌పూర్ కారిడార్‌ను చేపట్టిందని మోడీ తెలిపారు. ఈ కారిడార్ ద్వారా సిక్కులు వీసా అవసరం లేకుండానే సులువుగా గురుద్వారాను సందర్శించుకోవచ్చని పేర్కొన్నారు.

సిక్కు అల్లర్ల బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందన్నారు. దశాబ్దాల కాలంలో ఎంతోమంది తల్లులు, సోదరులు, సోదరీమణులు తమ వాళ్ల గురించి కన్నీరుపెట్టుకుంటున్నారన్న మోడీ.. వారి బాధలు పంచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు.

1947 ఆగస్టులో చేసిన పొరపాటు వల్ల.. భారత్ విభజన సమయంలో కర్తార్‌పూర్ పాకిస్తాన్‌లోకి వెళ్లిందన్నారు. మన గురువు 18 ఏళ్ల పాటు ఉన్న కర్తార్‌పూర్ కిలోమీటర్ల దూరంలో ఉండి కూడా ఇన్నాళ్లు వెళ్లలేని పరిస్థితి ఉండేదన్న మోడీ.. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కర్తార్‌పూర్ కారిడార్ నిర్మించి సిక్కులు గురుద్వారాను సందర్శించే అవకాశం కల్పించిందన్నారు. సిక్కు మత గురువు గురు నానక్ ఏప్రిల్ 15, 1469 లో ప్రస్తుత పాకిస్తాన్‌లో జన్మించిన గురునానక్. సెప్టెంబర్ 22, 1539లో కర్తార్‌పూర్‌లో తుది శ్వాస వదలారు. గురునానక్ నివసించిన ప్రాంతాన్ని సిక్కులు పవిత్ర క్షేత్రంగా భావిస్తారు.త్వరలోనే గురునానక్ 550 వ జయంతి ఉత్సవాలను దేశ వ్యాప్తంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని మోడీ తెలిపారు.

జమ్మూ కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలోని కుల్గాం జిల్లాలోని కాత్పొరా గ్రామంలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. హతులైన ఇద్దరు ఉగ్రవాదుల్లో టాప్ అల్ బదర్ ఉగ్రసంస్థ కమాండర్ జీనత్ ఉల్ ఇస్లాం కూడా ఉన్నాడని పోలీసులు తెలిపారు. హతుడైన మరో ఉగ్రవాదిని షకీల్ దార్‌గా గుర్తించారు. వీరిద్దరూ వివిధ ఉగ్రనేరాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అల్ బదర్‌ను శక్తివంతమైనదిగా తయారుచేయాలని హిజ్బుల్ ముజాహిద్దీన్-అల్ బదర్ మధ్య జరిగిన ఒప్పందం కారణంగా జీనత్ ఉల్ ఇస్లాం హిజ్బుల్ ముజాహిద్దీన్ నుంచి గతేడాది నవంబర్‌లో అల్ బదర్ ఉగ్రసంస్థకు కమాండర్‌గా వెళ్లాడని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు వెల్లడించారు. ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారంలో శనివారం కాత్పొరా ప్రాంతంలో భద్రతా బలగాలు తనిఖీలు నిర్వహించిన సమయంలో ఉగ్రవాదులు ఒక్కసారిగా భద్రతా బలగాలపై కాల్పులకు తెగబడ్డారని తెలిపారు. కాల్పులను ధీటుగా తిప్పికొట్టిన బలగాలు ఇద్దరిని మట్టుబెట్టినట్లు ఆ ప్రదేశంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన తెలిపారు.

ఆర్మీలో హనీట్రాప్ కలకలం

జైపూర్: భారత ఆర్మీలో మరోసారి హనీట్రాప్ కలకలం రేపింది. పాకిస్తాన్‌కి చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐకి చెందిన ఓ యువతి సోషల్ మీడియా ద్వారా 50మంది భారతీయ జవాన్లను ట్రాప్ చేసి వారి నుంచి కీలక సమాచారం తెలుసుకున్నట్లు తెలుస్తోంది. జైసల్మేర్‌లోని టాంక్ రెజిమెంట్‌లో పనిచేస్తున్న ఓ ఆర్మీ జవాను ఆర్మీకి సంబంధించిన కీలక సమాచారాన్ని ఆమెతో పంచుకొన్నట్లు తేలడంతో జవానుని రాజస్థాన్ పోలీసులు అరెస్ట్ చేశారు.



ద్రవ్యలోటు లక్ష్యం 3.3% చేరడం కష్టమే

•ఆర్థికవేత్తల అభిప్రాయం •రేటింగ్‌కు గండం



న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతం లక్ష్యం చేరుకోవడం ప్రభుత్వానికి అతి పెద్ద సవాలని ఆర్థికనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే జీఎస్టి వసూళ్లు తగ్గడంతో పాటు ప్రభుత్వం వ్యయం పెరిగిపోవడంతో తయారీరంగం మందగించడం తదితర కారణాలని వీరు చెబుతున్నారు. వచ్చేది ఎన్నికల సీజన్ కాబట్టి ప్రభుత్వం వోటర్లను ఆకర్షించడానికి సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తే ద్రవ్యలోటు లక్ష్యం సాధించడం మరి కష్టంగా మారుతుందని వీరు అభిప్రాయపడుతున్నారు.

కొంత మంది నిపుణులు మాత్రం ఇప్పటికే ద్రవ్యలోటు జీడీపీలో 3.5 శాతానికి చేరిపోయిందని చెబుతున్నారు. కాగా మోడీ సర్కార్ బడ్జెట్‌లో ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కాగా పూర్తి సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యం నవంబర్ చివరి నాటికి 114.8 శాతానికి ఎగబా కింది. ప్రభుత్వం బడ్జెట్ అంచనా ప్రకారం ద్రవ్యలోటు లక్ష్యం రూ.6.24 లక్షల కోట్లుగా నిర్ణయించింది. ఇది ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీలో 3.3 శాతం. అయితే ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ నాటికి ద్రవ్యలోటు ఏకంగా రూ.7.16 లక్షలు దాటిపోయింది. లేదా 114.8 శాతం. క్రితం ఏడాది ఇదే కాలంలో 112 శాతం కంటే ఇది స్వల్పంగా పెరిగింది.

ప్రస్తుతం ప్రభుత్వం పరోక్ష పన్నుల వసూళ్లు పన్నేతర వైపు నుంచి ఒత్తిడి పెరుగుతుంది. ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాన్ని సాధించలేకపోతోంది. జీఎస్‌టి వసూళ్లు తగ్గడం, పెట్టుబడుల ఉపసంహరణ ముందుకు సాగకపోవడంతో ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ద్రవ్యలోటు జీడీపీలో 3.4 శాతానికి ఎగబాకవచ్చునని మూడీస్ ఇన్వెస్టర్ సర్వీస్ వైస్ ప్రెసిడెంట్ సావరిన్ రిస్క్ గ్రూపు విలియమ్ పోస్టర్ చెప్పారు. వ్యవసాయరంగంపై ప్రభుత్వం పెద్దమొత్తంలో వ్యయం చేయడంతో పాటు రుణమాఫీలు, సబ్సిడీ భారం తదితర అంశాలు కలిసి ద్రవ్యలోటుపై ఒత్తిడి పెంచుతాయని చెబుతున్నారు. వరుసగా రెండో సంవత్సరం కూడా ద్రవ్యలోటు లక్ష్యాన్ని సాధించకపోవడంతో రేటింగ్‌పై ప్రభావం చూపుతుందంటున్నారు. ఇండియా రేటింగ్ అంచనా ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యం కంటే అదనంగా రూ.39,900కోట్లకు చేరుతుం దని అంచనా. కాగా ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు రూ.6.67 లక్షలకోట్లకు చేరు తుందని, బడ్జెట్ అంచనా రూ.6.24 లక్షలకోట్లు. 2018 ఆర్థికసంవత్సరంలో సవరించి ద్రవ్యలోటు లక్ష్యం రూ.5.92 లక్షల కోట్లు అంటే జీడీపీలో ఇది 3.5 శాతంగా తేలింది.

వినియోగదారుడికి ఊరట!

•జీఎస్టీ చార్జీ వసూలు నిలిపివేత •డీలర్లకు రెవెన్యూశాఖ ఆదేశాలు •అమలుపై ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆలోచన •జీఎస్టీ ఎగవేతకు చెక్



న్యూఢిల్లీ : వినియోగదారుడి ప్రయోజనాలు కాపాడేందుకు కేంద్రప్రభుత్వం జీఎస్టిలో కొన్ని చర్యలకు శ్రీకారం చుట్టడానికి ప్రణాళికలు రూపుదిద్దుతోంది. ముఖ్యంగా కాంపోజిషన్ డీలర్లు వినియోగదారుడి నుంచి జీఎస్టి వసూలు చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోబోతోంది. (కాంపోజిషన్ డీలర్) అంటే ఏడాదికి రూ.1 కోటి టర్నోవర్ చేసే వ్యాపారిగా చెప్పుకోవచ్చు. ఇక నుంచి కాంపోజిషన్ డీలర్ లేదా సర్వీస్ ప్రొవైడర్ తమ ఇన్వాయిస్‌లో జీఎస్‌టి రిజిస్ట్రేషన్ నెంబర్ స్టాటస్ ప్రకటించాల్సి ఉంటుంది. కొత్త పద్ధతి అమల్లోకి వస్తే కాంపోజిషన్ డీలర్లు .. కొనుగోలుదార్ల నుంచి జీఎస్టి వసూలు చేసి వాటిని ప్రభుత్వ ఖాతాకు జమచేయకుండా తప్పించుకోవడానికి వీల్లేకుండా పోతుంది. ప్రస్తుతం ఈ కాంపోజిషన్ డీలర్లు కస్టమర్ల నుంచి జీఎస్టి వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమచేయకుండా దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలియజేశారు. దీంతో పాటు రెవెన్యూశాఖ వినియోగదారుడికి దీనిపై అవగాహన కల్పించేందుకు పెద్దెత్తున ప్రచారం మొదలుపెడుతుంది. డీలర్లు కాంపోజిషన్ స్కీం కిందికి రావాలనుకునే వారువమాత్రం కొనుగోలుదారుడి నుంచి జీఎస్టి వసూలు చేయాల్సిన అవసరం లేదని అధికారి వివరించారు.

జీఎస్టి కాంపో జిషన్ స్కీం కిందికి వచ్చే ట్రేడర్లు, తయారీదార్లు వస్తువులపై కేవలం ఒక శాతం జీఎస్టి చెల్లిస్తే సరిపో తుంది. లేదంటే ఆయా వస్తువు ప్రకారం 5, 12 లేదా 18 శాతం వరకు పన్ను విధిస్తారు. అలాంటి డీలర్లు క ూడా కొనుగోలుదారుడి నుంచి జీఎస్టి వసూలు చేయడానికి అనుమతించమని ప్రభుత్వం ఉన్నతాధికారి వివరించారు. ఇదిలా ఉండగా దేశంలో పెద్దమొత్తంలో కాంపోజిషన్ డీలర్ల సంఖ్య పెరిగిపోతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. వీరంతా వినియోగదారుడి నుంచి జీఎస్టిలో అత్యధిక రేటును వసూలు చేసి, ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాకు డిపాజిట్ చేయడం లేదని తెలిసిందని అధికారి వివరించారు.

ప్రస్తుతం సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) కొత్త ప్రతిపాదనలు తీసుకురావాలని అధ్యయనం చేస్తోంది. దీ ని ప్రకారం వ్యాపారు లు.. తమ ఇన్వాయిస్‌లో తాము కాంపోజి షన్ డీలర్ల మని స్పష్టంగా ప్రకటించాల్సి ఉం టుంది. కాబట్టి ఈ డీలర్లు వినియో గ దారుడి నుంచి జీఎస్టి వసూలు చే యడానికి వీలుండదని పేర్కొంది. దీనిపై వినియో గదారుడికి అవగాహ న కల్పిస్తామని, కాంపోజిష్ స్కీం డీలర్ల నుంచి వస్తు వులు కొనుగోలు చేస్తే మాత్రం జీఎస్టి చెల్లించాల్సిన అవసరం లేదని అధికారులు వివరించారు. చిన్న చిన్న వ్యాపా రులకు తమ ఖాతా పుస్తకాల్లో పన్ను తలనొప్పులు తగ్గించేందుకు ప్రభుత్వం జీఎస్టి చట్టంలో కాంపోజిషన్ స్కీం తీసుకొ చ్చింది. దాని ప్రకారం వ్యాపారులు, తయారీదార్లు వారి వార్షి క టర్నో వర్ రూ.1 కోటి వరకు ఉంటే కేవలం ఒక శాతం జీఎస్టి చెల్లస్తే చా లని... కాగా ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి దీని పరిమి తిని రూ. 1.5 కోట్లకు పెంచుతామని ప్రకటించింది. ఈ నెల 10న జరిగిన జీఎస్టి కౌన్సిల్ సమావేశం ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ నే తృ త్వంలో జరిగింది. ఈ సమావేశంలో సర్వీస్ ప్రొవైడ ర్లు, వ్యా పారులు ఏడాదికి రూ.50 లక్షల టర్నోవర్ సా ధించేవా రు కాం పోజిషన్ స్కీంకు మారిపోవడానికి అనుమతిస్తు న్నట్లు తెలిపా రు.

జీఎస్టి వసూళ్ల పెంపుపై ఏం చేద్దాం!


సుశీల్ మోడీ నేతృత్వంలో కమిటీ


కేంద్రప్రభుత్వం జులై1, 2017 నుంచి కొత్తగా తీసుకొచ్చిన పరోక్ష పన్నుల వ్యవస్థ (జీఎస్టి) అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రాలకు రెవెన్యూ బాగా తగ్గిపోయింది. రెవెన్యూ వసూళ్లు పెంచుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో బీహార్ ఉపముఖ్యమంత్రి సుశీల్ మోడీ నేతృత్వంలో ఏడుగురు సభ్యుల కమిటీ ఏర్పడిందని జీఎస్టి కౌన్సిల్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇదిలా ఉండగా జీఎస్టి కౌన్సిల్ సమావేశం ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ నేతృత్వంలో గతేడాది డిసెంబర్ 22న జరిగింది. ఈ సమావేశంలోనే గ్రూప్ ఆఫ్ మనిస్టర్స్ (జీఓఎం)ను ఏర్పాటు చేసి, జులై 2017 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టి తర్వాత రాష్ట్రాల్లో రెవెన్యూ వసూళ్లు తగ్గడంపై మంత్రుల బృందం విశ్లేషిస్తుందని చెప్పారు. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలోని పలు రాష్ట్రాలు .. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జమ్ము-కశ్మీర్, ఒడిషా, గోవా, బీహార్, గుజరాత్, ఢిల్లీల్లో రెవెన్యూ వసూళ్లు బాగా తగ్గముఖం పట్టాయి. గతేడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ఈ రాష్ట్రాల రెవెన్యూ 14-37 శాతం వరకు తగ్గముఖం పట్టాయి. కేంద్ర పాలిత ప్రాంతాలు పుదుచ్చేరి విషయానికి వస్తే గరిష్ఠంగా 43 శాతం వరకు రెవెన్యూ వసూళ్ల కొరతతో సతమతమవుతోంది. దీనిపై సుశీల్ మోడీ కమిటి ముందుగా ఎకనోమెట్రిక్, స్టాట్సిటికల్ టూల్స్‌ను వినియోగించి గణాంకాలను అధ్యయనం చేస్తుంది. అటు తర్వాత ఎలాంటి విధానాలు అవలంబించాలి / విధానపరమైన జోక్యం చేసుకొని.. వీలైనంత వరకు రాష్ట్రాలకు రెవెన్యూ వసూళ్లు పెంచేందుకు చర్యలు సూచిస్తోంది. ముఖ్యంగా పెద్దమొత్తంలో రెవెన్యూ తగ్గిన రాష్ట్రాలకు వసూళ్లు పెంచేందుకు చర్యలు తీసుకుంటుంది. దీంతో పాటు జీఎస్టి అమల్లోకి రాకముందు ఆయా రాష్ట్రాల రెవెన్యూ వసూళ్లు ఏ విధంగా ఉన్నాయో కూడా మోడీ కమిటి అధ్యయనం చేస్తుంది. అలాగే ఆర్థిక వ్యవస్థకు కీలకంగా ఉన్న అతి పెద్ద రంగాలు వాటిలో సేవల రంగంలో కూడా నిర్మాణాత్మకమైన మార్పులు చేయాలనే ఆలోచనలో ఉంది. రెవెన్యూ వసూళ్లు తగ్గడానికి గల కారణాలను గుర్తించి, వాస్తవంగా ఎంత రెవెన్యూ రావాలో అధ్యయనం చేసి వసూళ్లు పెంచుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూడా కమిటి చర్యలు తీసుకుంటుంది. సుశీల్‌మోడీ నేతృత్వంలో ఏర్పడిన కమిటిలో సభ్యుల విషయానికి వస్తే పంజాబ్ ఆర్థికమంత్రి మన్‌ప్రీతిసింగ్ బాదల్, కేరళ ఆర్థికమంత్రి థామస్ ఇసాక్, కర్నాటక గ్రామీణాభివృద్ధి మంత్రి కృష్ణబైరేగౌడ్, ఒడిషా ఆర్థికమంత్రి శశిభూషన్ బెహెరా, హర్యానా పన్నుల మంత్రి కెప్టెన్ అభిమన్యు, గోవా పంచా యతీఆరజ్ మంత్రి మౌవిన్ గోడి నోదేశంలోని మొత్తం 31 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఐదు ఈశాన్య రాష్ట్రాలు, మిజోరాం, ఆంధ్రప్రదేశ్, మణిపూర్, సిక్కిం, నాగాలాండ్‌లు మాత్రం జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత రికార్డుస్థాయిలో రెవెన్యూ వసూళ్లు పెరిగాయి. ఇదిలా ఉండగా కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు గత ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు మొత్తం రూ.48,202 కోట్లు జీఎస్టి కాంపన్‌సెషన్ కింద విడుదల చేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం రూ.48,178కోట్లు విడుదల చేసింది. ఇదిలా ఉండగా కేంద్రప్రభుత్వం జులై 1, 2017 నుంచి జీఎస్టి అమల్లోకి తెచ్చింది. జీఎస్టి చట్టం ప్రకారం .. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత రెవెన్యూ నష్టపోతున్న రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం ఈ నష్టాన్ని భరిస్తుంది.. పరిహారం ఇస్తుంది. 2015-16 ఆర్థిక సంవత్సరాన్ని బేస్ సంవత్సరంగా తీసుకొని పన్ను వసూళ్లు ఎలా ఉన్నాయో అధ్యయనం చేసి 14 శాతం వరకు పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది.

జీఎస్టీ కౌన్సిల్‌పై యనమల గరం గరం!

రాష్ట్రాలతో సంప్రదింపులు జరపకుండా ఎజెండా తయారు

జీఎస్టి కౌన్సిల్ పనితీరుపై ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి యనమల యనమల రామకృష్ణుడు ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాలతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండానే జీఎస్టి కౌన్సిల్ ఏజెం డాలో పలు అంశాలను పొందుపరుస్తోందని ఆరోపిం చారు. తాజా గా డిసెంబర్ 10వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో కొన్ని వస్తువులపై మినహాయిం పులు, పన్ను రేట్లు తగ్గించా రు. దీనిపై రాష్ట్రాలతో చర్చలు జరపలేదు. రాష్ట్రాల ఇబ్బందులు రాష్ట్రాలకున్నాయి. వీటిపై చర్చించేందుకు అవకాశం ఇవ్వడం లేదన్నారు. అయినా కొన్ని అంశాలపై కౌన్సిల్‌కు పలు లేఖలు రాశామని అన్నారు. ఇక నుంచి జీఎస్టి కౌన్సిల్ ఏదైనా నిర్ణ యం తీసుకొనే ముందు రాష్ట్రాలతో చర్చలు జరిపిన తర్వా తనే తుది నిర్ణయం తీసుకోవాలని డి మాండ్ చేశారు. కంపోజిషన్ టర్నో వర్ పరిమితిని రూ.1 కోటి నుంచి రూ.1.50 కోట్ల పెంపు ప్రతిపా దనకు మద్దతు పలికారు. ఈ పరిమితిలోకి వచ్చే చిన్న వ్యాపారులు లబ్ధి చేకూరుతుందని.. చిన్న మొత్తంలో పన్ను చెల్లించే వారికి పన్ను ఖాతాలు నిర్వహించే బెడ ద తప్పు తుందన్నారు. రెవెన్యూ నష్టపో తున్న రాష్ట్రా లకు కేంద్రం పరిహారం ఇవ్వా లని డిమాండ్ చేశారు. ఐజీఎస్‌టి కింది సుమారు రూ. 7,000 కోట్ల వరకు కేంద్రం బకాయిలు చె ల్లించాల్సి ఉందని, వీటిని ఎలాంటి జాప్యం చే య కుండా సర్దుబాటు చేస్తే ఆంధ్ర ప్రదేశ్‌కు రూ. 100 కోట్ల వరకు నిధులు రావ చ్చునని అన్నారు.





కార్పొరేట్ పన్నులో కోత విధించండి

•ఫిక్కి బడ్జెట్ ముందస్తు విన్నపం •కార్పొరేట్ టాక్స్ 30 నుంచి 25 శాతానికి తగ్గించండి

FICCI
FEDERATION OF INDIAN CHAMBERS OF COMMERCE AND INDUSTRY

న్యూఢిల్లీ : ఫిబ్రవరి 1వ తేదీన లోకసభలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో కార్పొరేట్ పన్నులో కోత విధించాలని పారిశ్రామిక మండలి ఫిక్కీ ప్రభుత్వానికి సూచించింది. టర్నోవర్ ప్రాతిపదికగా తీసుకోకుండా ఫ్లాట్‌గా 25 శాతానికి పరిమితం చేయాలని సూచించింది. కార్పొరేట్ టాక్స్ తగ్గిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడంతో పాటు ప్రభుత్వానికి పన్ను వసూళ్లు మెరుగుపడతాయని పేర్కొంది. అలాగే వ్యక్తిగత ఆదాయం శ్లాబ్ పన్నును కూడా సవరించాలని సూచించింది. ఏడాదికి రూ.20 లక్షల కంటే ఎక్కువ ఆదాయం సంపాదించే వారి నుంచి 30 శాతం పన్ను వసూలు చేయాలని సూచించింది. ప్రస్తుతం అత్యధికంగా పన్ను వసూలు చేయడం వల్ల ఉత్పత్తి వ్యయం పెరిగిపోతోందని.. దీంతో అదనపు నిధులు లేక వ్యాపారాలను విస్తరించుకోలేకపోతున్నామని పేర్కొంది. కార్పొరేట్ టాక్స్ 30 శాతం దీంతో పాటు డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ టాక్స్ 20 శాతం కలుపుకుంటే కంపెనీలకు పన్నుల భారం ఎక్కువగా ఉంటుందని ఫిక్కీ ప్రకటనలో వివరించింది.

2019-20 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ ముందుస్తు సూచనల్లో భాగంగా ప్రపంచంలోని పలు కీలక దేశాలు గణనీయంగా పన్ను తగ్గిస్తున్నాయని, భారత్‌కూడా అన్నీ రకాల వ్యాపారాలపై పన్ను తగ్గించాలని ఫిక్కీ కోరింది. ప్రస్తుతం (మ్యాట్) మినిమమ్ ఆల్టర్‌నేట్ టాక్స్ అత్యధికంగా 18.5 శాతంగా ఉందని.. దాన్ని తగ్గించాలని కోరింది. మ్యాట్ భారాన్ని క్రమంగా తగ్గించకుంటూపోయి, అటు తర్వాత దశలవారీగా రాయితీలను ... పన్ను రాయితీలను పూర్తిగా ఎత్తివేయాలని ఫిక్కీ ప్రకటనలో సూచించింది. ఆదాయపు పన్ను చట్టం పరిధిలో ఆదాయపుపన్ను పరిమితిని రూ.3 లక్షలకు పెంచాలని సూచించింది. కాగా ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంటులో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.

డాక్‌ప్రైమ్ డాట్‌కామ్ సేవలు

doc prime

హైదరాబాద్ : ఆరోగ్య సంరక్షణను అందరికీ అందు బాటులోకి తెచ్చేందుకు, పాలసీ బజార్ గ్రూపు తాజా వెం చర్ డాక్‌ప్రైమ్ డాట్‌కామ్‌ను హైదరాబాద్‌లో ప్రారంభిం చింది. అటు నుంచి దక్షిణాది రాష్ట్రాలకు విస్తరిస్తామని సీఈవో అశిష్‌గుప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఇక హైదరా బాద్ విషయానికి వస్తే.. 2,500 మందికి పైగా వైద్యులు, శక్తిమంతమైన ల్యాబ్స్ నెట్‌వర్క్‌తో సేవ లను అందిస్తుందన్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో తన సేవలను ప్రారంభించింది. ఈ ఏడాది చివరి నాటికి దక్షిణాదికి విస్తరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ, నేషనల్ క్యాపిటల్ రీజియన్‌తో పాటు 34 పట్టణాల్లో సేవలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా 20వేల వైద్యులు, 5వేలకు పైగా డయాగ్నిస్టిక్ ల్యాబ్‌లో రాయితీ ధరలకే ఉచిత ఆన్‌లైన్ కన్సల్టేషన్ మరి యు అపాయింట్‌మెంట్‌లను బుక్ చేసుకునేందుకు సౌలభ్యం కల్పించేందుకు డాక్‌ప్రైమ్ డాట్‌కామ్ శ్రీకారం చు ట్టింది. వచ్చే మూడేళ్లలో ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌పై సుమారు 15 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన తెలిపారు.

జేఅండ్‌కే బ్యాంకు లాభం రూ.104 కోట్లు

క్యూ3లో 43 శాతం వృద్ధి

J&K Bank
Serving To Empower

న్యూఢిల్లీ: జమ్ము అండ్ కశ్మీర్ బ్యాంకు డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభం 43 శా తం వృద్ధితో రూ.103.75 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమా సికంలో రూ.72.47 కోట్లు నమో దు చేసినట్లు బ్యాంకు ఒక ప్రకట నలో పేర్కొంది. బ్యాంకు మొత్తం ఆదాయం పెరిగి రూ.2,184.22 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1790.77 కోట్లని ప్రకటనలో వివ రించింది. బ్యాంకు నిరర్థక ఆస్తులు కూడా కాస్తా దిగివచ్చాయి. డిసెంబర్ త్రైమా సికంలో 9.94 శాతానికి దిగిరాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 10.08 శాతం గా నమోదైంది. నికర ఎన్‌పీఏ మాత్రం స్వల్పంగా పెరిగి 4.59శాతానికి ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 4.29 శాతంగా నమోదైంది. బ్యాంకింగ్ రంగం మొత్తానికి చూస్తే జెఅండ్‌కె బ్యాంకు ఎన్‌పీఏ పరిస్థితి మెరుగ్గానే ఉంది. భవి ష్యత్తులో సరికొత్త వ్యూహంతో పక్కా వ్యాపార ప్రణాళికతో 2022 నాటికి రూ.2,000 కోట్ల నికరలాభాన్ని ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

టయోటా వెర్షన్ బలెనో

•వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థం విడుదల



న్యూఢిల్లీ : జపాన్‌కు చెందిన ఆటో దిగ్గజం టయోటా వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో మారుతి సుజుకి చెందిన ప్రీమియం హెచ్ బ్యాక్ బలెనో లాంటి మోడల్‌ను టయోటో విడుదల చేయబోతున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. భారత్ మార్కెట్లో మారుతి సుజుకి బలెనో విజయవంతమైన విషయం తెలిసిందే. అయితే టయోటాకు చెందిన బలెనోలో వినూత్నమైన ఫీచర్లను అందించాలని చూస్తోంది. గతేడాది మార్చిలో రెండు జపనీస్ కంపెనీలు ఒక ఒప్పందానికి వచ్చాయి. హైబ్రిడ్‌తో పాటు ఇతర వాహనాలను భారత్ మార్కెట్లో విడుదల చేయాలనే నిర్ణయానికి వచ్చాయి. ఒప్పందం ప్రకారం సుజుకి ప్రీమియం హెచ్ బ్యాక్ బలెనో, విటారా బ్రెజ్జాను టయోటాకి సరఫరా చేస్తుంది. దీనికి వ్య తిరేకంగా టయోటా సెడాన్ కరోలాను సుజుకికి సరఫరా చేస్తుంది. ఇదిలా ఉండగా వచ్చే ఆర్థిక సంవత్సరం టయోటా తన వెర్షన్ బలెనోను భారత్ మార్కెట్లో విడుదల చేస్తుంది. ప్రస్తుతం ఉన్న బలెనో స్థానంలో టయోటో చేతిలో కొత్త ఆకర్షణీయమైన లుక్స్‌తో మార్కెట్లో ఇస్తోంది. దీనిపై టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకెఎం) టయోటా భారత్ అనుబంధ సంస్థ స్పందించడానికి నిరాకరించింది.

రూ.3,600 కోట్లు వెనక్కి

•9 ట్రేడింగ్ సెషన్‌లతో విదేశీ పెట్టుబడులు •ఆచితూచి వ్యవహరిస్తున్న విదేశీ ఇన్వెస్టర్లు •ఎన్నికల నేపథ్యంలో వేచిచూసే ధోరణి



న్యూఢిల్లీ: విదేశీ ఇన్వెస్టర్లు ఈ నెల తొమ్మిది ట్రేడింగ్ సెషన్‌లలో రూ.3,600 కోట్లు స్టాక్ మార్కెట్ల నుంచి తరలించుకుపోయారు.

భారత్ మార్కెట్లో పెట్టుబడుల గురించి ఆచితూ చి వ్యవహరిస్తున్నారు. అంతకు ముందు నవంబర్, డిసెంబర్ నెలలో ఇదే విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ స్టాక్ మార్కెట్లో రూ.8,584 కోట్ల పెట్టుబడులు పెట్టాయి. డిపాజిటరీస్ నుంచి లభించిన గణాంకాల ప్రకారం ఎఫ్‌పీఐలు ఈ నెల 1-12వ తేదీ వరకు విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,677 కోట్లు తరలించుకుపోయినట్లు పేర్కొంది. అయితే ఈ నెలలోనే 1-12వ తేదీ వరకు డెట్ మార్కె ట్లో రూ.1,872 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టాయి. మొత్తా నికి కొత్త సంవత్సరంలో విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్ల నుంచి పెట్టు బడులు తరలించుకుపోవడం శుభపరిణామం కాకపో యి నా.. ఇప్పటి కిప్పుడే దీనిపై ఒక నిర్ణయానికి రావడం కూడా తొందరపా టు చర్యే అవుతుంది. అయితే ఎఫ్‌పీఐలు మాత్రం భారత్ మా ర్కెట్లో పెట్టుబడులపై జాగ్రత్త వహిస్తూ.. వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నారని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

ఇక రాబోయే రోజుల్లో ఎఫ్‌పీఐ పెట్టుబడుల విషయానికి వస్తే వచ్చే తాత్కాలిక బడ్జెట్‌పై ఎక్కువ ఫోకస్ ఉంటుంది. దీంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ.... ఈ ఏడాది వేసవిలో లోకసభకు సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో పాటు డాలర్ మారకంతో రూపాయి, ముడి చమురు ధరలు మార్కెట్లపై ప్రభావం చూపుతాయని, గ్లోబల్ ట్రేడ్ వార్ ప్రభావం విదేశీ పెట్టుబడులపై ఎక్కువ ప్రభావం చూపుతుందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి చూస్తే ఈ ఏడాది మార్కెట్లు ఒడిదుడుకులకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని, వడ్డీరేట్లు పెంపు, డాలర్ స్థిరంగా లేకపోవడం తది తర అంశాలు స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపుతా యని, ఇక భారత్ మార్కెట్ల విష యానికి వస్తే .. అభివృద్ధి చెందిన దేశా లతో పోల్చు కుంటే భారత్ మా ర్కెట్లో తక్కు వ ఒడిదుడు కుల కు గుర య్యే అవకాశాలు న్నా యని, రా జ కీ య ఒడిదుడుకలున్నా.. అవి స్వల్ప కాలమే ఉంటా యని చెబుతున్నా రు. అయితే పె ట్టుబడులకు భారత్ మా ర్కెట్లో అవకాశా లు మెరుగ్గా ఉన్నాయని, కాబట్టి రాబోయే నెలలో విదేశీ పెట్టుబడులు జోరం దుకొనే అవకాశాలను కొట్టిపారేయలే మని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ద్రవ్యోల్బణం.. క్యూ3 ఫలితాలే కీలకం

• ఈ వారం మార్కెట్ • రిల్, విప్రో ఫలితాలు ఈ వారంలోనే •మార్కెట్ నిపుణుల అంచనా



న్యూఢిల్లీ : ఈ వారం స్టాక్ మార్కెట్లను ముందుకు నడిపించేఅంశాల విషయానికి వస్తే రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు, వివిధ కంపెనీల క్యూ3 ఫలితాలని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ వారంలో అతి పెద్ద కంపెనీలు రిల్, విప్రో లాంటి బ్లూచిప్ కంపెనీలు ఫలితాలను వెల్లడించనున్నాయి. దీంతో పాటు డాలర్ మారకంతో రూపాయి, ముడిచమురు ధరలు, స్టాక్ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు తదితర అంశాలు మార్కెట్లను ముందుకు నడుపనున్నాయి. రాబోయే వారాల్లో మార్కెట్లను నడిపించే ది మాత్రం క్యూ3 ఫలితాలే. ఈ వారంలోనే రిటైల్ ద్రవ్యోల్బణంతో పాటు టోకు ద్రవ్యోల్బణం గణాంకాలు వెలువడనున్నాయి. దీని ప్రభావం మార్కెట్లపై ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక సోమవారం నాడుస్టాక్ మార్కెట్లో ఇన్ఫోసిస్ షేరు ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సింది. శుక్రవారం నాడు మార్కెట్ ముగిసిన తర్వాత ఇన్ఫీ ఫలితాలను వెల్లడించింది. క్యూ3 నికరలాభంలో 30 శాతం క్షీణించింది. కంపెనీ వ్యయం పెరిగిపోవడంతో దాని ప్రభావం లాభాలపై కనిపించింది. అయినా రూ. 8,260 కోట్లతో షేర్లను బైబ్యాక్ చేస్తామని ప్రకటించింది. 13 నెలల కాలంలో బైబ్యాక్ ప్రకటించించడం ఇది రెండవసారి. ఈ వారంలోనే అతి పెద్ద కంపెనీలు రిల్, విప్రోలు ఫలితాలు ప్రకటించబోతున్నాయి. అలాగే గత వారం స్టాక్ మార్కెట్లు ముగిసిన తర్వాత పారిశ్రామికోత్పత్తి గణాంకాలు విడుదల అయ్యాయి. నవంబర్ నెల పరిశ్రామికోత్పత్తి గణాంకాలు 17 నెలల కనిష్ఠానికి 0.5 శాతానికి దిగివచ్చింది. ముఖ్యంగా తయారీరంగంతో పాటు కన్స్యుమర్, క్యాపింటల్‌గూడ్స్ రంగం కుంగడంతో దాని ప్రభావం మొత్తం పారిశ్రామికోత్పత్తి గణాంకాలపై కనిపించింది.

ఐఐపీ గణాంకాలపై స్టాక్ మార్కెట్లు సోమవారం నాడు ఎలా స్పందిస్తాయో చూడాల్సిందే. ఇక ముడిచమురు ధరల విషయానికి వస్తే ఇటీవల కాలంలో క్రమంగా పుంజుకుంటున్నాయి. దాని ప్రభావం గ్లోబల్ మార్కెట్లపై కనిపిస్తోంది. గత వారం సెన్సెక్స్ 314.74 పాయింట్లు లాభపడి 36,009.84 వద్ద, నిఫ్టీ 67.60 పాయింట్లు లాభపడి 10,794.95 వద్ద స్థిరపడింది.

పులివెందుల్లో జగన్ బిజీ బిజీ



పులివెందుల, ప్రభ న్యూస్ : పులివెందుల్లోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం జగన్‌తో మాట్లాడేందుకు వచ్చిన రాజకీయ నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గం నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న జనంతో కిక్కిరిసిపోయింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు జగన్‌ను కలిసేందుకు వచ్చిన జనం జగన్‌ను కలిసేందుకు ఎంతో ఆరాటపడ్డారు. ఇదిలా ఉండగా జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై జగన్ తన క్యాంపు కార్యాలయంలో తన పినతండ్రి మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి, కడప మాజీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, రాజంపేట మాజీ ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి, తదితరులతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. మైదుకూరు ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి తన అనుచరులతోకలిసి జగన్ క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్‌తో కలిశారు. ఈసందర్భంగా రెండు రోజులుగా జరుగుతున్న మైదుకూరు రాజకీయ పరిణామాలపై ఆయనతోచర్చించారు. ఈ సందర్భంగా తప్పనిసరిగా ఎట్టి పరిస్థితుల్లోను మైదుకూరు టికెట్ మీకే ఇస్తామని, ఇందులో ఎలాంటి అనుమానాలు అవసరం లేదని జగన్ రఘురామిరెడ్డికి చెప్పినట్లు తెలుస్తోంది. ఇదిలావుండగా జమ్మలమడుగు నియోజకవర్గం నుంచి మైలవరం మాజీ మండలాధ్యక్షురాలు అల్లె ప్రభావతమ్మ తన అనుచరులతో కలిసి వచ్చిజగన్‌ను కలిశారు. జమ్మలమడుగు టికెట్ గతంలో ప్రకటించిన విధంగానే జమ్మలమడుగు వైకాపా ఇన్‌చార్జ్ డాక్టర్ సుధీర్ రెడ్డికి ఇస్తున్నట్లు సమాచారం ఉండటంతో జగన్ తమకు ఏదోఒక హామీ ఇవ్వాలని ఒక దశలో అల్లెప్రభావతి జగన్ క్యాంపు కార్యాలయం ఎదుటతన అనుచరులతోకలిసి బైఠాయించారు. ఆ తర్వాత జగన్ స్వయంగా వచ్చి అల్లె ప్రభావతితో మాట్లాడారు. ఈ దశలో భాగంగానే జమ్మలమడుగు అసెంబ్లీ నియోజక వర్గానికి వైకాపా అభ్యర్థిగా డాక్టర్ సుధీర్ రెడ్డిని కార్యకర్తలు, ప్రజల సమక్షంలో జగన్ అధికారికంగా ప్రకటించారు. ఇదిలా ఉండగా నెల్లూరు జిల్లా కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి కూడా పులివెందులకు వచ్చి జగన్‌తోసమావేశం అయ్యారు. జిల్లా రాజకీయాల్లో ఆది నుంచి పార్టీని నమ్ముకున్న సిట్టింగ్ ఎమ్మెల్యేలు కానీ, పార్టీ ఇన్‌చార్జ్‌లు కానీ, పార్టీ క్రియాశీలక ముఖ్య నాయకులకు తప్పనిసరిగా ఎట్టిపరిస్థితుల్లోను వచ్చే ఎన్నికల్లో టికెట్లను కానీ, టికెట్ రాని వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తూ వారికి తగిన ప్రాధాన్యత ఇచ్చేలా చూస్తామన్న హామీని జగన్ అందరి నాయకులకు తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది.

దేశ ప్రయోజనాల కోసం పాటుపడింది

కాంగ్రెస్ పార్టీయే...

- ప్రత్యేక హోదా సాధించకపోతే నీలకంఠాపురంలో అడుగిడను..
- పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి
- ఇందిరా, రాజీవ్ విగ్రహాలు ఆవిష్కరించిన కర్నాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

అనంతపురం సిటీ, ప్రభ న్యూస్ : దేశ ప్రయోజనాల కోసం ఇందిరా, రాజీవ్ గాంధీలు తమ ప్రాణాలను సైతం లెక్కచేయలేదని.. దేశ ప్రయోజనాల కోసం పాటుపడింది కాంగ్రెస్ పార్టీయేనని పీసీసీ చీఫ్ డా. ఎన్ రఘువీరారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వగలిగింది ఒక కాంగ్రెస్ పార్టీయే అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే తాను నీలకంఠాపురంలోనే అడుగు పెట్టనని పీసీసీ చీఫ్ డా. ఎన్. రఘువీరారెడ్డి ఉద్ఘాటించారు. ఆదివారం అనంతపురం జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సర్కిల్‌లో ఇందిరా గాంధీ, సప్తగిరి సర్కిల్‌లో రాజీవ్ గాంధీ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు కోటా సత్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేంద్ర మాజీ మంత్రి రేవన్న, పీసీసీ చీఫ్ డా. రఘువీరారెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా అశేష కార్యకర్తల సమక్షంలో వారు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే తాను రాష్ట్రంలో అడుగుపెట్టనని రాహుల్ గాంధీ స్పష్టం చేశారన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో తన వంతు పోరాటం చేసి, ఉక్కు మహిళగా



ఇందిరాగాంధీ పేరొందారన్నారు. దేశానికి తొలి ప్రధానిగా ఎన్నికైన అనంతరం దేశంలో గరీబీ హఠావోతోపాటు విప్లవాత్మకమైన మార్పులకు ఇందిరా నాంది పలికారన్నారు. అదే విధంగా రాజీవ్ గాంధీ ప్రధాని అయిన తర్వాత నూతన టెక్నాలజీని దేశానికి పరిచయం చేసి, హరిత విప్లవాన్ని సాధించి, నేడు ప్రపంచ దేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి దేశాన్ని తీసుకెళ్లారన్నారు. ఇదంతా కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిలో భాగమేనన్నారు. రానున్న కాలం యుద్ధకాలమని.. కావున.. కాంగ్రెస్ పార్టీని గెలిపించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేటి శ్రీధర్, దాదాగాంధీ, కెవి రమణ, సుధాకర్ రెడ్డి, నాగరాజు, రవికృప రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.



దర్శిలో బండ లాగుడు పోటీలు

విజయవంతం చేయండి

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రకాశం జిల్లా దర్శి లో ఈ నెల 25న జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల ప్రదర్శన, బండ్లలాగు పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల్లో రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని, రాష్ట్ర అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు కోరారు. ఒంగోలులోని మంత్రి నివాసంలో జాతీయ స్థాయి ఎడ్ల పోటీల గోడ పత్రికను శిద్దా రాఘవ రావు ఆదివారం ఆవిష్కరించారు. దర్శిలో శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవస్థానం వ్యవసాయ ప్రాంగణం (దేవుడు మాన్యం)లో జాతీయస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆవుల రమణ, పేరం కొండారెడ్డి తెలిపారు. ఏడు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు, పోటీల్లో పాల్గొనే రైతులు 99486 00682 ఫోన్ నెంబర్‌లో సంప్రదించి ఎంట్రీలను నమోదు చేసుకోవాల్సిందిగా రైతులను నిర్వాహకులు కోరారు.

ఆత్మీయత, అనుబంధాలకు

సంక్రాంతి ప్రతీక

- తెలుగు ప్రజలకు సీఎం చంద్రబాబు, జగన్, మంత్రుల శుభాకాంక్షలు



అమరావతి, ఆంధ్రప్రభ : యావత్ ప్రపంచానికి శతాబ్దాల చరిత్ర కలిగిన భారతీయ సంస్కృతిని చాటిచెప్పే ప్రధాన పర్వదినాలలో సంక్రాంతి పండుగ ప్రధానమైనదని పలువురు నేతలు అన్నారు. ఈ పండుగను ఉభయ తెలుగు రాష్ట్రాల లోని ప్రజానీకం ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని వివిధ రాజకీయ పక్షాల నేతలు, మంత్రులు ఆదివారం విడుదల చేసిన వేర్వేరు ప్రకటనల్లో ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలుగు ప్రజలకు భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ తెలుగువాకిట వెలుగు ముగ్గులు వేసి మన సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పే సృజనాత్మక వేడుకగా సంక్రాంతి పండుగను అభివర్ణించారు. ధనుర్మాసంలో చలి వాతావరణం, పల్లెల్లో ఆహ్లాదం వెల్లివిరుస్తుందని, రంగురంగుల రంగవల్లులు, వైవిధ్యమైన ముగ్గులు.. తెలుగింటి ఆడపడుచుల కళా సృజనకు సంక్రాంతి పండుగ నిదర్శనమని ఆయన అన్నారు. పంట చేతికొచ్చిన సంతోషంతో జరుపుకునే సండుగే సంక్రాంతి అని చంద్రబాబు పేర్కొన్నారు.



మకర సంక్రాంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన ఆదివారం ట్వీట్ చేస్తూ ఆత్మీయతలు, అనుబంధాలకు సంక్రాంతి పండగ ప్రతీక అన్నారు. భోగి మంటలు, రంగ వల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్లు, పైరు పచ్చల కళకళల సంక్రాంతి పేరు చెబితే అందిరికీ గొర్తుకొస్తాయన్నారు. అన్నపూర్ణగా పేరుగాంచిన తెలుగు నేల మీద రైతన్నలు, గ్రామీణ వృత్తుల వారు సుఖ సంతోషాలతో తులతూగాలని కోరుకుంటున్నట్లు శుభాకాంక్షల సందేశంలో జగన్ పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు పి. మధు, కె.రామకృష్ణ కూడా తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే సంక్రాంతి పండుగను తెలుగు ప్రజలు ఎక్కడ నివసిస్తున్నా ఆనందంగా గడుపుకోవాలని రఘువీరారెడ్డి ఆకాంక్షించారు. మన సంస్కృతికి నిలువుటద్దంగా నిలిచే సంక్రాంతి పండుగను దేశ ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కన్నా లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు.కాగా భోగి.. భోగభాగ్యాలను, సంక్రాంతి.. సుఖసంతోషాలను, కనుమ.. కమ్మని అనుభూతులను తెలుగు ప్రజానికానికి మనస్ఫూర్తిగా అందించాలని రాష్ట్ర మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర కోరుకున్నారు. ఈ మేరకు వీరిరువురు ఆదివారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి సందర్భంగా తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అచ్చమైన తెలుగింటి పండుగైన సంక్రాంతిని బంధువులు, కుటుంబాల సమేతంగా పల్లెటూళ్ళలో నిర్వహించుకుని గ్రామ ప్రాంతాల్లో ఉట్టిపడే సంస్కృతి, అందాలను ఆస్వాదించాలని సూచించారు.



హృద్యంగా జరుపుకోవాలి : ఉపముఖ్యమంత్రి కేఈ, మంత్రి యనమల

పంటలు చేతికందేవేళ రాష్ట్రంలోని రైతాంగం సంక్రాంతి పండుగను తమ కుటుంబ సభ్యులతో కలసి ఉత్సాహంగా, ఉల్లాసంగా జరుపుకుంటారని రాష్ట్రప్రభుత్వం వివిధ రూపాల్లో సంక్రాంతి కానుకను అందించిన నేపథ్యంలో నవ్యాంధ్ర తెలుగు ప్రజానీకమంతా ఈ పండుగను హృద్యంగా జరుపుకోవాలని ఉపముఖ్యమంత్రి కేఈ.కృష్ణమూర్తి ఆకాంక్షించారు. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు కూడా తెలుగు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ గ్రామీణ ప్రాంతాలలో తెలుగుదనం ఉట్టిపడేలా నిర్వహించుకునే ఈ పండుగ ప్రజలకు శుభాలు చేకూర్చాలని అభిలషించారు.

పల్లెల్లో వెల్లివిరుస్తున్న సంక్రాంతి కళ : మంత్రి లోకేష్



రాష్ట్ర ప్రజానీకానికి ఈనెల మొదటి వారంలోనే చంద్రన్న కానుకలు అందాయని, తాజాగా పింఛన్‌దారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు రెట్టింపు పింఛన్‌ను ప్రకటించిన నేపథ్యంలో నవ్యాంధ్రలోని ప్రతి ఊరు, పల్లె సంక్రాంతి కళను సంతరించుకుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. ప్రతి ఇంటికి పెద్దకొడుకుగా ఆసరాగా నిలిచిన చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రంలోని ప్రతి గడప సంక్రాంతి శోభను సంతరించుకోవాలని లోకేష్ ఆకాంక్షించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలను తెలుపుతూ, భారతీయ సాంస్కృతిక వారసత్వానికి దర్పణంగా నిలిచే రీతిలో తెలుగు ప్రజలందరూ ఈ సంక్రాంతి పండగ సంబరాలను అంబరాలను తాకే రీతిలో జరుపుకోవాలని లోకేష్ అన్నారు.

సువర్ణ నవల రాసిన

షణ్ముఖశ్రీ ధైర్యాన్ని మెచ్చుకోవాలి

- ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకులు వైఎస్సార్ శర్మ

హైదరాబాద్ (వివేక్‌నగర్), ప్రభ న్యూస్ : నవలా సంస్కృతి చాలా గొప్పదని, 70వ దశకంలో అనేక నవలలు విస్తృతంగా వచ్చాయని, ఆ తరువాత 70వ దశకం చివర్లో నవలా సాహిత్యం రానురానూ మరుగున పడి పోయిందని ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకులు వైఎస్సార్ శర్మ అన్నారు. శ్రీమానస ఆర్ట్స్ థియేటర్స్, త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కళాదీక్షితులు కళా వేదికలో ప్రముఖ హాస్యకథ, నవలా రచయిత జ్యోతిష్య వాగ్భూషణ షణ్ముఖ శ్రీ (ములుగు కుమారస్వామి) రచించిన సువర్ణమాల ఆవిష్కరణ సభను నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన వైఎస్సార్ శర్మ మాట్లాడుతూ నవలా సాహిత్యం చాలా గొప్పదని, పాఠకులను ఆకర్షించే విధంగా షన్ముఖశ్రీ ఈ సువర్ణ నవలను చాలా చక్కగా రాశారన్నారు. సమాజంలో రోజురోజుకు వస్తున్న మార్పులకనుగుణంగా నవలలు రావాల్సిన ఆవశ్యకత ఉందని, మంచి నవలలను తప్పకుండా పాఠకులు ఆదరిస్తారని తెలిపారు. రచయిత షణ్ముఖశ్రీ తన భావాలను సువర్ణ నవల ద్వారా



తెలుగు ప్రజలకు అందించారని, చక్కటి సందేశాత్మకమైన నవల రచించిన షణ్ముఖ శ్రీని వైఎస్సార్ శర్మ సభాముఖంగా అభినందించారు. సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త, వక్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి ముందుగా సువర్ణ నవలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ రోజుల్లో విశ్వశ్రేయస్సును కోరే నవలలు చాలామంది రచయితలు రాశారని, ఆ నవలలన్నీ పాఠకుల ఆదరాభిమానాలు పొందాయన్నారు. నవలకు అపురూప స్థానం ఉందని చెప్తూ వెంకటరెడ్డి నవలకు, కథకు ఉన్న తేడా గురించి చాలా వివరంగా మాట్లాడారు. నవలా సాహిత్యం చాలా ప్రాధానమైందని, ఆ రోజుల్లో చాలామంది రచయితలు చారిత్రాత్మక నవలలు, సాంఘీక నవలలు రాశారని గుర్తుచేశారు. పాత్రల చిత్రీకరణ, సంఘర్షణ నవలల్లో మనకు గోచరిస్తుందని, సువర్ణ పాత్ర స్వభావం గురించి వెంకటరెడ్డి వివరంగా మాట్లాడారు. ఏ శ్మశానవాటిక దగ్గర నుంచి సువర్ణ నవల ప్రారంభమవుతుందో, ఆ శ్మశానవాటికలోనే ఈ నవల ముగుస్తుందని, మన సంస్కృతి, మన ధర్మం చెప్పడానికి నవలలు చాలా ఉపయోగపడతాయన్నారు. సువర్ణ ఒక మంచి నవలని వెంకటరెడ్డి అన్నారు. సద్విమర్శకుడు పోపూరి విశ్వనాథ సువర్ణ నవలను సమీక్షించారు. ఈ నవలలోని పాత్రల గురించి విశ్వనాథ వివరంగా మాట్లాడారు. ఈ సభలో కళా జనార్ధన మూర్తి, ఆధ్మాతికవేత్త అన్నదానం చిదంబరశాస్త్రి, పొత్తూరి సుబ్బారావు తదితరులు సువర్ణ నవల గురించి మాట్లాడారు. సువర్ణ నవలా రచయిత షణ్ముఖ శ్రీని సభలో పాల్గొన్న అతిథులు సత్కరించారు. సువర్ణ నవల గురించి షణ్ముఖ శ్రీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ రథసారధులు రఘుశ్రీ, బండారుపల్లి రామచంద్రరావు, లలితావాణి, కళా జనార్ధనమూర్తి, యలవర్తి రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా జరిగిన భక్తి సంగీత కార్యక్రమంలో గాయని కమలావతి, పలు భక్తి గీతాలను మధురంగా గానం చేశారు.

భాజపాకు బాబే

బ్రాండ్ అంబాసిడర్!

- కాషాయ నేతల ఎద్దేవా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గడికోసారి రంగులు మారుస్తారని బీజేపీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల సహ ఇంచార్జి సునీల్ దేవ్‌ధర్ ఏపీ సీఎం చంద్రబాబును లక్ష్యంగా చేసుకుని విమర్శల వర్షం కురిపించారు. పచ్చ రంగు పట్టుకున్న తర్వాత వరుసగా రెండు సార్లు ఓడిపోయిన చంద్రబాబు, 2014లో మళ్లీ కాషాయానికి మారి అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ కాషాయం వీడి, పచ్చ రంగు పట్టుకున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీతో కలిసి లేనప్పుడు ఎప్పుడూ చంద్రబాబు అధికారంలోకి రాలేకపోయారని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడు కూడా బీజేపీని పదే పదే విమర్శిస్తూ తమ పార్టీని ప్రజల దగ్గరకు తీసుకెళ్తున్నారని సూత్రీకరించారు. నిజానికి ''బీజేపీకి చంద్రబాబు నాయుడు ఒక బ్రాండ్ అంబా సిడర్''గా వ్యవహరిస్తున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.వెన్ను పోటుకు మారుపేరే చంద్రబాబు నాయుడని తీవ్ర విమర్శలు చేశారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీకి సైతం ఈ వెన్నుపోటు తప్పదని, ఇప్పటికైనా జాగ్రత్త పడాలని తాను రాహుల్ గాంధీని హెచ్చరిస్తున్నానని సునీల్ దేవ్‌ధర్ వ్యాఖ్యానించారు.మీడియా సమావేశంలో బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడులో అభద్రతా భావం తీవ్రంగా పెరిగిపోయిందని అన్నారు. మరోసారి నరేంద్ర మోడీ ప్రధానిని చేయడం దేశ అవసరమని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు.

రాష్ట్రాల అభివృద్ధే దేశాభివృద్ధి అన్న నినాదంతో మోడీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్ర పథకాల్లో అత్యధిక ప్రాధాన్యతనిచ్చారని, అయితే కేంద్రం ఇచ్చిన నిధులను చంద్రబాబు, ఆయన వారసుడు లోకేష్ దోచుకుని దాచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు బీజేపీకి మాత్రమే ఉందన్నారు. అధికారంలోకి రాగానే తొలి సంతకం అంటూ వెయ్యికి పైగా హామీ లిచ్చిన బాబు, హామీల అమలు కోసం ఒక్క సంతకం కూడా చేయలేదని విమర్శించారు. వాల్మీకీ - బోయల రిజర్వేషన్ సమస్యను చంద్రబాబు పరిష్కరించకపోయినా, మోడీ పరిష్కరించేందుకు సానుకూలంగా ఉన్నారని కన్నా తెలిపారు.

ఏపీ భవన్‌లో

సంక్రాంతి సంబరాలు

- స్వగ్రామంలో జరుపుకున్న రోజులు గుర్తుకు తెస్తున్నాయి
- మాజీ కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి ఆర్. చంద్రశేఖర్



న్యూ ఢిల్లీ, ఆంధ్రప్రభ : నాలుగు రోజుల సంక్రాంతి సంబరాలలో రెండవ రోజు ఆదివారం ఉదయం 10గంటలనుంచే ఆంధ్ర ప్రదేశ్ భవన్ లో ఏర్పాటు చేసిన చేనేత, కలంకారీ, వన్ గ్రామ్ గోల్డ్, గోదావరి జిల్లాల నుంచి వచ్చిన ప్రసిద్ధి పొందిన నేతి మిఠాయి దుకాణాలు ప్రవాసాంధ్రులతో కిటకిటలాడాయి. ఉదయం ఎన్‌టీఆర్, సాయంత్రం వినయ విధేయ రామ చలన చిత్రాలకు ప్రవాసాంధ్రులతో డా.అంబేడ్కర్ ఆడిటోరియంలో నిలబడడానికి కూడా చోటు లేకుండా పోయింది.

మధ్యాన్నం 2గంటల నుంచి జరిగిన ''హస్తినలో 2019 ఉత్తమ కూచిపూడి నృత్య బృందం పోటీల కు, క్విజ్, పొడుపుకథల పోటీలకు చిన్నారులు, పెద్దల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. కూచిపూడి నృత్య పోటీలు భవన్ లోని ఆరుబయలు వేదికపైన, క్విజ్, పొడుపుకథలు డా. అంబెడ్కర్ ఆడిటోరియంలో ఎంతో ఆహ్లాదభరితంగా జరిగాయి.

సాయంత్రం ప్రసిద్ధ నేపథ్య గాయకుడు కళారత్న ఎల్. వి. గంగాధర శాస్త్రిచే సంక్రాంతి గీతాంజలి, భగవద్గీత వ్యాఖ్యానం ప్రేక్షకులను ఆద్యంతం కట్టిపడేశాయి. ప్రత్యేకించి భగవద్గీతపై వారు చేసిన వ్యాఖ్యానం ప్రేక్షకులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. అనంతరం అనురాధ వీణానాదం ప్రేక్షకులకు వీనులవిందు చేశాయనడంలో అతిశయోక్తి లేదు. ఆఖరున డా. చింతా రవి బాల కృష్ణ బృందం చే ప్రదర్శించబడిన అన్నమయ్య వైభవం కూచిపూడి నృత్య రూపకం ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసింది. మూడవరోజైన భోగిపండుగనాడు కబడ్డీ, తొక్కుడుబిళ్ళ, రింగ్ గేమ్, టగ్ అఫ్ వార్, మ్యూజికల్ చైర్స్, చెస్, క్యారమ్స్ , ముగ్గుల పోటీలు, పిండివంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నారు.



పొంగళ్ళు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, డూడూ బసవన్నలు, చిన్నారులకు భోగిపండులు పోయటం వంటి సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించడమే కాక ఇండియన్ ఐడల్, జీ సరిగమప టీమ్ వారిచే సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు రెసిడెంట్ కమీషనర్ తెలిపారు.

నేటి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి ఆర్. చంద్ర శేఖర్ పాల్గొని వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నవారిని దుశ్శాలువాలాతో సత్కరించారు. వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సంక్రాంతి వేడుకలను ఇంత ఘనంగా జరుపుతూ అన్ని వర్గాల వారిని ఒక చోటికి చేర్చి వారివారి సొంతఊళ్ళల్లో కూడా సంక్రాంతి పండుగను ఇంత గొప్పగా జరుపుకోలేని విధంగా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్, బృందాన్ని కొనియాడారు.

3వ రోజు సోమవారం కార్యక్రమాలు

మూడవరోజైన భోగిపండుగనాడు కబడ్డీ, తొక్కుడుబిళ్ల, రింగ్ గేమ్, టగ్ అఫ్ వార్, మ్యూజికల్ చైర్స్, చెస్, క్యారమ్స్ , ముగ్గుల పోటీలు, పిండివంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నారు. పొంగళ్ళు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, డూడూ బసవన్నలు, చిన్నారులకు భోగిపండ్లు పోయటం వంటి సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించడమే కాక ఇండియన్ ఐడల్, జీ సరిగమప టీమ్ వారిచే సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. ప్రతి ఒక్కరూ విచ్చేసి సంబరాలను ఆహ్లాదంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చైనాలో బొగ్గు గని కూలి 21 మంది దుర్మరణం

బీజింగ్: చైనాలో బొగ్గు గని కుప్ప కూలిపోవటంతో అందులో పనిచేస్తున్న 21మంది కార్మికులు దుర్మరణ చెందారని స్థానిక మీడియా ఆదివారం తెలిపింది. శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో దుర్ఘటన జరిగే సమయానికి బొగ్గు గనిలో 87మంది కార్మికులు పనిచేస్తున్నారని ప్రభుత్వ మీడియా తమ రిపోర్టులో తెలిపింది. షాంక్సీ రాష్ట్రంలో లిజియాగూ బొగ్గు గనిలో ఈ ప్రమాదం జరిగిందని నివేదికలో తెలిపింది. ప్రాథమిక సమాచారం ప్రకారం శనివారం 19మంది చనిపోగా 66 మందిని ఎయిర్‌లిఫ్ట్ ద్వారా సురక్షితంగా తరలించారని, అనంతరం ఆదివారం రెస్క్యూ సిబ్బందికి గనిలో చిక్కుకుపోయిన మరణించిన మరో ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ప్రమాదానికి కారణం ఇంకా తెలియలేదని దీనిపై దర్యాప్తు జరుగుతోందని అధికారులు తెలిపారు. గత కొన్నేళ్లుగా బొగ్గుగని ప్రమాదాలు తగ్గుముఖంపట్టాయన్నారు. కాగా బొగ్గు ఉత్పత్తిలో చైనా ప్రపంచ వ్యాప్తంగా ప్రథమస్థానంలో ఉంది.

ఆగని టోల్ దందా!

- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు! • ఆగ్రహించిన వాహనదారులు
- రంగంలోకి పోలీసు బలగాలు • తిరుగు ప్రయాణంలోనైనా చక్కదిద్దే యోచన



అమరావతి, ఆంధ్రప్రభ ప్రభుత్వ ఉత్తర్వు లను బేఖాతరు చేస్తూ టోలు రుసుము వసూళ్లపై వాహనదారుల్లో ఆగ్రహం పెల్లుబుకుతోంది. జాతీయ రహదార్ల సంస్థ నుంచి తమకు ఏ విధమైన ఆదేశాలు అందలేదంటూ వాహనదారులను నిలిపేసి టోలు రుసుము వసూలు చేయడంతో పలువురు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తర్వుల ఉల్లంఘన, వాహనదారుల ఆగ్రహంతో సీరియస్ అయిన ప్రభు త్వం పోలీసులను రంగంలోకి దింపి దిద్దుబాటు చర్యలను ప్రారంభించింది. పోలీసుల రంగప్రవేశంతో కొన్ని జిల్లాల్లోని టోల్‌ప్లాజా నిర్వాహకులు దారికి వచ్చినప్పటికీ.. మరికొన్ని జిల్లాల్లో 'డోంట్ కేర్' అనే ధోరణి కొనసాగుతోంది. సంక్రాంతి వేడుకలకు వెళ్లే వారితో జాతీయ రహదా ర్లపై ట్రాఫిక్ నిలిచిపోవడం, టోలు రుసుము కట్టేందుకు గంటల వ్యవధి వేచి ఉండాల్సి రావడంతో ప్రభు త్వం రంగంలోకి దిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు శనివారం రాత్రి టోలు రుసుము వసూలు చేయవద్దంటూ ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల నేప థ్యంలో రుసుము వసూళ్లు ఉండవంటూ వచ్చిన వాహనదారులకు టోలు ప్లాజాల వద్ద చుక్కెదురైంది. రాష్ట్రప్రభుత్వ నిబంధనలు తమకు వర్తించవని చెపి ్పన టోలు ప్లాజాల నిర్వహకులు జాతీయ రహదార్ల సంస్థ నుంచి ఏ విధమైన ఆదేశాలు రాలేదంటూ వాహనదారులకు స్పష్టం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకొని ఉద్రిక్తలకు దారితీసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొనడంతో రాష్ట్ర ప్ర భుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో నిర్వహిస్తున్న టోల్ ప్లాజాలకు ప్రభుత్వ నిబంధనలు వర్తించవని చెప్పడాన్ని సీరియస్‌గా తీసుకొని పోలీసు బలగాలను రంగంలోకి దించింది. ప్ర భుత్వ ఆదేశాల మేరకు టోల్ ప్లాజాల వద్ద మోహరించిన పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందుల పేరిట గేట్లు ఎత్తేయించారు. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని టోల్ ప్లాజాల నిర్వాహకులు పోలీసుల ఆదేశాలకు తలొగ్గి టోలు రుసుము వసూలు చేయ లేదు. గుంటూరు జిల్లాతో పాటు రాయలసీమ, ఉత్తరాంధ్రలోని టోల్ ప్లాజా నిర్వాహకులు మాత్రం ప్రభుత్వ ఆదేశాలు తమకు వర్తించవంటూ రుసుము వసూళ్లు కొనసాగిస్తున్నారు. ఆదివారం సాయం త్రం వరకు కూడా వీరికి పోలీసు అధికారులు నచ్చచె పుతూనే ఉన్నారు. అయినప్పటికీ పలు టోల్‌ప్లాజా నిర్వాహకులు ఖాతరు చేయడం లేదు. ఆదివారం సాయం త్రానికి కొంత రద్దీ తగ్గడంతో టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గాయి. ఏదో విధంగా టోల్ ప్లాజా నిర్వాహకులను ఒప్పించి తిరుగు ప్రయా ణంలోనైనా సమస్య లేకుండా చూడాలనే నిర్ణయంతో అధికారులు ఉన్నట్లు తెలిసింది.

శ్రీశైలం ఘాట్‌లో లోయలోకి దూసుకెళ్లిన బస్సు



మహారాష్ట్ర నుంచి శ్రీశైలంకు యాత్రికులతో వెళ్తున్న బస్సు అదుపు తప్పి ఘాట్‌రోడ్డులోని చిన్నారుట్ల వద్ద లోయలోకి దూసుకెళ్లింది. కాగా బస్సులోని 50 మంది ప్రయాణికులు సురక్షితం.

టోల్‌గేట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



- సీపీఐ కార్యదర్శి రామకృష్ణ

అమరావతి, ఆంధ్రప్రభ : ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ టోల్ గేట్ నిర్వా హకులు ఆ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ వాహన చోదకులనుండి టోల్ ట్యాక్స్‌ను ముక్కుపిం డి వసూలు చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. టోల్ ఫీజును రద్ధు చేస్తూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రప్రభుత్వాలు స్పష్టమైన ఆదేశాలు జారీచేసినా నిర్వాహకులు వాటిని బుట్టదాఖలు చేస్తున్నారని ఒక ప్రకటనలో రామకృష్ణ మండిపడ్డారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని టోల్ గేట్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గుండె జబ్బులకు ఆధునిక వైద్యం

- అందుబాటులోకి హార్టువాల్వ్ థెరపీ

హై దరాబాద్,ఆంధ్రప్రభ: వైద్యరంగంలో వేగంగా అందుతున్న పరిశోధనల ఫలితాలు సాంకేతిక మేళవింపులతో ఆధునిక వైద్య చికిత్సలను అందుబాటులోకి తెస్తున్నాయి. హైదరాబాద్‌లో కార్డియాక్ ఇన్‌సైడ్స్ పేరుతో జరిగిన రెండురోజుల అంతర్జాతీయ వైద్యసదస్సు ఆదివారం ముగిసింది. అపోలో హాస్పటల్స్ ,కొలంబియా హాస్పటల్స్ యూఎస్‌ల సహకారంతో నిర్వహించిన ఈ సదస్సు ముగింపు సమావేశంలో ఫాక్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సినియర్ కార్డిలాజిస్ట్ డా.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ శరీరంలోని రక్తసరఫరా వ్యవస్థలో కుంచించుకుపోయిన వాల్వ్‌ను తొలగించి తిరిగి దాని స్థానంలో భర్తీ చేయడానికి అతితక్కువ కోతతో చర్మంపై ఎలాంటి కుట్లు కనబడకుండా ఉపయోగించే పద్ధతి అందుబాటులో ఉందన్నారు. తక్కువ సమయానికి అనెస్తీషియా ఇచ్చి రోగి గజ్జల్లో చిన్న రంధ్రం చేసి అతితక్కువ కోతతో చేసే విధానం ఇప్పుడు ఉపయోగకరంగా ఉందన్నారు.

డంపింగ్ యార్డ్ ఏర్పాటు యోచనను విరమించుకోవాలి

- సీఎంకు సీపీఎం కార్యదర్శి మధు లేఖ



అమరావతి, ఆంధ్రప్రభ : విశాఖ మహాన గరంలో జనావా సాల మధ్య డంపింగ్‌యార్డ్‌ను ఏర్పాటు చేయాలని జీవీఎంసీ తీసుకున్న నిర్ణయాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు తీవ్రంగా విమర్శించారు. నగర పాలక సంస్థ లోని 52వ వార్డులో 20 వేల మంది ప్రజలు నివసించే చోట ఈ డ్రై రిసో ర్స్ సెంటర్‌ను ఏర్పా టు చేయాలని అక్కడి అధికారులు తీసుకున్న నిర్ణయా న్ని నిలుపుదల చేసే విధంగా ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖలో మధు డిమాండ్ చేశారు. అక్కడి చుట్టుప్రక్కల ప్రజలు రెండు వారాల నుండి డంప్ యార్డ్ ఏర్పాటును తీవ్రంగా ప్రతిఘటిస్తూ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని మధు గుర్తుచేశారు. డంప్‌యార్డ్‌కు బదులు కళ్యాణ మండపం, కళావేదిక, గ్రాంధాలయం, బాలల విజ్ఞాన కేంద్రంలాంటి ప్రజోపయోగమైన పనులను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.సీఎంకు రాసిన మరోలేఖలో విశాఖ జిల్లా గాజువాక మండల పరిధిలో సిద్దార్ధ నగర్ ప్రాంతాన్ని 22-ఎ నుండి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ స్థలాన్ని 1989లో బిహెచ్‌పివి ఎంప్లాయిస్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి రాష్ట్రప్రభుత్వం బలహీన వర్గాల ఇళ్ళ నిర్మాణ నిమిత్తం కేటాయించిందన్నారు. ఆ భూమిని ప్రభుత్వ ధర ప్రకారం 9 ఎకరాల భూమికి సభ్యులు డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించు కోవడంతోపాటు ఉడా అనుమతిని పొంది 30 సంవత్సరాలుగా అక్కడ 272 మంది ఇళ్ళు నిర్మించుకుని నివసిస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అన్ని రికార్డులు కలిగి ఉన్న భూమిని 22-ఏ పరిదిలోకి తెచ్చి తద్వారా సొంత గృహాలు కలిగివున్నావారు కూడా బ్యాంక్ రుణాలు పొందడానికి వీలులేకుండా చేయడం శోచనీయమన్నారు. ఈ వాస్తవాన్ని గమనంలోకి తీసుకుని సదరు నివాస ప్రాంతాన్ని 22-ఏ పరిధి నుండి తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని సీఎంకు మధువిజ్ఞప్తి చేశారు.

పులివెందులకు జగన్ ఏమి చేశారు..?

- మంత్రి ఆదినారాయణ



జమ్మలమడుగు రూరల్, ప్రభ న్యూస్ : ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేవలం ముఖ్యమంత్రి సీటు కోసం తాపత్రయపడుతున్నారే తప్ప తన సొంత నియో జకవర్గమైన పులివెందులలో ఏమి అభివృద్ధి చేశారో తన మనస్సాక్షికి అయినా చెప్పుకోవాలని మార్కెటింగ్ శాఖా మంత్రి సి.ఆదినారాయణ రెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం రాత్రి 7 గంటలకు కడప జిల్లా, జమ్మలమడుగు పట్ట ణంలోని పాత బస్టాండ్‌లో గల మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఐమాక్స్‌లైట్ మరియు జమ్మలమడుగు - ప్రొద్దుటూరు రహదారి అలాగే జమ్మలమడుగు - ముద్ద నూరు రహదార్లలోని డివైడర్ల నందు నగర పంచాయతీ అధికారులు రూ. 70 లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన వీధి దీపాలు, ఐమాక్స్ దీపాలను చైర్‌పర్సన్ తులశమ్మ ఆధ్వ ర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆది మాట్లాడుతూ జమ్మలమడుగు నగర పంచాయతీలోని రహదారులన్నీ విద్యుత్ దీపాల వెలుగులతో శోభాయమానంగా తయారయ్యాయన్నారు. అలాగే జమ్మల మడుగు మండలంలోని సుగమంచిపల్లె నుంచి కొండాపురం మండలంలోని కె.సుగమంచిపల్లె వరకు రూ. 70 కోట్లు ఖర్చు చేసి నేషనల్ హైవే (4 లైన్ రోడ్లు), మెరుగైన డ్రైనేజీ పనులు, ముద్దనూరు బైపాస్‌లో ఏర్పాటు చేసిన బ్రిడ్జి తదితర వాటి వల్ల జమ్మలమడుగు నియోజకవర్గం ఏ విధం గా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందో ప్రజలు తెలుసు కోవాలన్నారు.తెలుగు దేశం పార్టీ ప్రజలకు చేస్తున్న అభివృద్ధిని గమనించి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కమీ షనర్ లక్ష్మీరా జ్యం, మాజీ విసి తాతిరెడ్డి సూర్యనా రాయణ రెడ్డి, అర్బన్ సిఐ కత్తి శ్రీనివాసులు, టీడీపీ నాయకు లు, కార్యకర్తలు, పోలీసులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కోతముక్క మోసం గుట్టురట్టు


- ఐదుగురు నిందుతుల అరెస్టు
- పరికరాలు స్వాధీనం • మోసాలపై సమాచారం ఇవ్వాలన్న విజయవాడ సీపీ



అమరావతి, ఆంధ్రప్రభ: సంక్రాంతి సంబరాల్లో 'కోత ముక్కలాట'తో అమాయకుల సొమ్ము కొల్లగొట్టేందుకు చేసిన కుట్రను విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు భగ్నం చేశారు. ఢిల్లీ నుంచి దిగుమతి చేసుకున్న సివికె-458 చీటింగ్‌కిట్ పరికరాలను స్వాధీనం చేసుకొని ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం పైడిపర్రు గ్రామానికి చెందిన గుడివాడ నవీన్, గుంటూరు జిల్లా కోసూరు విధ్యానగర్‌కు చెందిన షేక్ జానీభాషా, విజయవాడ పటమటకు చెందిన మెరుపు సందీప్, గుంటూరు జిల్లా ఇస్లాంపేటకు చెందిన మహ్మద్ మహబూబ్ గోరి, పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన యండ్ల అశోక్ కుమార్ ఉన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను విజయవాడ పోలీసు కమిషనర్ సిహెచ్.ద్వారకా తిరుమలరావు ఆదివారం రాత్రి జరిగిన విలేకరుల సమావేశంలో వివరించారు. సివికె-458 యాప్‌ను ఇంటర్‌నెట్ గేమ్ పర్చేజర్ ద్వారా వాచ్, మొబైల్, స్కాన్‌డు ప్లెయింగ్ కార్డ్సు తదితర పరికరాలతో నిందితులు జూదం పేరిట అమాయకులను మోసగిస్తున్నారు. వాచ్, మొబైల్ ఫోన్‌లలో చిన్నపాటి కెమెరాను రహస్యంగా అమర్చడం ద్వారా స్కాన్‌డు కార్డులు ఉపయోగించి జూదం నిర్వహిస్తున్నారు. ఈ విధానంలో కోత ముక్కలో పడబోయే ముక్కను ముందుగానే తెలుసుకొని అధిక మోతాదులో పందేలు కట్టి అమయాలకును గుల్ల చేస్తున్నారు. గత కొంతకాలంగా వేర్వేరు ప్రాంతాల్లో వీరి తరహా నేరాలను చేస్తూ రూ.లక్షలు ఆర్జించినట్లు సీపీ తిరుమలరావు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సంక్రాంతి కోడి పందేల వద్ద కోత ముక్కలు నిర్వహించేందుకు ఢిల్లీ నుంచి పరికరాలు దిగుమతి చేసుకున్నారు. కార్గో విమానంలో ఇవి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జి.రాజీవ్ కుమార్‌నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ సురేష్ రెడ్డి, ఇతర సిబ్బంది స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేశారు. నిందితులపై గన్నవరం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితులు తాము మోసం చేసే విధానాలను ఈ సందర్భంగా ప్రదర్శించి చూపారు. ఈ తరహా జూదం, మోసాలకు సంబంధించిన వివరాలను పోలీసులకు తెలియజేయాలని ద్వారకా తిరుమలరావు కోరారు.

'ఏపీ'కి గులాబీలు!

- నేడు భీమవరం సంబరాలకు తలసాని • భారీ కాన్వాయ్‌తో వస్తున్న టీఆర్ఎస్ నేత • రిటర్న్‌గిఫ్ట్ మొదలైందా?



ఆంధ్రప్రభ, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వేలుపెడతామని, చంద్రబాబుకు రిటర్న్‌గిఫ్ట్ ఇచ్చి తీరుతామని సంచలన ప్రకటన చేసిన తర్వాత తొలిసారి టీఆర్ఎస్ కీలకనేతల్లో ఒకరు భారీకాన్వాయ్‌తో ఎపికి వెళ్తున్నారు. ఓ రోజంతా అక్కడే మకాం వేయడంతో పాటు రాత్రి కూడా బ ్సచేయనున్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి, రాజకీయవర్గాల నుండి వచ్చే స్పందనను పసిగట్టి టీఆర్ఎస్ ఎపి ఎన్నికలకు సంబంధించి తనదైన వ్యూహాన్ని సిద్ధం చేసుకోనున్నట్లు తెలుస్తోంది. ఎపిలో పెద్దసంఖ్యలో బంధువర్గం, మిత్రులు ఉన్న టీఆర్ఎస్ ముఖ్యనేత, మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ సోమవారం ఉదయం భారీకాన్వాయ్‌తో హైదరాబాద్ నుండి విజయవాడ వెళ్ళి అక్కడ అమ్మవారి దర్శనం అనంతరం భీమవరంలో జరిగే సంక్రాంతిసంబు రాల్లో పాల్గొనాలని నిర్ణయించారు. భారీ కార్లకాన్వాయ్‌తో తలసాని ఆంధ్రప్రదేశ్‌లో అడు గుపెట్టే ప్రణాళిక రూపొందించుకోగా, అటు ఆంధ్ర ప్రదేశ్, ఇటు తెలంగాణ రాజకీయవర్గాల్లో దీనిపై ఆసక్తి నెలకొంది. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా తన నియోజకవర్గంలో ఎపికి చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు మకాం వేసి ఓడించే ప్రయత్నం చేశారని వారి ఎత్తులను తమ అధినేతల సహకారంతో చిత్తుచేశామని, ఇపుడు అందుకు తాము బదులు తీర్చుకోవాల్సిఉందని తలసాని తన సన్నిహితుల వద్ద అంటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే తలసాని ఎపి నాడిని ఒడిసిపట్టేందుకు, ప్రజల మూడ్‌ను గమనించేందుకు తన పర్యటనను ఉపయోగించుకోవొచ్చని అంచనా వేస్తున్నారు. సోమవారం ఉదయం 7గంటలకు తలసాని హైదరా బాద్ నుండి విజయవాడకు బయలుదేరుతారు. 10గంటలకు విజయవాడ సమీపంలోని ఇబ్రహీం పట్నం నుండి స్థానిక యాదవసంఘం ఆధ్వర్యంలో భారీర్యాలీగా ఇంద్రకీలాద్రి వరకు వెళతారు. 10.30 కు కనకదుర్గమ్మను దర్శించుకుంటారు. విజయవాడ నుండి భీమవరం చేరుకుని అక్కడి ప్రసిద్ధ మావు రాలమ్మను దర్శించుకుని రాత్రి అక్కడే బసచేస్తారు. మంగళవారం హైదరాబాద్‌కు తిరుగుప్రయాణం కానున్నారు.

రాజకీయవర్గాల్లో ఆసక్తి

తెలంగాణకు చెందిన కీలకనేత, కేసీఆర్ క్యాబినెట్‌లో నాలుగేళ్ళకు పైగా మంత్రిగా పనిచేసిన తలసాని శ్రీనివాసయాదవ్ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తుండడం రిటర్న్‌గిఫ్ట్‌లో భాగమేనా? లేక వ్యక్తిగత పర్యటనా అన్న చర్చ సాగుతోంది. దైవదర్శనాలకు మినహా తెలంగాణ టీఆర్ఎస్ నేతలు భారీకాన్వాయ్‌తో ధూంధాంగా ఎపిలో పర్యటించిన సందర్భాలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక లేకపోగా, ఇపుడు తలసాని అందులో తొలివరుసలో నిలుస్తున్నారు. తలసాని తర్వాత మరికొందరు నేత లు కూడా ఎపిలో వివిధ సంఘాల సమావేశాలకు హాజరయ్యే అవకాశం ఉందని తెలు స్తోంది.

19న మంగళగిరిలో మాదిగల విశ్వరూప మహాసభ

- మీడియా సమావేశంలో కృష్ణ మాదిగ వెల్లడి



అమరావతి, ఆంధ్రప్రభ: నవ్యాంధ్ర పరిధిలోని మంగళగిరిలో ఈనెల 19న 'మాదిగల విశ్వరూప మహాసభ'ను నిర్వహిస్తున్నట్లు 'మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి' వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ తెలిపారు. ఆదివారం ఆయన మంగళగిరిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ మహాసభకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో మాదిగల ఆత్మగౌరవాన్ని చాటే రీతిలో ఈ మహాసభను 10 లక్షల మంది భాగస్వామ్యంతో నిర్వహించనున్నామన్నారు. తెలంగాణలో ఎస్సీ రిజర్వేషన్‌కు ఏపీకి చెందిన నేతలు మద్దతు పలుకగా నవ్యాంధ్రలో మాత్రం పెదవి విప్పడంలేదని కృష్ణ మాదిగ ఆరోపించారు. 2019లో జరిగే ఎన్నికల్లో తమ జాతి ప్రగతిపట్ల సానుకూలతను వ్యక్తం చేసే పక్షాలకు మాత్రమే మద్ధతునిస్తామని ఆయన స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లను ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు వర్తింపచేస్తూ తీసుకున్న నిర్ణయానికి తమ సంఘం సంపూర్ణ మద్దతునిస్తున్నట్లు కృష్ణమాదిగ ప్రకటించారు. తాము నిర్వహించబోయే మాదిగల విశ్వరూప సభను అడ్డుకోవద్దని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సబ్ కలెక్టర్ తీరుపై సీఎంఓకి ఫిర్యాదు

- రైతులకు అండగా నిలబడటం తప్పా?
- పెనుమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్



అమరావతి, ఆంధ్రప్రభ : విజయవాడ సబ్‌కలెక్టర్ మిషాసింగ్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, అధికారుల తీరు సరిగా లేదని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆదివారం విజయవాడ సబ్‌కలెక్టర్ మీద సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేయడానికి ఉండవల్లి వెళ్లగా ముఖ్యమంత్రి అందుబాటులో లేకపోవడంతో సీఎం సెక్రటరీ సతీష్‌చంద్రను కలిశారు. అనంతరం విజయవాడ టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈడుపుగల్లు గ్రామ రైతులు మట్టిపని చేస్తుంటే రెవిన్యూ అధికారులు అడ్డుకున్నారని, రైతుల మట్టిపనిచేస్తున్న యంత్రాలను సీజ్ చేశారని, రైతులకు అండగా నిలబడటం నేను చేసిన తప్పా అని ప్రశ్నించారు. రైతులు తప్పు చేసినట్టు నిరూపిస్తే తాను అపరాదరుసుము చెల్లిస్తానని సబ్‌కలెక్టర్‌కి చెప్పినా వినిపించుకోలేదని, హంతకుని ఆఫీసు తనిఖీ చేసినట్టు 50మంది పోలీసులతో వచ్చి సబ్‌కలెక్టర్ తనిఖీ చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. తానేమైనా దోపిడీ చేసానా.. హత్య చేసానా అంటూ నిలదీశారు. రైతులపై కేసులు పెట్టడం సరికాదని, రైతుల తరపున తాను రూ.లక్ష జరిమానా కట్టానని, ప్రొక్లైన్ కూడా వాళ్లకి ఇచ్చానన్నారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకి వివరణ ఇవ్వడానికి ఉండవల్లి సీఎం నివాసానికి వెళ్లానని, కానీ సీఎం అందుబాటులో లేరని, దాంతో సీఎం సెక్రటరీ సతీష్ చంద్రను కలిసి జరిగింది అంతా చెప్పానన్నారు. రెండు మూడు రోజుల్లో సీఎంని కలిసి జరిగింది వివరిస్తానన్నారు.

అవినీతిపై అవినీతి చక్రవర్తి పుస్తక రచన..?

- జగన్ ఆదాయం ఎలా పెరిగిందో జనానికి తెలియాలి.. జీవీ ఆంజనేయులు



అమరావతి, ఆంధ్రప్రభ : తాను ఏ పదవీ నిర్వహించకుండా తండ్రి ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఇబ్బడిముబ్బడిగా ప్రజాధనం దోచేసిన ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి అవినీ తిపరుడంటూ పుస్తకాన్ని ముద్రించడాన్ని టీడీపీ సీనియర్ నేత, శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు తీవ్రంగా గర్హించారు. ఆదివారం ఆయన గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జగన్ ధోరణిని, టీడీపీ, ముఖ్యమంత్రిపై చేస్తున్న వ్యాఖ్యలను దుయ్యబట్టారు. పాదయాత్ర పేరుతో జిల్లాల్లో పర్యటిస్తూ ప్రజల నుండి స్పందన కరువవ్వడంతో తన సంకల్పయాత్రను జగన్ కేవలం ముఖ్యమంత్రిపై అసత్య ప్రచారాలు చేయడానికే పరిమితం చేసుకున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రూ.3 లక్షల కోట్ల అవినీతి జరిగిందని 9 నెలల కిందట పుస్తకం విడుదల చేసిన జగన్ తాజాగా రూ.6.17 లక్షల కోట్ల అవినీతి జరిగిందంటూ అబద్దాలు, అసత్యాలను పొందుపరుస్తూ పుస్తకం వేశారని.. ప్రజల సొమ్ము దోచుకోవడానికి ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నది వైఎస్ రాజశేఖరెడ్డి జమనాకాదని తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మద్దిరాల మ్యానీని ఆంజనేయులతోపాటు పలువురు టీడీపీ నేతలు అభినందించారు. తెలుగు ప్రజలందరికీ వారు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

గూడూరు మార్గంలో పలు ప్యాసింజర్ రైళ్లు రద్దు

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లోని గూడూరు రైల్వే జంక్షన్ సమీపంలో ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో ఆ మార్గంలో 16 ప్యాసింజర్ రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం ప్రకటించారు. ప్రధానంగా గూడూరు-తిరుపతి మార్గంలో నడిచే మెము ప్యాసింజర్‌తో పాటు గుంటూరు- ధోనే ప్యాసింజర్, నెల్లూరు - సూళ్లూరుపేట ప్యాసింజర్, నెల్లూరు-తిరుపతి ప్యాసింజర్, బిట్రగుంట-చెన్నై సెంట్రల్ ప్యాసింజర్, ధోనే-ఘూటీ డెమో ప్యాసిం జర్, కర్నూల్ సిటీ-గుంతకల్ డెమో ప్యాసింజర్ రైళ్లను ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు రద్దు చేశారు. అలాగే గూడూరు-రేణిగుంట మెము ప్యాసింజర్, సూళ్లూరుపేట-నెల్లూరు మెమో ప్యాసింజర్, తిరుపతి-నెల్లూరు మెము ప్యాసింజర్, రేణిగుంట-గూడూరు, చెన్నై సెంట్రల్-గూడూరు ప్యాసింజర్ రైళ్లను రాకపోను ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు రద్దు చేశారు. అదే విధంగా మరో 11 ప్యాసింజర్ రైళ్లను కూడా పైన పేర్కొన్న తేదీల్లో పాక్షికంగా రద్దు చేశారు.

గూడూరులో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల

ఎర్నాకులం- పాట్నా (22643) ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 22, 23, 29, 30 తేదీల్లో గూడూరులో అదనపు స్టాపేజ్ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

అలాగే బెంగుళూరు-గౌహతి కజిరంగ (12509) ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 24, 26, 30 తేదీల్లోను, హౌరా-ఎర్నాకులం (22877) అంత్యో దయ ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 27న తాత్కాలికంగా నిలుపు దల చేయనున్నట్లు చెప్పారు. చెన్నై సెంట్రల్-నిజాముద్దీన్ దురంతో (12269) ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 28న నిలుపుదల చేయనున్నారు. చెన్నై-ఎగ్మోర్ (12390) గయ ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 29న, చెన్నై-హౌరా (12842) ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 29న తాత్కాలికంగా నిలుపుదల చేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

సీఎంకు ధన్యవాదాలు

- ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు

అమరావతి, ఆంధ్రప్రభ: 70ఏళ్లకు 15శాతం అదనపు పింఛన్ మంజూరు చేయాలని ఏపీజేఏసీ అమరావతి విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసి సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని 4లక్షలమంది విశ్రాంత ఉద్యోగులందరికీ సంక్రాంతి కానుక ఇచ్చారని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు అన్నారు. అదేవిధంగా వృద్దుల సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం రూ.200కోట్ల అదనపు భారం అయినప్పటికీ 70సంవత్సరాలు దాటిన విశ్రాంత ఉద్యోగలకు 10శాతం అదనపు పెన్షన్ మంజూరు చేసినందుకు ఏపీజేఏసీ అమరావతి పక్షాన సీఎం చంద్రబాబుకి ధన్యవాదాలు తెలిపారు. ఈ ఉత్తర్వుల వల్ల రాష్ట్రంలో ఉన్న 70వేల మంది పైచిలుకు విశ్రాంత ఉద్యోగులు తక్షణమే లబ్ధి పొందడం జరుగుతుందని తెలియజేశారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలపనున్నట్లు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రకటించారు.

మీటూ ఉద్యమం వల్ల కొంత మార్పొచ్చింది


తాప్సీ

కొద్ది రోజుల క్రితం మీ టూ ఉద్యమం ఊపందుకుంది. అప్పుడే క్యాస్టింగ్ కౌచ్ గురించి కూడా చర్చకు వచ్చింది. చాలా మంది నాయికలు తమకు ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. ''తనకు మాత్రం ఎలాంటి అనుభవం ఎదురుకాలేదని'' నటి తాప్సీ ఆ సందర్భంగా స్పష్టం చేసింది. ''తన తొలి చిత్రాలు విజయం సాధించడంతో కొత్త అవకాశాల కోసం సినిమా ఆఫీసుల చుట్టు తిరిగే అవసరం రాలేదు. ఈ విషయంలో నేను అదృష్టవంతురాలిని'' అంటూ చెప్పుకొచ్చింది. ''క్యాస్టింగ్ కౌచ్ గురించి అందరూ మాట్లాడటం ప్రారంభించాక, కొంత మార్పు కనిపిస్తోంది. సినిమా షూటింగ్‌లో పురుషుల ప్రవర్తన చాలా మారింది. వాళ్ళు జాగ్రత్తగా ఉంటున్నారు'' అని తెలిపింది. ''ఇలాంటి సంఘటనలు కేవలం సినీరంగానికి మాత్రమే పరిమితం కాదు. ఇతర రంగాల్లో కూడా ఉంటాయని'' తాప్సీ పేర్కొంది.

సెట్స్ మీదకు సిద్ధం


కమల్ హాసన్

కమల్ హాసన్, దర్శకుడు శంకర్‌ల చిత్రం భారతీయుడు ఓ చరిత్రను సృష్టించింది. సందేశాత్మక కథలను ఎంత వాణిజ్య విలువలతో కలిపి చూపించవచ్చో చెప్పేందుకు భారతీయుడు ఒక ఉదాహరణ. ప్రస్తుతం ఈ చిత్రానికి కొనసాగింపు సినిమా చేసేందుకు రంగం సిద్ధమైంది. కమల్ హాసన్ హీరోగా దర్శకుడు శంకర్ భారతీయుడు 2 చిత్రాన్ని రూపొందించనున్నారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మాణ బాధ్యతలు వహిస్తోంది. అందాల భామ కాజల్ అగర్వాల్ ఈ చిత్రంలో నాయికగా ఎంపికైంది. మరో యువ నటుడి పాత్రకు దుల్కర్ సల్మాన్‌ను ఎంచుకున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో దేశంలోని వర్తమాన సామాజిక, రాజకీయ సమస్యలను ఇతివృత్తంగా ఎంచుకున్నారట. ఈ నెల 18 నుంచి భారతీయుడు 2 సినిమా సెట్స్ మీదకు వెళ్లేందుకు అంతా సిద్ధమైంది. ఈ చిత్ర ప్రచార కార్యక్రమాలను రోబో సీక్వెల్ 2.ఓ. సందర్భంగా దర్శకుడు శంకర్ ప్రారంభించారు. భారతీయుడు 2 ఉంటుందనే విషయంలో అప్పటికి స్పష్టత వచ్చింది. కమల్ విశ్వరూపం లాంటి చిత్రాలతో, శంకర్ 2.ఓ వంటి భారీ విజయాల తర్వాత వస్తున్న చిత్రం కావడంతో భారతీయుడు 2పై అంచనాలు గొప్పగానే ఉన్నాయి.



నా కల తీర్చిన చిత్రమిది

- దర్శకుడు అనిల్ రావిపూడి

ఎఫ్2 చిత్రంతో పూర్తిస్థాయి కుటుంబ కథా చిత్రాన్ని రూపొందించాలనే తన కల తీరిందని దర్శకుడు అనిల్ రావిపూడి సంతోషాన్ని వ్యక్తం చేశారు. వెంకటేష్, వరుణ్ తేజ్, తమన్నా, మెహరీన్ ప్రధాన పాత్రల్లో ఈ యువ దర్శకుడు తెరకెక్కించిన ఫన్ అండ్ ఫ్రస్టేషన్ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన తెచ్చుకుంటోంది. ఈ చిత్రాన్ని దిల్ రాజు నిర్మించారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ...ఎఫ్2 గొప్ప విజయం సాధించింది. పరిశ్రమలోని చాలా మంది ఫోన్‌లు చేసి అభినందిస్తున్నారు. మేము ఆశించినట్లే ప్రేక్షకాదరణ దక్కింది. వెంకటేష్ గారు మంచి సినిమా చేశానని ఆనందం వ్యక్తం చేశారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా మాకు వరుసగా సినిమాలు చేస్తున్నావని దిల్ రాజు గారు ప్రశంసించారు. నాకు చక్కటి వినోదాత్మక కుటుంబ కథ సినిమా చేయాలని ఉండేది. ఆ కల ఈ చిత్రంతో తీరింది. క్షేమంగా వెళ్లి లాభంగా రండి, పెళ్లాం చెబితే వినాలి, గుండమ్మ కథ లాంటి చిత్రాల స్ఫూర్తి ఎఫ్ 2 కథలో ఉంది. జంధ్యాల, ఈవీవీ, ఎస్వీకృష్ణా రెడ్డి గారి ప్రభావం దర్శకుడిగా నాపై ఉంది. అయితే నేను వాళ్లతో పోల్చుకునేంత ఎదగలేదు. ఇప్పుడిప్పుడే నా ప్రయాణం ప్రారంభించాను. ఈ చిత్రంలో చాలా పాత్రలున్నాయి. వాటన్నింటికీ తగిన గుర్తింపు దక్కుతోంది. సినిమాలోని అనేక ఊతపదాలు ప్రేక్షకులు తిరిగి చెబుతున్నారు. ముఖ్యంగా అంతేగా అంతేగా అనే పదం బాగా పేరు తీసుకొచ్చింది. టీజర్ ట్రైలర్ లు తీసుకొచ్చిన క్రేజ్ సినిమాకు బాగా పనికొచ్చింది. సంక్రాంతికి పెద్ద పెద్ద సినిమాలు ఉన్నాయి అని ముందు కొంత భయపడ్డాం కానీ పండక్కి అన్ని సినిమాలు చూసే అవకాశం ఉంటుందనుకున్నాం. ఎఫ్2 కు కొనసాగింపు సినిమా చేయాలని ఉంది. వరుణ్, వెంకటేష్ ఎప్పుడంటే అప్పుడు చేద్దామని సిద్ధంగా ఉన్నారు. వెంకటేష్ గారికి, బాలకృష్ణకు కథ లైన్‌గా చెప్పాను. కొంత విశ్రాంతి తీసుకుని కొత్త చిత్రం గురించి ఆలోచిస్తాను. ఇప్పటికైతే ఏ సినిమా అంగీకరించలేదు. అన్నారు.


అఖిల్


ఏమైనదో ఏమైనదో అంటున్న మజ్ను

అఖిల్ అక్కినేని కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం మిస్టర్ మజ్ను. శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర, ఎల్ఎల్‌పి పతాకాలపై బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం నిర్మాణానంతర పనుల్లో ఉంది. ఈ నెల 25న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఇప్పటివరకు విడుదలైన ఈ చిత్రం టీజర్‌కు, పాటలకు మంచి స్పందన లభిస్తోందని నిర్మాత తెలిపారు. ఏమైనదో...ఏమైనదో, మిస్టర్ మజ్ను టైటిల్ సాంగ్, హార్ట్ బ్రేక్ పాటలు శ్రోతలను ఎంతగానో అలరిస్తున్నాయని ఆయన చెప్పారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం ఉదయం ఈ చిత్రం జ్యూక్‌బాక్స్‌ను విడుదల చేయబోతున్నట్లు ఆయన వెల్లడించారు.

అఖిల్ సరసన నిధి అగర్వాల్ నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది తదితరులు తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: తమన్, పాటలు: శ్రీమణి, సినిమాటోగ్రఫీ: జార్జ్ సి.విలియమ్స్, ఎడిటింగ్: నవీన్ నూలి, ఆర్ట్: అవినాష్ కొల్లా.

వాళ్ల ప్రతిభను చూస్తుంటే ముచ్చటేస్తోంది

బాలీవుడ్‌పై అమితాబ్ జైత్రయాత్ర దశాబ్దాలుగా అప్రతిహతంగా కొనసాగుతోంది. వివిధ పాత్రల్లో తనదైన శైలిలో ఆయన వేసిన ముద్ర స్పష్టం. ఇంత కీర్తి సంపాదించినా ఈ దిగ్గజ నటుడు ఇంకా నేర్చుకోవాల్సింది ఉందనే చెబుతున్నారు. కొత్త నటీనటుల ప్రతిభ చూస్తుంటే ముచ్చటేస్తుందని అన్నారు. తొలినాళ్లలో తాము పడిన శ్రమ, తపన ఈతరం నటీనటుల్లో కనిపిస్తోందని అమితాబ్ చెప్పారు. పా, ఆరక్షణ్, సత్యాగ్రహ్, షమితాబ్, వాజిర్, పీకూ, తీన్, పింక్ ఇవన్నీ బిగ్‌బీ అభినయ ప్రతిభకు ఉదాహారణలు. ఇటీవల అమితాబ్ మాట్లాడుతూ...నా వయసు ఇప్పుడు 75. ప్రేక్షకుల్లో నాకున్న హోదాకు...సందేశాత్మక చిత్రాలే బాగుంటాయి. ఓ హీరోగా నన్నిప్పుడు చూడలేరు కదా. నాలుగు దశాబ్దాల నా నట ప్రయాణంలో ఇంకా నటనలో నేర్చుకోవాల్సినవి ఉన్నాయనే భావిస్తా. ఇప్పుడు యువతరం నటీనటులను చూస్తుంటే ముచ్చటేస్తుంది. ఓ సన్నివేశం కోసం మేము తొలినాళ్లలో పడిన కుస్తీపాట్లు...ఇప్పటి వాళ్లలో కనిపించడం లేదు. వాళ్లు హాయిగా సెట్‌లోకి వచ్చి దర్శకుడు చెప్పిన సన్నివేశాల్లో అద్భుతంగా నటిస్తున్నారు. వాళ్లను చూస్తే ఆశ్చర్యమేస్తుం టుంది. నేనింకా వాళ్ల నుంచి నేర్చుకోవాల్సింది ఉందని అనిపిస్తుంటుంది అని వినయంగా చెప్పారు. ఇటీవలే థగ్స్ ఆఫ్ హిందూస్థాన్ చిత్రంలో కనిపించిన అమితాబ్ ప్రస్తుతం బ్రహ్మాస్త్ర, సైరా లాంటి చిత్రాల్లో నటిస్తున్నారు.


అమితాబ్

శ్రియ నటన హైలైట్‌గా మహాచంద్ర

యశ్ (కేజీఎఫ్ ఫేమ్), ప్రేమ్‌కువూర్, శ్రియ ప్రధాన పాత్రలలో రూప అయ్యర్ దర్శకత్వంలో రూపొందిన కన్నడ చిత్రం చంద్ర ఇప్పుడు తెలుగులో మహాచంద్ర పేరుతో అనువాదమైంది. నైనా ఫిలిమ్స్ పతాకంపై షాన్వాజ్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకుని రాబోతున్న ఈ చిత్రం డబ్బింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా నిర్మాత షాన్వాజ్ మాట్లాడుతూ, యశ్ ఈ చిత్రంలో ఓ ప్రధాన పాత్రను పోషించారు. అలాగే శ్రియ నటన ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఫిబ్రవరి రెండోవారంలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: గౌతమ్ శ్రీవాస్తవ, కెమెరా: దాస్, సమర్పణ: దామోదర వనాచార్య.



థ్రిల్లర్‌గా అదృశ్యం

జాన్, ప్రియాంక నాయకానాయికలుగా తెరకెక్కిన చిత్రం అదృశ్యం. వైష్ణవి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై స్వీయ నిర్మాణ దర్శకత్వంలో రవిప్రకాష్ కృష్ణంశెట్టి రూపొందించిన ఈ చిత్రం సెన్సార్ పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం ట్రైలర్‌ను ఫిలిం చాంబర్‌లో హీరో జాన్ చేతులమీదుగా విడుదలచేశారు. ఈ సందర్భంగా హీరో జాన్ మాట్లాడుతూ, తెలుగులో ఇది నా మూడవ చిత్రం. అదే నువ్వు...అదే నేను, బంటి ద బ్యాడ్‌బోయ్ చిత్రాల తర్వాత నేను చేస్తున్న చిత్రమిది. నాకు అవకాశం ఇచ్చిన రవిగారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. సీనియర్ దర్శకులు కె.విశ్వనాథ్‌గారిని కలిసి మా ఆడియోను విడుదల చేశాం. ఆయన నన్ను చూసి ప్రభాస్‌లా ఉన్నావని అనడం ఎంతో ఆనందాన్నిచ్చింది అని అన్నారు. దర్శకుడు రవిప్రకాష్ మాట్లాడుతూ, నా కెరీర్ మొదలైంది కె.విశ్వనాథ్‌గారి దగ్గర. కో-డైరెక్టర్‌గా ఆయన దగ్గర చాలా సినిమాలకు పనిచేశాను. తర్వాత సింగీతం శ్రీనివాసరావుగారి దగ్గర 14 సినిమాలకు పనిచేశాను. అలాంటి లెజెండరీ దర్శకుల దగ్గర పనిచేయడం నాకు చాలా గర్వంగా ఉంది. ఇప్పటికే హీరో జాన్ నేను తీసిన బాలల చిత్రం చేశారు. అందుకే ఆయన్ని హీరోగా ఎంచుకున్నా. నేను చేసిన బంటి ద బ్యాడ్‌బాయ్ సినిమాకు ఎన్నో అవార్డులు వచ్చాయి. ఒక రివార్డు సినిమా చెయ్యాలని ఈ సినిమా చేస్తున్నాను. ఇది ఒక థ్రిల్లర్ కథాచిత్రం. సినిమా ఆసక్తికరంగా ఉంటే చాలు బడ్జెట్‌తో పనిలేదు. ఇందులో నలుగురు హీరోయిన్లు నటిస్తున్నారు. జయవాణి మాంత్రికురాలిగా ఓ ప్రత్యేక పాత్ర పోషించారు అని అన్నారు. సంగీత దర్శకుడు ఆల్‌డ్రిన్ మాట్లాడుతూ, తెలుగులో ఇది నా మొదటి చిత్రం. స్వతహాగా నేను తెలుగువాడిని. కాకపోతే చెన్నైలో స్థిరపడ్డాను. తమిళంలో దాదాపు ఏడు చిత్రాలకు సంగీతాన్ని అందించాను. తెలుగులో కూడా బిజీ కావాలని కోరుకుంటున్నా అని అన్నారు.



ప్రముఖ గాయని కల్పన పోలీస్ ఆఫీసర్ పాత్రలో...అంగనారాయ్ నెగెటివ్ షేడ్ పాత్రలో నటించిన ఈ చిత్రంలోని ఇతర పాత్రల్లో జబర్దస్త్ ఆర్.పి.వినోద్, అప్పారావు, హర్షధ తేజారెడ్డి, జయవాణి, కోటేశ్వరరావు, వంశీ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి మాటలు: నాగులకొండ నవకాంత్, కెమెరా: రామ్ పినిశెట్టి, పాటలు: వెన్నెలకంటి, ఎడిటింగ్: ఆకుల భాస్కర్, ఫైట్స్: కృష్ణంరాజు, డ్యాన్స్: సుజ్జి, చార్లీ.

ఆడని చిత్రాల్లో ఎందుకని...!

నాలుగు రోజులు ఆడని సినిమాలు చేస్తే ఎంత...చేయకపోతే ఎంత అని ప్రశ్నిస్తోంది బాలీవుడ్ భామ అమీషా పటేల్. అనవసరమైన చిత్రాల్లో నటించే కంటే ఖాళీగా ఉండటమే మంచిదన్నది ఆమె మాట. ఆలస్యమైనా మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తానంటోందీ సుందరి. నాని, నరసింహుడు వంటి పలు చిత్రాలతో టాలీవుడ్‌లోనూ సుపరిచితమీ భామ. హిందీలో ఆమె సినిమా చేసి ఐదేళ్లవుతోంది. అప్పుడెప్పుడో రేస్2 చిత్రంలో నటించింది. ఖాళీగా ఉండటం ఎందుకని తరుచూ ఫొటో షూట్‌లు చేసేస్తోంది. ఇటీవల ఆమె చేసిన ఓ ఫోటోషూట్‌కు సామాజిక మాధ్యమాలలో మిశ్రమ స్పందన వచ్చింది. వయసుకు తగిన ఫొటోలు దిగమంటూ సలహాలు ఇచ్చారు. ఇలాంటివి పట్టించుకోనన్న అమీషా తన కొత్త చిత్రం గురించి వివరించింది. ఆమె మాట్లాడుతూ....ఈ మధ్య మనం చూస్తున్న సినిమాల్లో చాలా వరకు నాలుగు రోజులైనా థియేటర్‌లలో ఉంటున్నాయా.? అలాంటివే కావాలంటే నేను చాలా సినిమాల్లో నటిస్తాను. మంచి సినిమా కోసమే కొంత ఆలస్యమైంది. ప్రేక్షకుల ముందుకు మంచి సినిమాతో రావడం ముఖ్యం. ఇంతకాలం ఎందుకు కనిపించలేదు అని ఎవరూ అనుకోరు. అని చెప్పింది.


అమీషా పటేల్

నేటి నుంచి ఆస్ట్రేలియా ఓపెన్

బిగ్ ఫోర్‌కు యువస్టార్స్ చెక్?



ఈ ఏడాది తొలి గ్రాండ్ స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్ పోటీలకు నేడు తెరలేవనుంది. బిగ్‌ఫోర్ ఆటగాళ్లుగా పేరుపొందిన రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్, అండీ ముర్రే, నొవాక్ జకోవిచ్‌లకు యువ స్టార్ ఆటగాళ్లనుంచి గట్టిపోటీ ఎదురుకానుంది. వీరు గెలుపుకోసం ఈసారి గట్టిగా శ్రమించాల్సి ఉంటుంది. జర్మనీకి చెందిన జెవెరెవ్, క్రొయేషియాకు చెందిన బోర్నా, రష్యాకు చెందిన కరెన్ ఖచనొవ్, గ్రీస్‌కు చెందిన స్టెఫానో టిసిట్సపాస్ తమ ఆటతో సీనియర్లకు చెక్ చెప్పనున్నారు. డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్ తన తొలి మ్యాచ్‌లో ఉజ్బెక్ టెన్నిస్ స్టార్ డెనిస్ ఇస్టోమిన్‌తో తలపడనున్నాడు.

మెల్‌బోర్న్: స్విస్ స్టార్ రోజర్ ఫెదరర్, సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్‌లు ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ కప్ గెలుచుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. నేడు ఈ టోర్నీ ప్రారంభం కానుంది. మరో దిగ్గజ ఆటగాడు, బ్రిటిన్‌కు చెందిన అండీ ముర్రే గాయంతో సతమవుతుండటంతో ఈ టోర్నీలో రాణించడం కష్టమే. గత ఏడాది ముర్రే, ఫెదరర్, జకోవిచ్, నాదల్‌లు బిగ్ ఫోర్‌గా బరిలోకి దిగారు. ఈ సారి ఆ పరిస్థితి ఉండటం లేదు. ప్రపంచ నెంబర్ 1 జకోవిచ్ నెంబర్ 3 ఫెదరర్‌లు ఈసారి శక్తివంతమైన యువ ఆటగాళ్లలో తలపడనున్నారు. జకోవిచ్ తన ప్రారంభ మ్యాచ్‌లో జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జెవెరెవ్‌తో తలపడుతున్నాడు. జెవెరెవ్ కూడా తన కెరియర్ తొలి మేజర్ టైటిల్‌కోసం ఎదురుచూస్తున్నాడు. గాయంతో సతమతమవుతున్న ముర్రే గ్రాండ్ స్లామ్‌కు ముందే తన రిటైర్మెంట్ ప్రకటించి సంచలనం సృష్టించాడు. తొడ కండరం నొప్పితో ఈ ఏడాది వింబుల్డన్ తర్వాత రిటైర్ కానున్నట్లు తెలిపాడు. ముర్రే తన తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌కు చెందిన రాబర్టో బాటిస్టా అగట్‌తో తలపడనున్నాడు. ఫెదరర్ తన ప్రారంభ మ్యాచ్‌లో డెనిస్ ఇస్టోమిన్‌తో నేడు తలపడనున్నాడు. బ్రిస్బేన్ వార్మప్‌లోనే విరమించిన వరల్డ్ నెంబర్ 2 ఆటగాడు ఆరుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత స్పెయిన్‌కు చెందిన రఫెల్ నాదల్ పూర్తి ఫిట్‌నెస్ ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంది. తాను ఫిట్‌గా ఉన్నానంటూ ఆస్ట్రేలియన్ బరిలోకి వచ్చాడు. మరోవైపు సెర్బియాకు చెందిన 31 ఏళ్ల జకోవిచ్ కూడా ఆరుసార్లు ఆస్ట్రేలియా ఓపెన్‌గెలిచి ఏడో టైటిల్‌కోసం బరిలో ఉన్నాడు. 2018 ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రారంభానికి ముందే జకోవిచ్ మోచేయికి శస్త్ర చికిత్స చేయించుకుని బరిలోకి దిగి తొందరగానే ఇంటిదారి పట్టాడు. ఫలితంగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్ 20 జాబితాలో తన స్థానాన్ని కోల్పోయాడు. అదే ఏడాది జూలైలో జరిగిన వింబుల్డన్ టైటిల్ సాధించి మళ్లీ వరల్డ్ నెంబర్ వన్ ర్యాంకుకు చేరుకున్నాడు. ఇది తన కెరియర్లో నాలుగో టైటిల్. అనంతరం ఆడిన మూడు టోర్నీల్లో ఓటమి చెందాడు. ఇందులో జెవెరెవ్‌తో ఆడిన ఏటీపీ ఫైనల్ మ్యాచ్ కూడా ఉంది. సెప్టెంబర్‌లో తన మూడో యూఎస్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్న జకోవిచ్ ఈ గెలుపుతో తన ఖాతాలో 14 గ్రాండ్ స్లామ్ టైటిళ్లను వేసుకున్నాడు. జకోవిచ్ టైటిళ్ల సంఖ్య, స్పెయిన్ స్టార్ రఫెల్ నాదల్ సాధించిన మొత్తం టైటిళ్ల కంటే మూడు తక్కువగా ఉండగా, ఫెరరర్ సాధించిన టైటిళ్ల కంటే ఆరు తక్కువగా ఉన్నాయి. ఆదివారం జకోవిచ్ మీడియాతో మాట్లాడుతూ.. మెల్‌బోర్న్ బరిలో తిరిగి పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉంది. 2008లో ఇక్కడ సాధించిన తొలి గ్రాండ్‌స్లామ్‌తో తన కెరియర్ మలుపు తిరి గిందన్నాడు. జకోవిచ్ తన ప్రారంభ పోటీని మంగళవారం అమెరికాకు చెందిన మిచెల్ క్రూగర్‌తో ఆడనున్నాడు.

నేను ఫిట్‌గా ఉన్నా : నాదల్

వరల్డ్ నెంబర్ ర్యాంక్ ఆటగాడు 32 ఏళ్ల రఫెల్ నాదల్ కూడా తన తొడ కండరం పట్టేయడంతో బ్రిస్బేన్ టోర్నీనుంచి అర్ధాంతరంగా తప్పుకున్నాడు. అనంతరం సిడ్నీలో ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో మళ్లీ కోర్టులోకి దిగాడు. ఆదివారం నాదల్ మీడియాతో మాట్లాడుతూ.. నా ఫిట్‌నెస్ బాగానే ఉంది. నేను ఫిట్‌గా లేకపోతే.. ఇక్కడ ఉండే వాన్ని కాదుకదా అని అన్నాడు. తన సర్వీస్‌ను మెరుగుపర్చుకున్నా నన్నాడు. అన్ని వేళలా ఆటను మెరుగుపరుచుకుంటూ పోతేనే కొత్త ఆటగాళ్లతో పోటీపడగలుగుతాము అని నాదల్ పేర్కొన్నాడు. నాదల్ నేడు తన ప్రారంభ పోటీలో వైల్డ్ కార్డ్ ఎంట్రీ పొందిన ఆస్ట్రేలియన్ జేమ్స్ డక్‌వర్త్‌తో తలపడనున్నాడు.

ప్రారంభ మ్యాచ్‌లోనే ఫెదరర్‌కు పోటీ

టోర్నీ తొలిరోజు పోటీలోనే 37 ఏళ్ల ఫెదరర్ గట్టి ప్రత్యర్థిని ఎదుర్కోనున్నాడు. ఉజ్బెక్ టెన్నిస్ స్టార్ డెనిస్ ఇస్టోమిన్‌తో తలపడనున్నాడు. నేను మంచి టెన్నిస్ ఆడుతున్నాను. నన్ను ఓడించాలంటే నా ప్రత్యర్థి నాకంటే మంచి స్థాయిలో ఆడాల్సి ఉంటుంది. నా విజయంపై నాకు విశ్వాసముంది అని ఫెదరర్ తెలిపాడు. ఫెదరర్ ఇటీవల ఫెర్త్‌లో జరిగిన హోప్‌మన్ కప్‌లో విజేతగా నిలిచి ఆత్మ విశ్వాసంతో ఆస్ట్రేలియన్ ఓపెన్ బరిలోకి దిగుతున్నాడు.

యువ ఆటగాళ్ల నుంచి గట్టి పోటీ

ఈసారి ఆస్ట్రేలియా ఓపెన్లో యువ స్టార్ ఆటగాళ్లు జర్మనీకి చెందిన జెవెరెవ్, క్రొయేషియాకు చెందిన బోర్నా, రష్యాకు చెందిన కరెన్ ఖచనొవ్, గ్రీస్‌కు చెందిన స్టెఫానో టిసిట్సపాస్ తమ ఆటతో సీనియర్లకు చెక్ చెప్పనున్నారు. హోప్‌మన్ కప్ మిక్స్‌డ్ టీంలో ఆటగాడిగా ఫైనల్‌కు చేరిన 21 ఏళ్ల జెవెరెవ్ తన పోరును పూర్ణ విశ్వాసంతో ప్రారంభించనున్నాడు. మెల్‌బోర్న్‌లో ఇప్పటివరకు ఆడిన మ్యచుల్లో జెవెరెవ్ మూడో రౌండ్ కంటే దిగువన ఓడలేదు. గత ఏడాది నాలుగో సీడెడ్‌గా ఉన్న జెవెరెవ్ మంగళవారం తన ఓపెనింగ్ మ్యాచ్‌లో స్లొవేనియాకు చెందిన ఆల్‌జాజ్ బెడెనెతో మంగళవారం తలపడనున్నాడు. ఆస్ట్రేలియాలో అభిమానులు ఈసారి తమ దేశానికి చెందిన ఆటగాళ్లలో ఒకరు కొత్త చాంపియన్‌గా అవిర్భవించాలని కోరుకుంటున్నారు. ఆస్ట్రేలియా యువ ఆటగాడు 27వ సీడెడ్ అలెక్స్ డి మినౌర్ సోమవారం తన ప్రారంభ మ్యాచ్‌లో పోర్చుగల్‌కు చెందిన పెడ్రో సౌసాను ఢీ కొననున్నాడు.

ఆస్ట్రేలియాకే చెందిన నిక్ కిర్గియోస్‌కు కఠిన ఓపెనింగ్ లభించింది. తన తొలి మ్యాచ్‌లో వరల్డ్ నెంబర్ త్రీ ఆటగాడు మిలోస్ రానొక్‌తో అనంతరం రెండో రౌండ్లో మాజీ ఆస్ట్రేలియన్ చాంపియన్ స్టాన్ వావ్రింకాతో తలపడే అవకాశముంది.

రాయుడు బౌలింగ్ తీరుపై

అనుమనాలు

బౌలింగ్‌ను పరీక్షించనున్న ఐసీసీ



దుబాయ్: భారత బ్యాట్స్‌మన్ పార్ట్ టైం బౌలర్ అంబటి రాయుడు బౌలింగ్ యాక్షన్‌ను మ్యాచ్ అఫీషియల్స్ తప్పుబట్టారు. శనివారం ఆస్ట్రేలియాతో ఆడిన తొలి వన్డేలో రాయుడు రెండు ఓవర్లు బౌలింగ్ చేశాడు. 33 ఏళ్ల రాయుడు ఆఫ్ స్పిన్ బౌలింగ్ చేస్తాడు. రాయుడు బౌలింగ్ చేసే తీరు నిర్ణీత ప్రమాణాల మేరకు లేదని మ్యాచ్ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తూ.. ఐసీసీకి తెలిపారు. ఈమేరకు ఐసీసీ ఆదివారం మీడియాకు ఒక ప్రకటన చేసింది. 'రాయుడు బౌలింగ్ ఆక్షన్ పరిశీలనలో ఉంది. ఐసీసీ నిబంధనలమేరకు అతని బౌలింగ్ తీరు సరిగా లేదు. అతను 14 రోజుల్లో బౌలిరిగ్ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ కాలంలో రాయుడు అంత ర్జాతీయ క్రికెట్లో బౌలింగ్ చేయవచ్చు. పరీక్ష ఫలితాలను వెల్లడించేవరకు అతను బౌలింగ్ చేయడానికి అనుమతి ఉంది.' అని ఐసీసీ తెలిపింది. రాయుడు ఇప్పటివరకు 46.1 ఓవర్లు ఆడి 20.1 ఓవర్లు బౌలింగ్ చేశాడు. మూడు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అతని ఎకానమి బౌలింగ్ 6.14. శనివారం నాడు ఆసీస్‌తో ఆడిన తొలి వన్డేలో డకౌటయ్యాడు. పరిమిత ఓవర్ల క్రికెట్ ఫార్మాట్లో దృష్టిని కేంద్రీకరించడానికి రాయుడు ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌నుంచి నవంబర్‌లో రిటైరయ్యాడు.

క్రీడాప్రభ

మహిళల సింగిల్స్ బరిలో గ్రాండ్‌స్లామ్ స్టార్స్

మహిళ సింగిల్స్‌లో గత ఏడాది అన్ని గ్రాండ్ స్లామ్‌లను గెలిచిన క్రీడాకారి ణులు ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్లో బరిలోకి దిగుతున్నారు. రుమేనియాకు చెందిన గత ఆస్ట్రేలియా ఓపెన్ రన్నరప్ గా నిలిచిన సిమోనా హలెప్ తన వరల్డ్ నెంబర్ 1 ర్యాంకును కాపాడుకోవా లనుకుంటోంది. ప్రారంభ పోటీలో ఈస్టోనియాకు చెందిన కాయ కనేపితో తలపడనుంది. హలెప్ 2018 ఫ్రెంచ్ ఓపెన్ గెల్చుకుంది. వరల్డ్ నెంబర్ 2 క్రీడాకారిణి జర్మనీకి చెందిన అంజెలిక్ కెర్బర్ 2018 వింబుల్డన్, హోప్‌మన్ కప్‌ల విజేతగా నిలిచింది. కెర్బర్ తొలి రౌండ్‌లో స్లొవేనియాకు చెందిన పొలొనా హెర్‌కాగ్‌ను ఢీకొననుంది. 2018 ఆస్ట్రేలియా ఓపెన్ సింగిల్స్ విజేతగా నిలిచిన డెన్మార్క్‌కు చెందిన కరోలినా వోజ్నియాంకి తన తొలి పోటీలో అలీసన్ వాన్‌తో తలపడనుండగా, 2018 యూఎస్ ఓపెన్‌ను గెలుచుకున్న జపాన్ స్టార్ నవోకి ఒసాకా తొలి రౌండ్లో మగ్దా లినెట్టేని ఢీకొనుంది.

ముర్రే దిగ్గజ ఆటగాడు

- గాయంతో బాధపడుతూ రిటైర్మెంట్ ప్రకటించడం బాధాకరం:రోజర్ ఫెదరర్

మెల్‌బోర్న్: టెన్నిస్ దిగ్గజం బ్రిటన్‌కు చెందిన అండీ ముర్రే ఈ ఏడాదిలో టెన్నిస్‌నుంచి రిటైర్మెంట్ అవుతున్నట్లు ప్రకటించడండంపట్ల స్విట్జర్లాండ్‌కు చెందిన టెన్నిస్ స్టార్ రోజర్ ఫెదరర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. ముర్రే వెలకట్టలేని ఆటగాడని ఒక దిగ్గజ ఆటగాడి సాహచర్యాన్ని కోల్పోతున్నందుకు బాధగా ఉందన్నాడు. ఆదివారం ఫెదరర్ మీడియాతో మాట్లాడాడు. తొడ కండరం గాయంతో బాధపడుతున్న ముర్రే గత ఏడాది శస్త్ర చికిత్స చేయించుకున్నప్పటికి.. గాయం నుంచి విముక్తం కాకపోవడంతో తాను ఇక ఆటలో కొనసాగలేనని ఈ ఏడాది ఆడే వింబుల్డన్ టోర్నీ తన చివరి టోర్నీ అని శుక్రవారం కన్నీళ్లతో ప్రకటించాడు. అయితే నొప్పి తీవ్రంగా ఉండటంతో ప్రస్తుత ఆస్ట్రేలియన్ ఓపెన్ తన చివరి టోర్నీ కావచ్చని ముర్రే సంకేతాలిచ్చాడు. ముర్రే ప్రకటనతో నేను విచారానికి లోనయ్యాను. కొంత కాలం తర్వాత ముర్రేతో ఆడే అవకాశం కోల్పోతామన్న ఆలోచన మాకు మింగుడు పడటంలేదు అని ఫెదరర్ అన్నాడు. ఫెదరర్, ముర్రేలు రేపటినుంచి మెల్‌బోర్న్‌లో ప్రారంభం కానున్న ఈ ఏడాది తొలి గ్రాండ్ స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడనున్నారు. 'ఏదో ఒకరోజు ప్రతీ ఒక్కరిని కోల్పోవాల్సిందే. ముర్రే సాహచర్యం ఇంత తొందరగా ఇప్పుడే ముగుస్తుందన్న విషయం బాధగా ఉంది. బిగ్ ఫోర్ (దిగ్గజ నలుగురు నొవాక్ జకోవిచ్, రఫెల్ నాదల్, అండీ ముర్రే, ఫెదరర్) శకం ముగింపుకు చేరుకోవడం అవశ్యంగా మారింది' అని ఫెదరర్ చెప్పాడు. అండీ గురించి మాకు తెలుసు. అతన్ని బాగా ఇష్టపడతాము. నిజాయితీగా చెప్పాలంటే.. అతనికి ఎక్కువ మంది శత్రువులు లేరు. అతను హాల్ ఆఫ్ ఫేమర్. అతను కోరుకున్న విజయాలను అందుకున్నాడు. అతని లేని లోటు ఎవరి తోనూ పూడ్చలేనిది. అతను గొప్ప ఆటగాడు. వెలకట్టలేని గౌరవాలను అందుకు న్నాడు అని ప్రపంచ నెంబర్ 3 ఆటగాడు ఫెదరర్ తెలిపాడు. ముర్రే వింబుల్డన్‌ను రెండు సార్లు, గెలిచాడు. 77 ఏళ్లలో తొలిసారిగా వింబుల్డన్ కప్ గెలిచిన తొలి బ్రిటిషర్‌గా ముర్రే ఖ్యాతి సంపాదించాడు. 2016లో వరల్డ్ నెంబర్ 1 హోదా సాధించి పురుషుల టెన్నిస్‌లో రారాజుగా నిలిచాడు. నేడు ప్రారంభం కానున్న ఆస్ట్రేలియన్ ఓపెన్లో ముర్రే తన తొలి మ్యాచ్‌లో స్పెయిన్‌కు చెందిన రాబర్టో బాటిస్టా అగట్‌తో తలపడనున్నాడు. బాటిస్టా ఈ టోర్నీలో 22వ సీడెడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. కతార్ ఓపెన్ టోర్నీలో విజేతగా నిలిచిన బాటిస్టా సెమీ ఫైనల్లో నొవాక్ జకోవిచ్‌ను ఓడించాడు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.